ఆగస్టు, 2023
సంపుటి 03, సంచిక 19

తెలంగాణ జాగృతి

# తంగేడు

తెలంగాణ సాహిత్య మాసపత్రిక

77వ స్వాతంత్ర్య దినోత్సవ
శుభాకాంక్షలు...



కథారచయిత్రి
**పాకాల యశోదారెడ్డి**
జయంతి : 1929, ఆగస్టు 8



రచయిత

## వానమామలై వరదాచార్యులు

జయంతి : 1912, ఆగస్టు 16

*Printed, Published and Owned by :* ***KALVAKUNTLA KAVITHA***
Printed at : **HARSHITHA PRINTERS**, Khairatabad, Hyderabad - 500 004.
Published at : **BHARATHA JAGRUTHI,** Pasham Amruthaaram Residency, H.No. 1-2-234/13/46/4, 4th Floor, Near NTR Stadium Aravind Nagar, Domalguda, Hyderabad - 500 029. Telangana State.
Editor : **KALVAKUNTLA KAVITHA**

# విషయ సూచిక


విత్తనాల కడుపులో పచ్చని కాంతి చూపించిన **ముదిగొండ సంతోష్** కవిత "స్పర్శ రేఖ" ....పేజీ 26

తన ఆత్మబంధువు ఆకలి, అంటున్న **హరికృష్ణ** కవిత "ఆకలి" ....పేజీ 39

రచనలో **కాణాదం** ప్రతిభ నాటికవిత "పద్య విలాసం"....పేజీ 04

కవి ఒక జ్ఞాన చేతనం అంటున్న **నీహారిణి** కవిత "కవి"....పేజీ 50


27

మనిషి జీవిత పరమార్థాన్ని చిత్రీకరించిన **రామా చంద్రమౌళి** కథ "పొక్కిలి"


35

వెలగందుల చరిత్రకు వెలుగులద్దిన పుస్తకం పైన **కూర చిదంబరం** వ్యాసం "సమగ్రమైన వెలగందుల చరిత్ర"


17

ఇతరుల కష్టాలకు స్పందించే సహృదయతను చిత్రించిన **అన్నం పద్మజ** కథ "నిండు మనసులు"


37

సైనికుని అంకిత భావం గురించి భార్య మనోగతం **ఉమాదేవి** కథ "సైనికుని భార్య"


07

నాటి సామాన్యుని బ్రతుకును చిత్రించిన **గూడూరు సీతారాం** నాటి కథ "నారయ్య బతుకు"


41

తెలంగాణ హిందీ సినీ కథానాయకుని ప్రస్థానాన్ని తెలియజేసిన **రమేష్ బాబు** వ్యాసం "హిందీ తెరపై మన హీరో"

51 త్రివర్ణ పతాక నిర్మాత పింగళి వెంకయ్యను స్మరించిన వ్యాసం... **భాగ్యలక్ష్మి** "మువ్వన్నెల జెండా ఘనకీర్తి"

31 నిత్యానందరావును తన వ్యాసంలో పరుసవేదిగా అభివర్ణించిన **వెల్దండి శ్రీధర్** వ్యాసం.. "పరిశోధనా పరుసవేది..."

పది ఏళ్లలో తెలంగాణ పరిణామం చెప్పే **నంది శ్రీనివాస్** కవిత "వెలుగుల వానను" ....పేజీ 06

వెన్నెల కలంలో వంచుకున్న **వకుళ వాసు** "గజల్" .....పేజీ 38

భావుకతతో పరిమళించిన **సునంద** కవిత, "ఊహా లోకంలో" .....పేజీ 16

కుప్పాంబిక తొలి తెలుగు పద్యం పరిచయం చేసిన **శ్రీకాంత్** తొలి తెలుగు కవయిత్రి "కుప్పాంబిక" .....పేజీ 49

ప్రేమను చెప్పక చెబుతున్న **రఘువర్మ** అనువాద కవిత "నేను నిన్ను ప్రేమించడం లేదు!" .....పేజీ 54

అవధాన గ్రంథానికి "హృదయాభినందనం" .....పేజీ 21

తెలంగాణ సాహిత్య పరిశోధన లోతులు చూస్తున్న **గుమ్మన్నగారి** వ్యాసం "తెలుగు సాహిత్యంలో తెలంగాణ శ్రీకారాలు" .....పేజీ 11

మనిషి, ప్రకృతి సమాంతర చలనా చలన జీవులు అంటున్న **రాధాకృష్ణమాచార్యుల** కవిత "ఆకుపచ్చ అలలు" .....పేజీ 40

ఇంకా... మరెన్నో కవితలు, సాహితీ శిఖరం, సమాజం, పుస్తక పరిచయం, స్వీకారం.. మొదలైనవి...


**తంగేడులో ప్రచురిస్తున్న రచనలలో వ్యక్తమయ్యే అభిప్రాయాలు ఆయా సృజన కారుల సొంతం. వీటితో సంపాదకులకు ఏకీభావం ఉండవలసిన అవసరం లేదు. విభిన్న ప్రక్రియలకు అభిప్రాయాలకు వేదిక కావడమే తంగేడు లక్ష్యం.**

# పద్య విలాసం

**కాణాదం పెద్దన సోమయాజి**

అభినవభోజుడుగా ప్రసిద్ధి పొందిన గద్వాల రాజు చిన్న సోమభూపాలుని ఆస్థాన కవులలో ఒకరు కాణాదం పెద్దన సోమయాజి. ఈయన 1752-93 మధ్య కాలం వారు. అతని శైలి అనుసరించి పెద్దన సోమయాజి అని పిలుస్తారు. ఈయన రచనలు లభ్యమైనవి బాలకాండ, శ్లోకతాత్పర్య రామాయణం, ఆధ్యాత్మిక రామాయణం ముకుంద విలాసము మాత్రమే. ఆధ్యాత్మిక రామాయణం, సంస్కృత రామాయణం ఆధారంగా రచించాడు. చినసోమభూపాలుని కోరిక మీద యథాశ్లోక తాత్పర్య రామాయణం ప్రారంభించి బాలకాండము అనువదించాడు. కాణాదం సోమయాజి గ్రంథాలలో ఉన్నన్ని చిత్ర కవితా రీతులు మరే కవిలోను ఉండవని కందుకూరి వీరేశలింగం అన్నారంటే ఈ కవి ప్రత్యేకత తెలుస్తుంది. ముఖ్యంగా ముకుంద విలాసము శ్రీకృష్ణుడు మేనత్త కూతురు అయిన భద్రను వివాహమాడడం అనే ఇతివృత్తం కలిగిన కావ్యం నుంచి మా పాఠకుల కోసం ఈ రెండు పద్యాలు తీసుకోబడ్డాయి. వడ్డేపల్లి కృష్ణ గారి తెలంగాణ ప్రముఖ కవులు కావ్యాలు పుస్తకం ఈ సేకరణకు దోహదం.

కం. కుందవిలాసము తావి ము
కుంద విలాసము సదా ముకుంద విలాసం
బిందు విలాసమును సుధా
బిందు విలాసము హసించు పేశల ఫణితిన్!

సీ. సిరిగురించినయాలు నరిధరించిన కేలు
నరిహరించిన వాలు నమరుసామి
నుడుగునేలిన చూలు నడుగుదేలినజాలు
వడుగు బోలిన మేలు నడరుసామి
నీటనింబగు ప్రోలు హాటకంబగు శాలు
నాటకంబగు చాలు నడపు స్వామి
సగము మోచిన వ్రేలు జగముబ్రోచినదీలు
ఖగము డాచిన డాలు దగినసామి

గీ. వారినిధి బారి గిరిదూరి వసుధజేరి
వైరి దెగజీరి ధరగోరి వరకుఠారి
దారి కుముదారికులు పేరి సీరి నెనరు
మీరి హయచారి కేశవ శౌరి వెలయు'' (ము.)

సంపాదకీయం

తెలంగాణ జాగృతి
తెలుగు సాహిత్య మాస పత్రిక

ఆగస్టు, 2023

సంపుటి 03 సంచిక 19



శ్రీమతి కల్వకుంట్ల కవిత
ఎడిటర్



డా॥ కాంచనపల్లి గోవర్ధన్ రాజు
అసోసియేట్ ఎడిటర్
9676096614

ఎడిటోరియల్ బోర్డ్ :
ఘనపురం దేవేందర్
రంగు నవీనాచారి

# కవిత్వంలో వర్షం

సంస్కృత సాహిత్యంలో వాల్మీకి, కాళిదాసు, శూద్రకుడు లాంటి కవులు అద్భుతంగా వర్షాన్ని వర్షాగమనాన్ని వర్ణించారు. ప్రబంధాలలో కృష్ణదేవరాయల వర్షం వర్ణన అంతకంటే భిన్నంగా ఉంది. వర్షం ప్రభావం వల్ల మహానగరాలలో జనం ఎట్లా ఇబ్బంది పడుతున్నారో మనం చూస్తున్నాం. తోవలో వానలో నడిచే జనాల నుండి వంట చేసుకునే గృహిణుల దాకా పడుతున్న ఇబ్బందులు ఆముక్తమాల్యలలో వర్ణిస్తాడు. పండి మగ్గిపోయిన మేడి పండు మీద వాన నీళ్లకు కన్నాలు పడి అందులోంచి దోమల గుంపు బయటికి వచ్చిందట. వేసవి గాలులు అణిగిపోయిన సంతోషంలో తీరిగ్గా అల్లరి చేద్దామని అవి బయటికి వచ్చాయట. ఇట్లా ప్రాచీన కావ్యాలలోనే కాక ఆధునిక కవులు కూడా వానను అద్భుతంగా వర్ణించారు. కుందుర్తి కవి 'నగరంలోవాన' వానను గురించిన గొప్ప వ్యక్తీకరణ.

"రిక్షాలో కూర్చున్న ఘోషాసుందరిలా ముఖానికి అడ్డం కట్టుకున్న మొయిలు ముసుగులు తొలగించి ఎన్నిసార్లు చూశాడోలోకం వైపు. శత సహస్ర కిరణాల బాకులు ఝుళిపించే చాకచక్యం తగ్గింది. ప్రాణాలు తీసే ప్రతాపం పాపం శీతలానికి తల ఒగ్గింది".

కుందుర్తి చిత్రించిన ఈ కవితలో నగరం ఏ విధంగా వానను అనుభవించిందో చెబుతాడు. ప్రకృతి పరిణామాన్ని మానవ స్పందనలతో పెనవేస్తూ సాగిన కవిత అది. ఆధునిక కవిత్వంలో చాలామంది వాన గురించి అనుభూతి కవిత్వం రాశారు. ఒక ఆధునిక కవి ఓ వాన కురిసిన రాత్రి కవితలో వాన వల్ల ఏ వర్గం ప్రజలు ఏ విధంగా ఉంటారో చిత్రించాడు. నిజమే... వాన ధనవంతులకు వరం లాంటిది అయితే, బడుగు బలహీన వర్గాలకు ఎంత కంటకప్రాయమో ఈనాడు మనం చూస్తున్నాం. మనిషి శాస్త్రీయ విజ్ఞానంలో ఎంతో ప్రగతి సాధించాడు. అంతరిక్షంలోకి దూసుకుపోతున్నాడు. గ్రహాంతర జీవశక్తి గురించి శోధనలు చేస్తున్నాడు. కానీ ఎంత చేసినా ప్రకృతికి అనుకూలంగా జీవించక తప్పడం లేదు. నాడు కరోనా రూపంగా ఇప్పుడు అమితంగా వచ్చే వర్ష బీభత్సం కారణంగా ఎట్లా ఉపద్రవం కలుగుతుందో తెలుస్తూనే ఉంది. అతివృష్టి, అనావృష్టి ఏదైనా ఉపద్రవమే. కాలాన్ని జయించాలనుకునే మనిషికి కాలం ఎంత అతీతమో ఇలాంటి అంశాలను చూస్తే తెలియ వస్తుంది. వాతావరణ సమతుల్యత దెబ్బతింటే ఏం జరుగుతుందో అనుభవానికి వస్తుంది.

వాన సార్వత్రికం. దాన్ని గురించి ఒక్క తెలుగు కవి మాత్రమే కాదు, ప్రపంచంలోనే అందరూ కవులు స్పందించారు. ఆంగ్ల కవుల కవితల్లోనూ వాన గురించిన గొప్ప అభివ్యక్తులు కనిపిస్తాయి. Wadsworth The Rainy Day Poem వర్షం అనివార్యతను, మేఘసంవృతమైన ఆకాశం అవిభాజ్యతను గురించి చెబుతూనే, ఇటువంటి ఒకరోజు ప్రతివ్యక్తి జీవితంలోనూ ఉంటుందని సార్వజనీనకం చేస్తాడు.

Be still sad heart, and cease repining;
Behind the clouds is the sun still shining;
Thy fate is the common fate of all,
In to each life same rain must fall,
Some days must be dark and dreary

షేక్స్పియర్ గాలివానలను జీవితాలలో వచ్చే కష్టాలకు ప్రతీక చేస్తాడు. ఆయన Twelfth Nightలో,

When that I was little Tiny boy
With hey, ho, the wind and the rain
A foolish thing was but a toy
For the rain, it raineth every day.

వర్షాన్ని గురించి భావుకతలో ఎన్ని అనుభూతులు వ్యక్తం చేసినా, మనిషికి జీవితం కొనసాగింపుకు అదొక అనివార్యమైన ఆగమనం. అదేవిధంగా అదొకవేళ పరిమితిని దాటి కురిస్తే సృష్టికే ప్రమాదం. వర్షాన్ని మనిషి ఎంత ప్రేమిస్తాడో అంత ద్వేషించాల్సి వస్తుంది. కాబట్టి మానవ మనుగడకు వర్ష సమతుల్యత అత్యవసరం. దానికి మనిషే పూర్తిగా బాధ్యుడు. మనిషి ప్రకృతిని కాపాడుకునే విధంగా కాపాడుకుంటే వర్షం కూడా హర్ష సుందరంగా పరిణమిస్తుంది. ఆహ్లాదకరమైన పద్యమై అలరిస్తుంది.

జై తెలంగాణ! జై జాగృతి!!

కవిత కల్వకుంట్ల

ఈ మాసం కవిత

# అగ్గిమీద గుగ్గిలం



**అన్నవరం దేవేందర్, 94407 63479**

అన్నవరం దేవేందర్ కవి, రచయిత, కాలమిస్ట్. గత 25 ఏళ్లుగా నిరంతరం తెలంగాణ తెలుగు పదాలతో కవిత్వం రాస్తున్నారు. ఇప్పటికీ 12 కవితా సంపుటాలు, రెండు వ్యాస సంకలనాలు వెలువరించారు. ఆయన కవిత్వం ఆంగ్లంలోకి కూడా అనువాదం పొందింది. తెలంగాణ ప్రజలకు నిలువెత్తు కవితా సంతకంగా నిలుస్తున్న ఈ కవి అక్టోబర్ 17, 1962లో పోతారం, హుస్నాబాద్ మండలం, సిద్దిపేట జిల్లాలో జన్మించారు. మహాత్మ జ్యోతిబా పూలే ఫెలోషిప్, రంజని కుందుర్తి ఉత్తమ కవితా పురస్కారం, అలిశెట్టి ప్రభాకర్ స్మారక పురస్కారం, ఉమ్మడిశెట్టి త్రిశతాబ్ది పురస్కారం, సినారే పురస్కారం, తెలుగు విశ్వవిద్యాలయం సాహితీ పురస్కారం లాంటి పురస్కారాలు ఎన్నో ఆయన్ని వరించాయి. అన్నవరం దేవేందర్ కవిత్వం కన్ను, ఈనాడు నీటి పారకంలో దాహం తీర్చుకుంటున్న పొలాన్ని, గాలికి తలలూపుతున్న పంటచేయలని చూస్తున్నది. ఇది పాఠకునిలో ఆవిష్కరించడానికి అన్నవరం దేవేందర్ కవిత "అగ్గిమీద గుగ్గిలం" ఈ మాసం కవితగా మీ కోసం...

ఆకాశంలో అమరత్వం పరివ్యాప్తమై
పొటమరించిన పోరాటం ఉదయించింది
పురి విప్పిన అస్తిత్వం జన పతాకమై
అలల రెక్కలు విప్పుకుంది
ఆశలూ ఆశయాల కాలం కొనసాగుతుంది

యాస యాసని దూరం ఉంచితే
లయాత్మక భాషగా వాసిల్లుతున్న కాలం
మాధ్యమాలన్నింట ప్రామాణికమైన సంభాషణలు

నాలికల మీంచే పదాల పుట్టుక
పదపదాల కూర్పే నిఘంటు నిర్మాణం
పల్లెటూరి పలుకులకు కావ్య గౌరవం
ఇప్పుడు భాషా కోశాలన్నీ నిండుతున్నయి

కరువు దరువులతో కన్నీళ్ల దునుకంగ
గలగల నీళ్లన్నీ కిందికే ఉరుకంగ
మర్లించి పారించి పరవశించిన కాలం
సకల జనులు దిద్దిన సమ్మె ఫలితం

నీటి పారకంతో దాహం తీర్చుకున్న పొలం
తరి భూములన్ని పచ్చ పచ్చని దృశ్యం
గాలికి తలలూపుతున్న పంట చేలు
వ్యవసాయం ఒకింత ఫల సాయమైంది

దాచి ఉంచిన పార్యం పటాపంచలైంది
విస్మరించిన చరిత్ర విస్తృతమైంది
సిలబస్ నిండా కొత్త పూల వికాసం
నిలిపి ఉంచిన అక్షరం వెల్లి విరిసింది
కనిపించని జీవితం కవితావస్తువైంది

తెలంగాణమంటే పోరాట వారసత్వం
తెలంగాణమంటే అగ్గిమీద గుగ్గిలం
అన్యాయంపై ఎదురు నిలిచే ధర్మత

తెలంగాణ పదమే నాదస్వర శబ్దం
తెలంగాణ వాక్యమొక సంగీత వాద్యం
తేటతెలంగాణమే తెలుగు సౌందర్యం



నాటి కథ

# నారయ్య బతుకు

ఓ తండ్రి అపేక్ష చెప్పే కథ...



గూడూరి సీతారాం

**కవి పరిచయం...**

*తెలంగాణలోని తొలితరం కథారచయిత. తెలంగాణ యాసలో, భాషలో కథలు రాసిన సీతారాం 1953-1965 వరకు సుమారు 80 కథల వరకు రాశాడు. వీరు జూలై 18, 1936 హనుమాజీపేట్, సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాలో జన్మించారు. సీతారాం యాభయ్యవ దశకంలో తెలంగాణ వాగువంకల చప్పుళ్లను ఆవిష్కరించారు. యాసలో, ఎత్తుగడలో, కథలో నిలువెల్లా సీతారాం శైలి కనిపిస్తుంది. నగరాలు దగ్గరై నేడు పల్లెపదాలు, పదబంధాలు ఎన్నో మెరుగున పడిపోయాయి. వాటిని విప్పేవారు చెప్పేవారు కరువైనారు. "నారయ్య బతుకు" కథ 1954లో స్రవంతి మాస పత్రికలో మొదటిసారి ప్రచురితమైంది. అప్పటికే ఆయన "రాజమ్మ రాజరికం" లాంటి కథలతో కథా ప్రియులకు పరిచయస్తులు. గూడూరి సీతారాం సెప్టెంబర్ 25, 2011న కన్నుమూశారు.*

పొద్దు గూకస్తుంది. నారయ్య మంచంల కెల్లి లేచి అవతలి మొకాన పోవల్లనుకుంటున్నడు. కండ్లు మూసి తెరిసేవరకే అయిపోయింది. నారయ్య కోడలు కల్లు అంచుతుండంగ అంచుతుండగనే, చేతిలోనే ఆకును కిందపారేసి దాని కొంగు పట్టి గుంజిండు కల్లు తాగెటోడు. అది లబ్బలిబ్బ మొత్తుకుంది. ఆనికి పక్కన కూసున్న యింకోడు జెట్టన లేచి దొడమీదికెల్లి యియ్యర బయ్యర నాలుగుతికిండు.

లేచి నిలుసున్న నారయ్య అట్లనే కూలపడిపోయిండు. ఒక్కసారి కండ్లు బైర్లు కమ్మినట్లయింది.

* * *

చిన్నతనాన్నే నారయ్యకి లగ్గమైంది. ఆని అయ్య, అవ్వ ఎప్పుడూ నారిగాని లగ్గమెప్పుడైద్దో, చూసి సల్లగా కన్ను మూయాలనుకున్నరు. ఆఖరికి అల్లు అనుకున్నట్టే, ఓ అయిందేండ్ల పోరిని దెచ్చి నారిగానికి ముడేసిండ్రు. నారయ్యకి యిద్దరన్నలూ, ఒక అక్కా ఉన్నరు. గప్పుడు అందరు పొత్తుల్నే ఉండెటోళ్ళు. కాని యింట్ల పడకుంట వచ్చింది. నారిగాని యిద్దరు వదినెలూ యింట్లుంటే సాలు, పొయిల ఉప్పేసుకున్నట్టే. గందుకే నారిగాని పెండ్లాం పెద్దది కాకముందే అన్నగార్లు ఏరుపడ్డారు. అప్పటికి నారిగాడు చానా సిన్నోడు. మా అంటే పదమూడు పద్నాలుగేండ్లు ఉండొచ్చు. ఆళ్ళు ఏరువడే వరకే అయ్య చచ్చిపోయిండు. యిగ నారిగాడు తల్లిని పట్టుకొని ఉన్నడు. అనికి అక్క అవ్వ దప్ప లోకంల దిక్కెవ్వలున్నరు? పెండ్లముండే గాని అదీ సిన్నపోరేనాయె. మెల్ల మెల్లంగ నారిగాడు తల్లిని పట్టుకొనే పెద్దోడైండు. గానీ గప్పటికే నారిగాని అవ్వకు సాతగాకుండ అయింది. ఇగ అవ్వకే అన్ని చేసి పెట్టాల్సి వచ్చింది. గట్లకూడా కొన్ని దినాలు గడిపిండు. ఎందుకో ఏమో పెండ్లాముండంగ వండి పెట్టిండు. అవ్వకు అన్నీ అరుసుకునుడు సిన్నతనమని పించింది నారిగానికి, గట్ల అనిపించిన్నాడే అవ్వకు జెప్పి అత్తగారింటికి పోయి పెండ్లాన్ని యెంట పెట్టుకొచ్చి యింటిపనల్నీ జేయించిండు.

నారిగాడు ఉడుకు నెత్తురు వట్టి ఉన్నడు. అని అన్నగాళ్లు సెరొక ఐదు తాళ్లు పట్టుకుంటే నారిగాడు పది ఒక్కడే తీసుకున్నాడు. ఊర్లోల్లందరికన్నా పొద్దుగా లేచి తాళ్ళకు వొయ్యేది. జెప్పజెప్పన గీసి కల్లు నింపుకొని, ఈదుల్లకు వొయ్యేది. అక్కడా కల్లు యిడుసుకొని అందరికన్నా ముందుగాల్నే ఊరుజేరేది. మందంతా రెండు కడువలు కావడికేసుకొని మోసుకస్తే, నారిగాడు మూడు, ఒక్కొక్క సారి నాలుగు వేసుకొని వొచ్చేది. యింటికి రాంగానే నారిగాని పెండ్లాం లసుము కల్లు అమ్మేది. ఇగ ఈడేమో యింత దిని, సుట్టేసుకొని కమ్మంగా గుర్రు పెట్టుకుంట

పండుకునేది. మల్లా మూడు జాములు దాటంగానే ఓ సుట్టేసుకొని కావడి, మోకు ఏసుకొని, ఎల్లిపోయి రాత్రి కొచ్చేటోడు. రాత్రి దెచ్చిన కల్లును గూడా లసుము సాకల్డి ఊరు దిరిగే దాకా అమ్ముకుంటూ మందికి కల్లు అంచుకుంటనే ఉండేది.

ఇప్పుడిప్పుడే నారిగాని బతుకు ఒక తొవ్వల పడ్డదని నలుగురూ అనుకుంటున్నరు. అనికి దగిన పెండ్లామే దొరికింది. ఏదో ఉన్నది కలో గంజో ఉడికేసి గుట్టుగా సంసారం గడుపు కొస్తుంది. నారిగానికి అవ్వపోయిన సంగునే లసుము మరపించింది. సిన్నప్పుడేమో అవ్వ - పెద్ద పెరిగినాంక నేమో పెండ్లాం ఆనికి దిక్కైంద్రు. నారిగాడు అవ్వపోయినాంక దిక్కులేని పచ్చి అయిండు. అన్నగాళ్ళేమో అంచుకన్నా రానియ్యలే! మొన్నటిదాకా జీతం చేయించుకున్న పటేలు దొంగతనం మోపి, యాపంతా మెదిగవెట్టి యింటికి పీకుమన్నడు. తాళ్ళెక్కి కల్లు గియ్యాలనుకున్నాడు నారిగాడు. కాని అనికి తాళ్ళు. ఎవలిస్తారు. ఎవలిప్పిస్తరు. అయినా చూద్దామని తెగించి ఓనాడు పొద్దున్నే ముస్తాజర్ యింటికి పోయి పెద్ద సాకల్డి ఊరు తిరిగే యాల్లదాకా నిలుసోని, ఆయన్ని కలిసి అడిగిండు. కానీ పాపం. అన్ని ఎవలు అడుగుతరు. “పో యెల్లు గాడిద. నీకెవడిత్తడ్రా తాళ్ళు. రేపటాల్ల

**నారిగాని బతుకు మళ్ళా మొదటికే పోయింది. తాళ్ళెక్కి ఊళ్ళెకు పొద్దుగాల్నే రావాలని ఎంతజేసినా కాలేదు. పొద్దుగాల లేవాల్నాయె- కుండలు కడుక్కొని యింత ఉడికేసుకోవాలాయె. యివన్నీ జేసేయాలకే పొద్దుపోతుంది. ఇగ తెచ్చిన కల్లు ఎంత రాత్రైనా అమ్ముడు పోతనే లేదు.. అమ్ముడు యవ్వారం నారిగాని సేతి కబ్బలేదు. అదీగాక ఇదివరకు నారిగాడెన్నడూ కల్లు అమ్మకనే పాయె.**



ఏదన్న జోకమైతే కిస్తీ యాల్లకు రకం యియ్యకుంటే ఏం జేసేది. ఆరి నీకు ఊళ్లో ఎవలన్నా జమానతు ఉంటే తీసుకరా. చూద్దాం” అన్నాడు. పాపం.. దిక్కు మొక్కులేని నారిగానికి జమానతు ఎవలుంటారు. ఆనికి ఉందామన్నా సక్కంగా కొంపలేదాయే- భూమి- పుట్రా అసలే లేదాయె. నగలు అయితే ఆళ్ళ యింట-వంటా లేనే లేవాయె. యిగ ఎట్ల! నారిగాడు రెండు మూడు రోజుల్దాకా సక్కంగా తిండన్నా తినలే! తిన్నా పెయిన పట్టలే! ఆఖరికి పెండ్లాన్ని బాగా జూసిండు. లసుము గప్పటికే మొగనితోని మాట్లాడుతుంది. దాని పెయ్యిమీన లగ్గంల పెట్టిన కాల్లకడాలు, సెవుల పోగులు కవపడ్డాయి. నారిగానికి ఏదో పోయిన పాణం లేచి వచ్చినట్లయింది. ఆ రాత్రంతా లసుమును ఎన్నోవిధాల బుదరకించిండు. పాపం దానికి మొగుడు పడుతున్న కష్టమంతా కనిపించింది. దాని పాణం కరిగిపోయింది. పెయ్యి మీదికెల్లి నవ్వుకుంటనే తీసి యిచ్చింది. నారిగాడు తెల్లారే సుక్క పొడవకముందే ముస్తాజరు దగ్గరికి ఉరికిండు తెచ్చిన నగలు కుదవపెట్టిండు. రెండు తాళ్ళను తీసుకొన్నడు. గా రెండు తాళ్ళతోని మొదలు పెట్టిన నారిగాడు గిప్పటికి పదితాళ్ళు గీసే మొగోడైండు. ఉత్త సెవులతో కాళ్ళతో ఉన్న లసుముకు, సెవులకు పడిగెలు కాళ్ళకూ, చేతులకూ కడాలు చేయించిండు, నడుముకు బిళ్ళల ఒడ్డాణం, ఆనికేమో మోసేతికి కడెం అవి యివీ బాగా చేయించిండు. నారిగాడు ఊళ్లో కొంచెం మోతెబారి ఆసామి అయిండు.

గదేందో సిత్రం. కచ్చురం మంచిగ పోయినట్టే పోయిపోయి ఒక్కసారే బొందల పడేదాక తెలువదు. నారిగాడి బతుకూ గట్లనే అయింది. గానాడు నారిగాడు ఎప్పటోలనే పొద్దుగాల తాళ్ళకు పోయి కల్లు తెచ్చి తిని పడుకున్నడు. అనికి నిద్ర పట్టకముందే లసుమూ రూపాయి పట్వ అమ్మింది. నారిగాడు మాంచి నిద్రల ఉన్నడు. ఎవరో లేవంగనే లేసి జూసిండు. ఏముంది లబోదిబో గొట్టుకున్నాడు. లసుము చచ్చిపోయింది. ఎట్ల చచ్చింది అన్నది నారిగానికి ఏమీ మనసున పట్టలే! కల్లు అమ్ముతుండగ అమ్ముతుండగనే పాణం విడిసింది. ఊళ్ళో నలుగురూ దానపొంటి సావు ఎవరికొస్తది. బంగారమసొంటి సావు. ఒగళ్ళతోటి ఏమన్న చేయించుకుందా ఏమన్నానా!. పని జేత్తు జేత్తు జచ్చిపోయింది. మారాజు' అని ఎవలకు తోచినట్లు వాళ్ళు అన్నరు.

నారిగాని బతుకు మళ్ళా మొదటికే పోయింది. తాళ్ళెక్కి ఊళ్ళెకు పొద్దుగాల్నే రావాలని ఎంతజేసినా కాలేదు. పొద్దుగాల లేవాల్నాయె- కుండలు కడుక్కోని యింత ఉడికేసుకోవాలాయె. యివన్నీ జేసేయాలకే పొద్దుపోతుంది. ఇగ తెచ్చిన కల్లు ఎంత రాత్రైనా అమ్ముడు వోతనే లేదు.. అమ్ముడు యవ్వారం నారిగాని సేతి కబ్బలేదు. అదీగాక ఇదివరకు నారిగాడెన్నడూ కల్లు అమ్మకనే పాయె. ఇప్పుడు రోజు పాసికల్లు మిగులుతుంది. గాకల్లునే కొత్తదాన్ల కలుపుతుండు. తాగేటోళ్ళు కూడా నారిగాని యింటికి ముందటోలె వస్తలేరు. అదేందే అంటరు. నూతిలో పడ్డోనిమీదే నూరు రాల్లన్నట్లయింది నారిగాని బతుకు,

కొన్ని దినాలు గడిసినయి. ఆనిలో ముందటోలె చురుకుదనం లేదు. మందకోడోలె తాళ్ళకు వోతడు. వస్తడు, ఎవలన్నా కల్లు కోసం వస్తె అమ్ముతడు. తాగెటొల్లకేమో వంచుతడు. యిదంతా చూచి నారిగాని అన్నలు లోపల్లోపల మురిసిపోయిండ్రు. కాని అంతా కలిసి నారిగానికి మల్ల లగ్గం జేస్తే ముందట పడుతడని అనుకున్నరు. బస్ అనుకున్న పదిరోజులకే కుంటీ, గుడ్డీ, చెవిటి గాని ఒకదాన్ని తెచ్చి నారిగానికి మార్వనం జేసిండ్రు. ఎనుక పడుతున్న నారిగాని బతుకు కొత్త పెండ్లాం ఎల్లితో మెరుగున పడ్డది. మల్ల మునుపటోలనే నారిగాడు తాళ్ళకు వోతుండు, కల్లు అమ్ముతుండు. ఆడు కడుపునిండా తింటుండు. నిద్రవోతుండు.

నారిగానికి గిప్పుడిప్పుడే మనసుల అంత ఎట్లనో అనిపియ్యవట్టింది. ఆదేందో ఒక్కొక్కరికి వద్దనంగా ఉసిల్ల పుట్టోలె పోరగాండ్లు పుడుతనే వుంటరు. కాని నారిగాడు మొక్కరాని దేవుండ్లకల్లా మొక్కుకున్నడు. కనపడ్డ సన్యాసితోని, కల్లుపోసి, అదీదిచేసి మంచిగ జేసుకొని తాయితులు కట్టించుకున్నడు. బయిండ్లోన్ని పిలిచి మీద ఏందో ఉందంటే నాలుగైదుసార్లు తీయించేసిండు. ఎంత చేసినా ఎల్లి కడుపుల యింత పిందె పడకపాయె. పాపం నారిగానికి ఏ చింతాలేదు. ఉండటానికి ఓ చతురసాల బవంతి కట్టించుకున్నాడు. చచ్చిపోయినాంక అవుతల పారెయ్యడానికి పోరడు ఉంటే ఎంత మంచిగుండు... నారిగాడు రోజులన్నీ ఇగ కొడుకు పుడుతడనే పనిజేస్తుండు. తింటుండు, పంటుండు కానీ ఎల్లి సప్పుడు జెయ్యక ఊర్కోలేదు. ఇక నాకెట్లయినా పిల్లలు పుట్టరు. ఇంకో దాన్ని తెచ్చుకొమ్మని బతిమిలాడింది. కాని నారిగానికి అది మంచిగ అనిపియ్యలే. ఇదువరకే ఇది రెండవ పెళ్లాం. ఇంకోదాన్ని తెచ్చుకుంటే మూడవది. ఛీ.. ఛీ... పెయ్యంతా జెర్రులు పాకినట్లయింది. ఇక ఎన్నడూ కలలగూడ ఈ మాట అనుకోవద్దనుకున్నడు నారిగాడు. అయిన గిప్పుడే ఏమైంది. దీన్ని తెచ్చుకొని మూడేండ్లన్నా కాకపోయే. ఇంకా చూద్దాం అనుకుని మనసును తాత్పర్యం చేసుకున్నాడు.

నారిగాడు పొద్దటిపొంటె పొయ్యొచ్చిండు. ఎల్లి కల్లు బాగానే అమ్ముతుంది. ఆనాడు నారిగానికి పడుకుంటే నిద్రపట్టలే! ఎల్లి కల్లు ఎట్ల అమ్ముతదో సూసుకుంట సూద్దామని పన్నోడు లేచి మంచముల్నే కూసున్నడు. ఎల్లి వచ్చినోనికల్లా మంచిమాటలు చెప్పి అక్కన్నే తాగినోని కల్లా ఆకు మీద కల్లును అంచుతుంది. ఇంటికి కొనుక్కపోయేటోల్లకు బింకిల పోసి యిత్తుంది. ఇంటికి తెమ్మన్నోలకేమో వక్క మొకాన పెట్టుకుంటుంది. నారిగానికి అక్కడ కూసుంటే మనసున పట్టలే. అందుల ఎల్లి అక్కడ కూసున్నలతో నవ్వుకుంట, తుల్లుకుంట, ఇంక ఏందేందో చేసుకుంట కల్లు అంచుతుంది. ఛీ.... ఛీ... ఏందేందో అనుకున్నడు. అట్ల ఎన్నడూ అనుకోని నారిగాడు ఎట్లెట్లనో అయిపోయిండు పావుగంటల.. గా పావుగంటల్నే మొదటి పెండ్లాం లసుము యాదికచ్చింది. లసుము బతికివున్నప్పుడు ఎవలు ఏమన్లేదు. కాని అది చచ్చిపోయినంక దాని మీద బాగా పుకార్లు పుట్టినయి. నారిగాడు అవన్నీ గాలి మాటలే అనుకున్నడు. కాని లసిమి గట్టాంటిది కాదని ఎందుకు అనుకోవాలె? నారిగాడు అడుక్కున్నాడు తనకు తానే! ఛీ..ఛీ... గంత మంచిదానిమీద అట్లాంటి మాటలా అని చెడామడా చెంపలేసుకున్నడు. యిగ యిట్ల కూసుని పిసోనోలె యిసారం చేయద్దనుకొని జెప్పుజెప్ప లేచి ఊళ్ళె మొకానవోయిండు.

నారిగాడు వాండ్లిళ్ల పెద్దమనిషి అయిండు. కిస్తీలు దగ్గరికి రాంగనే రకమంతా వసూలు చేసి ముస్తాజరుకు తనే యిచ్చి వస్తడు. ఇట్ట బాగా రోజుల్నించి నడుస్తుంది. ఆనాడు కిస్తీ పైకమంతా తీసకువచ్చి యింట్ల వెట్టిండు. పొద్దుగాల యిచ్చివత్తామని. గంతెల్లమే గట్ల అయితదని ఎవలన్నా కలగంటారా?

> **కొన్ని దినాలు గడిసినయి. ఆనిలో ముందటోలె చురుకుదనం లేదు. మందకోడోలె తాళ్ళకు వోతడు. వస్తడు, ఎవలన్నా కల్లు కోసం వస్తె అమ్ముతడు. తాగెటొల్లకేమో వంచుతడు. యిదంతా చూచి నారిగాని అన్నలు లోపల్లోపల మురిసిపోయిండ్రు. కాని వాళ్లంతా కలిసి నారిగానికి మల్ల లగ్గం జేస్తే ముందట పడుతడని అనుకున్నరు. బస్ అనుకున్న పదిరోజులకే కుంటీ, గుడ్డీ, చెవిటి గాని ఒకదాన్ని తెచ్చి నారిగానికి మార్వనం జేసిండ్రు.**

అయింత ఆరాత్రే ఎల్లి ఆ రకమంతా తీసుకొని యింట్లకెల్లి ఎల్లిపోయింది. నారిగాడు లబాలిబా మొత్తుకున్నడు. దాని తల్లిగారింటి మొకాన ఉరికిండు. ఆడ ఎవలున్నరు. ఉన్న ఒక్క ముసల్ది కడుపంతా కొట్టుకుంది. నా బిడ్డను వాగుపాలు చేసినవని, నారిగానికి యిగేం చేయాల్నో తొయ్యలేదు. పిచ్చోనోలె వారం రోజులు చెట్టనక, పుట్టనక తిరిగిండు. ఇంటికి వచ్చినాంక తెలిసింది ఆనికి. ఎల్లి ఆ ఊళ్లోడే అయిన కమ్మరి బాలిగానితో

లేసిపోయిందని.

అయింత ఎట్టెట్టనో జేసి రకమంతా గట్టిండు. నారిగాని బతుకు మల్లా ఎప్పటోలనే అయింది. ఇగ ముందటోలె మల్లా లగ్గం జేత్తమని ఊళ్లోలు ఎవరూ ముందుకు రాలె. కాని గిట్ల ఒక్కడే బతకడం నారిగానికి కష్టమైంది ఎట్లయినా జేసి మళ్ళా మార్వానం చేసుకుంటేనే మంచిది అనుకున్నడు. ఈసారి ఎవల పొత్తు పెట్టుకోకుండానే నారిగాడు పక్కఊరికి వోయి మొగడు చచ్చిపోయిన ముండరాల్ని మార్వానం జేసుకున్నడు.

ఇప్పుడు నారిగాడి బతుకు మూడో పెండ్లాంతో గడుస్తుంది. మల్లా నారిగాడు ముందటోలెనే పన్లు జేసుకుంటుండు. పెండ్లాం కల్లు అమ్ముతుంటుంది.

నారిగాని మూడో పెండ్లాం వయసులో ఉంది. నారిగానికేమో అప్పటికప్పుడే ఎం(టుకలు నరుస్తున్నాయి. దీన్ని తెచ్చుకున్నాంక యాడదిన్నర్దముల్నే కొడుకు పుట్టిండు. ఇగ నారిగాని సంతోషానికి పట్టపగ్గాల్లేకుండా పోయింది.

ఆనాడు మూడో పెండ్లాం కల్లు అంచుతుంది. నారిగాడేమో నిద్ర రాకపోతే మంచంల కూసోని కొడుకుని ఆడిస్తుండు. ఇంతట్లోనే కల్లు అంచుతున్న కాన్నుంచి పెండ్లాం మొత్తుకుంటున్నట్టు విని ఉరికిండు. కల్లు అంచుతుండగా దాన్ని కొంగుపట్టి గుంజినోన్ని నాలుగైదు తన్నిండు. ఛీ... ఛీ. యెదవబుద్ది అని తిట్టిండు. యిగ ఆన్నుంచి నారిగాడే కల్లు అమ్ముడు మొదలుపెట్టిండు. అదేమో యింట్ల పనులు జూసుకునేది. ఊళ్ళె కొయ్యి గొబ్బలు పట్టుకచ్చేది. అంతే!

ఇగ అప్పట్నించి నారిగాని కొడుకు ఎట్టెట్ట పెద్ద వెరిగిండో అట్లట్ల అని మూల ద్రవ్యం తరుగుడు వెట్టింది. కల్లు అమ్ముడు రోజురోజుకు తగ్గిపోయింది. ఇరువై తాళ్ళకెల్లి ఆఖరికి మూడు చిక్కినయి కొడుకు చేతికచ్చేవరకు. నారిగాడు తన కొడుకును తనోలె గాకుండా చూడాలని చాలా జేసిండు.

> **అయింత** ఎట్టెట్టనో జేసి రకమంతా గట్టిండు. నారిగాని బతుకు మల్లా ఎప్పటోలనే అయింది. ఇగ ముందటోలె మల్లా లగ్గం జేత్తమని ఊళ్లోలు ఎవరూ ముందుకు రాలె. కాని గిట్ల ఒక్కడే బతకడం నారిగానికి కష్టమైంది ఎట్లయినా జేసి మళ్ళా మార్వానం చేసుకుంటేనే మంచిది అనుకున్నడు.

మూడు తాళ్ళున్నా నిజాయితీగా బతుకుమన్నడు. కాని కొడుకు యినలే! ఈ ముసలోని మాట యిని గిట్ల కూటికి ఎవలు జత్తరు. కల్లమ్మెటోల్లంతా గట్లనే ఉంటారా? అని కొడుకు సవాల్- ముసలోడైండు. నారిగాడు ఏం జేత్తడు. యాల్లకు పడేస్తే తింటడు. ఓ మూలకు పంటడు. అంతే నారిగాని బతుకు.

## రచయితలకు సూచనలు

- ✓ సమీక్ష కోసం పుస్తకాలు పంపేవారు విధిగా రెండు కాపీలు పంపాలి.
- ✓ పత్రిక కోసం రచనలు పంపించే వారు యునికోడ్‌లో ఉంటే ఓపెన్ ఫైల్ మరియు పిడిఎఫ్‌లో మెయిల్ చేయండి.
- ✓ మా పత్రికకు రచనలు పంపినవారు ఇక్కడ అచ్చయాకనే ఫేస్ బుక్‌లో బ్లాగ్‌లో పెట్టండి.
- ✓ ప్రతి రచనకు ఇది ఎక్కడా ప్రచురణ కాలేదని, ఏ బ్లాగ్‌లో పోస్ట్ చేయలేదని, ప్రచురణ ప్రసారం కోసం ఎవరికీ పంపి ఉండలేదని హామీ పత్రం జత చేయండి.
- ✓ పత్రికలో ఒక కథ లేదా వ్యాసానికి నాలుగు పేజీలు మాత్రమే అవకాశం ఉంటుంది. ఈ లెక్కన పదమూడు వందల పదాలకు మించకుండా వ్యాసం, కథ పంపించండి.
- ✓ కవితలు 15 పాదాలకు మించకుండా పంపించండి.
- ✓ వ్యాసాలు, కథలు, కవితలు ఏవైనా పోస్ట్‌లో కూడా ఈ క్రింది చిరునామాకు లేదా ఇ-మెయిల్‌కు పంపవచ్చు.
- ✓ ప్రచురణకు స్వీకరించిన రచనల్ని పత్రికనుగుణంగా మార్పు చేసుకునే హక్కు సంపాదకవర్గం కలిగి ఉంటుంది.

**తెలంగాణ జాగృతి**

పాశం అమృతరాం రెసిడెన్సీ, ఇ.నెం. 1-2-234/13/46/4, 3వ అంతస్థు, ఎన్.టి.ఆర్. స్టేడియం దగ్గర, అరవింద్ నగర్, దోమలగూడ, హైదరాబాద్ - 500 029. తెలంగాణ. E-mail : editor@thangedu.co.in

వ్యాసం

# తెలుగు సాహిత్యంలో తెలంగాణ శ్రీకారాలు

తెలంగాణలో వివిధ ప్రక్రియల ప్రారంభ వికాసాలు...



కీ॥శే॥ డా॥ గుమ్మన్నగారి బాలశ్రీనివాసమూర్తి

సేకరణ : సంగిశెట్టి శ్రీనివాస్

'తెలంగాణ నిలువెత్తు తెలుగుదనానికి నిలయం. తెలుగు మాట్లాడే ప్రాంతాన్నే మధ్యయుగంలో తెలంగాణమనే పేరుతో వ్యవహరించారని చరిత్ర స్పష్టంచేస్తోంది. అచ్చమైన తెలుగు ఇక్కడ ఆనందనాట్యం చేసింది. తెలుగు ప్రభలను దిశ దిశలా వ్యాప్తిచేసే ఎన్నో ప్రక్రియలు తెలంగాణలో జన్మించాయి. ప్రతి పల్లెలోనూ అజ్ఞాత కవిత్వం తపిస్తోంది. లిఖిత సాహిత్యానికి ధీటుగా మౌఖిక సారస్వతంకూడ వెల్లువవలె ప్రవహించింది. అయినా- చాలాకాలం పాటు తెలుగు, సంస్కృత సాహిత్యాల పరిశోధకులు తెలంగాణ వాఙ్మయ సంపదపై చిన్నచూపే చూశారు. ఇక్కడ ... ..... తర్కరహిత ప్రతిపాదనలు చేశారు. అయితే పరిస్థితులు క్రమేపీ మారుతున్నాయి. తెలంగాణ.... ఎంతో ఆరాటంతో శోధిస్తోంది. కొత్త కొత్తగా వెలుగులోకి వస్తున్న స్పష్టమైన చారిత్రక సత్యాల్ని నిఖిల ప్రపంచానికి చెప్పేందుకు ప్రయత్నిస్తోంది. నిజం చెప్పాలంటే, నేటి తెలంగాణలో వినూత్నమైన సాంస్కృతిక ఆత్మవిశ్వాసం ప్రస్ఫుటంగ దర్శనమిస్తోంది.

శాతవాహనుల తొలి రాజధాని ప్రతిష్ఠానపురం. ఇది అనుమానమే అవసరం లేని నిజం. ఆనాటి ప్రముఖ నగరం. ప్రస్తుతం పైఠాన్ పేరుతో మరఠ్వాడాలో ఉంది. శాతవాహనులకాలం



శ్రీ గోన బుద్దా రెడ్డి

నుండే తెలంగాణలో వాఙ్మయారంభం జరిగింది. ఇక్కడ అందరూ గర్వించదగిన కథన సంప్రదాయం అంకురించింది. దీనికి శ్రీకారం చుట్టిన మహారచయిత గుణాఢ్యుడు. ఈ పండితుడు కుంతల శాతకర్ణి కాలం వాడని ఒక ఐతిహ్యం. గుణాఢ్యుడు పైశాచీ ప్రాకృతంలో బృహత్కథను రచించాడు. దురదృష్ట వశాత్తూ ఇది మొత్తం దొరకడం లేదు. గుణాఢ్యుడు మెదక్ జిల్లాలోని కొండాపురంలో బృహత్కథ రచన చేసినట్టు ప్రసిద్ధ పరిశోధకులు స్వర్గీయ బి.ఎన్.శాస్త్రి అంచనా. గుణాఢ్యుడు విషాద జీవితాన్ని అనుభవించిన మహా ప్రతిభావంతుడు. బృహత్కథ చాలావరకు అగ్నికి ఆహుతి అయింది. మిగిలిన కొన్ని భాగాలన్ని క్షేమేంద్రుడు, సోమదేవసూరి, సంస్కృతంలోకి అనువదించారు. వీరిలో క్షేమేంద్రుడు ఉత్తరాదివాడు కాగా, సోమదేవసూరి వేములవాడ ప్రాంతవాసి. శాతవాహనకాలంలోనే గాథాసప్తశతి అనే సంక్షిప్త కథాసంకలనమూ రూపుదిద్దుకున్నది. అందులోని గ్రామీణ కర్షక జీవన వర్ణనలు తెలంగాణా పల్లెసీమల తీరుతెన్నులకు ప్రతిబింబాలు. అటు తాత్వికసాహిత్యం, ఇటు లౌకికసారస్వతం రెండు శాఖలుగా సంస్కృత భారతి తెలంగాణలో తన దీప్తికి అందించింది. ఇక్కడే మరికొందరు సంస్కృత పండితుల్ని గురించి కూడా ప్రస్తావించాలి. అందులో మొట్టమొదట చెప్పదగిన విద్వాంసుడు మల్లినాధసూరి. భారతీయ వ్యాఖ్యాన సంప్రదాయంలో నిరుపమాన ప్రజ్ఞ అతడి స్వంతం. కాళిదాసు కావ్య హృదయంగా మల్లినాధుడిని అభివర్ణిస్తారు. మల్లినాధుడు కాకతీయ అనంతర యుగానికి చెందినవాడు. స్వస్థలం మెదక్ జిల్లాలోని ఈనాటి కొలిచెలిమె (కొల్చారం). "వాఖ్యాత చక్రవర్తి" "మహామహోపాధ్యాయుడు" అనే బిరుదులున్న మల్లినాథ సూరి కాళిదాసు కావ్యత్రయం 'రఘువంశం', 'కుమార సంభవం', 'మేఘసందేశం' కావ్యాలకు సంజీవనీ వ్యాఖ్యను రచించాడు. అట్లాగే భారవి 'కిరాతార్జునీయం' కావ్యానికి 'ఘంటాపథం' పేరుతో, మాఘకవి 'శిశు

వ్యాసం

పాలవధ'కు సర్వంకష వ్యాఖ్యను రచించారు. శ్రీహర్ష, భట్టి కావ్యాలకూ వ్యాఖ్యాలు కూర్చాడు. జ్యోతిషం తదితర వేదాంగ విభాగాల్లో మల్లినాథుడు అఖండ పండితుడు. ఆయన కుటుంబంలోనే జన్మించిన కుమారస్వామి, సోమయాజి తదితరులు అలంకారశాస్త్ర రచనలో ప్రవీణ్యులు. మల్లినాథుని వ్యాఖ్యల్ని ఆసేతుహిమాచలం వరకూ ప్రామాణికమైనదిగా పరిగణిస్తోంది. బాగా ప్రచారంలోకి రాని మరో పండితుడు అన్నంభట్టు. (రాయప్రోలు సుబ్బారావు సైతం తెలుగువారి వైభవాన్ని వర్ణించే పద్యాల్లో అన్నంభట్టు పేరును ప్రస్తావించారు!) ఈయనది పాలమూరుజిల్లా. 17వ శతాబ్దికి చెందిన పండితుడని చెబుతారు. అన్నంభట్టు తర్కశాస్త్రంలో అనితర సాధ్యమైన పాండిత్యాన్ని సంపాదించాడు. న్యాయ దర్శనకర్త గౌతముడు- వైశేషిక దర్శనాన్ని ఆవిష్కరించిన కర్ణాదుడు..ఈ ఇద్దరూ అన్నంభట్టుకు ఆదర్శశిష్యులు. ఆ రోజుల్లో కాశీపండితులను మెప్పించడం పాండిత్యపు దండితనంగా ఉండేది. అన్నంభట్టు ఈ విద్వత్కారణతో పేరుగాంచిన అసాధారణ తర్కపండితుడుగా నిరూపించుకున్నాడు. తర్కసంగ్రహం, తర్క సంగ్రహదీపన, సుబోధినీ.... బ్రహ్మసూత్ర వ్యాఖ్యాన మితాక్షర, వ్యాకరణంలో అష్టాధ్యాటీక, కైయటప్రదీప వ్యాఖ్యానము, న్యాయదర్శనము, సిద్ధాంగనము, న్యాయపరినిష్ట ప్రకాశనము, తత్త్వబోధినీ టీక - ఇంకా ఇతర అనేక రచనలు అన్నంభట్టు పాండిత్యానికి అద్దంపడతాయి.

కన్నడ ఆదికవీంద్రుడు పంప. ఈయనను కొందరు పద్మకవి పేరుతోనూ వ్యవహరించారు. పద్మ/పంప కవి విక్రమార్జున విజయం కన్నడంలో ఆదికావ్యం. ఇది వేములవాడను పరిపాలించిన రెండవ ఆదికేసరికి అంకితం. పంప కవి 'విక్రమార్జున విజయం' చదివిన తర్వాతే నన్నయభట్టు తెలుగుభారత రచన చేశాడని చాలామంది పండితుల అభిప్రాయం. పంప భారతంలోని కొన్ని కన్నడ పద్యాలు నన్నయ భారతంలో సహా కనపడతాయన్నది కొందరి విశ్లేషణ. పంప కవి నన్నయ్యకు ముందువాడు. పంపడు వేములవాడలో నివసించాడు.ఆయన బోధన్‌లో మరణించాడని పలువురు చరిత్రకారుల నిర్ధారణ. పంపకవి సమాధి బోధన్‌లో ఉన్నట్టు నిర్ధారించారు. అంటే - పైశాచి, ప్రాకృత, సంస్కృత భాషలతో పాటు కన్నడ కస్తూరి కూడా తెలంగాణలో ఆనాడే గుబాళించిందన్నమాట.

కళలకు కాణాచి, తెలుగు వెలుగుల ప్రాంతం, దేశిసౌందర్యానికి స్వాభావిక చిరునామా అయిన తెలంగాణ తాలూకు నిజమైన సాహిత్యసంపదను గురించిన సంపూర్ణ విశేషాలు ఎందుకు ప్రచారాన్ని పొందలేదన్నదొక ప్రశ్న. చరిత్రకారులు, సాహిత్య చరిత్రకారులు, అతి సామాన్యులైన వ్యక్తులు కూడా ఈ ప్రశ్న వేయవచ్చు. ఇందుకు అన్ని సమాధానాలు ఉన్నాయి. అందులో మొదటిది కోస్తాంధ్ర-రాయలసీమ ప్రాంతాల్లో కంపెనీ పరిపాలనా కాలంలో కోస్తాలో కొందరు అధికారులు, బ్రౌన్ వంటి విద్వాంసులు శాసన-తాళపత్రవనరుల మీద దృష్టిపెట్టారు. ఎంతో కొంత ఆధారాలు సాధించారు. కోస్తాంధ్ర-సీమల్లో పరిశోధనకు సంబంధించిన చైతన్యాన్ని పెంపొందించారు. ఇదంతా 19వ శతాబ్ది నాటి మాట. అయితే తెలంగాణలో మాత్రం 20వ శతాబ్ది ఆరంభమైన ఇరవై సంవత్సరాల తర్వాత మాత్రమే పరిశోధనలు ఆరంభమయ్యాయి. ఆంధ్ర పరిశోధకమండలి చొరవతో. అంతే పరిశోధన ప్రక్రియలో తెలంగాణం బాగా వెనకబడిపోయినట్టే కదా లెక్క! ఈ వ్యవధిలో కోస్తాంధ్ర-రాయలసీమ ప్రధానంగా కోస్తాంధ్ర ప్రాంత వాఙ్మయ పరిశోధకులు తమ ప్రాంతీయ ఆధిక్యతను బలపరిచే రీతిలో కవుల ప్రాంతాలను ఊహిస్తూ పోయారు! ఈ ఊహలే "ప్రామాణికం"గా ప్రచారం పొందాయి. నిజాంరాష్ట్ర పరిధిలో తెలుగు కవులే ఉండక పోవచ్చునన్నది కూడా ఆనాటి ఒక ఊహ. వరంగల్లు జిల్లాలోని పాల్కురికి చెందిన సోమనాథుడిని, హల్కుర్కి సోమనాథుడిగా కన్నడిగుడిగా ఊహించారు. ఒకవేళ అతడు కన్నడిగుడు కాకపోతే, తప్పకుండా ఉభయగోదావరి జిల్లాలోని ఏదో ప్రాంతం వాడనీ ఊహించారు! బమ్మెర పోతన కడపజిల్లా ఒంటిమిట్టకు చెందినవాడని బలంగా ఊహించారు. కొరవి గోపరాజు, మార్కండేయ పురాణకర్త మారన, కాకునూరు అప్పకవి.. ఒకరేమిటి.. ఇద్దరేమిటి ఎంతో మంది కవులు తమ ప్రాంతీయులేనని కోస్తాంధ్ర పరిశోధకులు ఊహించి- నిర్ధారించారు. ఆంధ్ర పరిశోధకమండలి బలమైన పరిశోధనలు చేస్తున్నా, ఇక్కడి స్వరం అక్కడి దాకా వినవచ్చే అవకాశం లేకపోయింది.



తెలంగాణ సాహిత్య చరిత్రను సప్రమాణికంగా అమలులో రూపుదిద్దించేందుకు ఎందరెందరో మహనీయులు కృషి చేశారు. ఈ విషయంలో దూపాటి వెంకటరమణాచార్యులు, సురవరం ప్రతాపరెడ్డి, ఆదిరాజు వీరభద్రరావు, బి.ఎన్.శాస్త్రి, గడియారం రామకృష్ణ శర్మ, సిరిగూరి హనుమంతరావు వంటి ఎందరో మహనీయులను గుర్తుచేసుకోవాలి. కోస్తాంధ్రకు చెందిన జయంతి రామయ్య పంతులు వంటి విఖ్యాత విద్వాంసులు కూడా కీలక విషయాల్లో (పోతన జన్మస్థలం) సముచితంగా స్పందించారు. ఇక ఇప్పుడు సాహిత్యంలోని వివిధ ప్రక్రియలలో తెలంగాణ సాధించిన విలక్షణత్వాన్ని అధ్యయన (మొదటి) ఘనతను స్మరించుకుందాం..

**తొలి కంద పద్యం :** కందం అచ్చమైన తెలుగు ఛందం! కందపద్యం అంతుపట్టని మనస్తత్వం వంటిది. పద్యం చిన్నదిగా కన్పించినా పూర్తిచేయాలంటే ఎంతో

ప్రయాసపడాలి. అందుకే కందం రాసినవాడే కవి అన్నారు మన పెద్దలు. తెలుగు ఛందానికి ప్రతీక అయిన అందమైన కందం కరీంనగర్‌లో లభించింది. ఇది నన్నయ కంటే వంద సంవత్సరాల ముందునాటి దని పరిశోధకుల అంచనా. పంపకవి తమ్ముడు చినవల్లభుడు ఈ పద్యం (కుర్క్యాల శాసనం) రచించాడు. చినవల్లభుడు సామాన్యుడు కాడు. జైన సంప్రదాయాలు బాగాతెలిసిన మహాపండితుడు. మహావీర స్తోత్రంతోపాటు పలు రచనలు చేశాడు. కంద పద్యం తీరు చూడండి..

"జన భావనంబు తెల్పించుట
జన పూజల్సేయు చుల్కి జినములకు నా
త్తిన యన్నదానం బీవుట
జిన వల్లభు బోలంగలరె
సినధర్మపరుల్..1

దినకరు సరి వెల్గుదునని
జిన వల్లభునోట్ట నెత్తు జితకవి వననుం
మనుజుల్లలరే ధాత్రిం
వినతిచ్చుదు ననియు వృత్త
విబుధకవీంద్రుల్ .. 2

*ఒక్కొక్క గుణంబు కల్గుదు*
*రొక్కొణ్ణిగా కొక్క లక్కలే నెవ్వరికిం*
*లెక్కింప నొక్కలక్కరు*
*మెక్కిలి గుణ పక్షపాతి గుణమణి*
*గణముల్.*

**ప్రజాదరణ పొందిన కవి, కవిత్వం :** తెలుగు సంప్రదాయ కవిత్వ చరిత్రలో కొన్ని వందలమంది గొప్ప కవులు కనబడతారు. వారు రచించిన వందలకొద్ది కావ్య ప్రబంధాలు సాహిత్య చరిత్రలో ఎదురవుతాయి. అయితే ఈ కవుల్లో తెలుగు మాట్లాడే అందరికీ తెలిసిన కవి ఎవరంటే పోతన అన్న జవాబే విన్పిస్తుంది. అన్ని కావ్యాలలోనూ పోతన భాగవతము అత్యంత ప్రజాధరణ పొందినదిగా నిలుస్తుంది. లిఖిత సంప్రదాయంలో వెలువడిన పోతన భాగవతం మౌఖిక సంప్రదాయంలోనూ ఇదిగిపోవడం నిజంగా అద్భుతం. తెలంగాణాలోని నలుమూలల్లో అక్షరాస్యులతోపాటు నిరక్షరాస్యులు సైతం పోతన పద్యాల్ని పదులకొద్దీ చదివేవారు. తాము నేర్చుకున్న పోతన పద్యాల్ని తమ పిల్లలకు సాహిత్య వారసత్వంగా అందించేవారు. ఇది మౌఖికపద్ధతిలో కొనసాగుతూ వచ్చిన నిరంతరప్రక్రియ! తెలంగాణేతర ప్రాంతాల్లోనూ అత్యంత ఆదరణ పొందిన కవి పోతన. కోస్తాంధ్ర-సీమల్లో పోతన కవిత్వం విస్తారంగా ప్రచారంలో ఉంది. ఆస్థానకవి పదవిని తిరస్కరించే తెగువను ప్రద ర్శించిన తొలి తెలుగుకవి పోతన. పేదజీవితంలోనూ ధిక్కారస్వరం ఉంటుం దని చాటిచెప్పిన వ్యక్తిత్వ మాయనది. ఆయన అనుయాయిగా భావించే హరిభట్టు (వరాహపురాణం) కూడా పోతన మార్గంలోనే నడిచాడు. పోతన స్వస్థలం బమ్మెర. ఇది వరంగల్ జిల్లాలో ఉంది. అయితే పోతన కడపజిల్లాలోని ఒంటిమిట్టవాడని నిరూపించేందుకు ఎన్నోప్రయత్నాలు జరిగాయి. 'ఆంధ్రావాల్మీకి' అనే బిరుదున్న వావిలకొలను సుబ్బారావు ఇందుకు ప్రధాన కారణమని చెబుతారు. అయితే దూపాటి వేంకట రమణాచార్యులవారు విశేషంగా శోధించారు. పోతనది బమ్మెర అని నిరూపించే ఆధారాలు సేకరించారు. వాటిని జయంతి రామయ్య అనే ప్రసిద్ధ పరిశోధకుడికి పంపించారు. జయంతివారి మాట పరిశోధనారంగంలో చెల్లుబాటు అయ్యేది. చివరాఖరున పోతన స్వస్థలం ఒంటిమిట్ట అనే నిర్ధారించబడింది. (ఇటీవలి కాలంలో తిరిగి ఈ అంశంపై కొత్త వివాదం రేకెత్తించేలా- పోతనది కడప జిల్లా అని పేర్కొనడం జరిగింది. దీనిపై తెలంగాణ సాహితీవేత్తలు, పరిశోధకులు తీవ్రంగా ప్రతి స్పందించారు. కొత్త ప్రయత్నాలు సద్దుమణిగాయి).

**ద్విపదకు చిరునామా :** రామాయణం కూడా పాడుకునేందుకు, అర్థంచేసుకొని ఆనందించేందుకు అనువైనది 'దేశి' సాహిత్యం. ఇందుకు భిన్నమైనది మార్గ సాహిత్యం. పద్యం మార్గసాహిత్యానికి మంచి ఉదాహరణ కాగా, పాట దేశి సాహిత్యానికి చక్కటి చిరునామా. పాట మౌఖిక రూపంలో ఊహిస్తే, కొంచెం తేడాతో దాని లిఖిత రూపమే 'ద్విపద' ప్రక్రియ అవుతుంది. పాటల నుంచే ద్విపద పుట్టిందని కొందరంటే, ద్విపదల నుండే పాటలు ఆవిర్భవించాయని మరికొందరంటారు. మొత్తానికి పాటకు, ద్విపదకు మధ్య అక్కాచెల్లెళ్ల అనుబంధమే ఉంటుంది. కానీ, పాతపగలు ఉండవు. పాటల ఊట వంటి తెలంగాణసీమలో ద్విపద పుట్టింది. ద్విపదలో రెండు పాదాలు ఉంటాయి. ప్రతిపాదంలో మూడు ఇంద్రగణాలు, ఒక సూర్యగణంతో కూడిన ద్విపద దేశికవితా మార్గంలో మధుర కవితాపద్ధతికి చెందింది. పాల్కురికి సోమనాథుడు "ద్విపద ఐహికాముష్మి హేతువు" అన్నాడు. పాల్కురికి పద్యరచనా దురంధరుడు. ఈ నిజాన్ని వృషాధిప శతక రచనతో ఆయన నిరూపించు కున్నాడు. అందులో ఆయన పద్యం కంటే ఎక్కువగా ద్విపద వైపు మక్కువ చూపించాడు. ఆయన రచించిన రెండు ప్రసిద్ధ ద్విపద రచనలు... బసవ పురాణం, పండితారాధ్యచరిత్ర. బసవ పురాణం అచ్చమైన దేశీవస్తు రచన. పండితారాధ్య చరిత్రను కొంత కవిత్వ రూపంలోని విజ్ఞానసర్వస్వంగా అభివర్ణించారు. నన్నయ పద్యపద్ధతికి ప్రత్యామ్నాయంగా ద్విపదకు ప్రాణం పోయడం తర్వాత పాల్కురికిలో కనపడుతుంది. బసవపురాణం, పండితారాధ్య చరిత్రలు తొలుత కన్నడంలోకి అటుతర్వాత సంస్కృతంలోకి అనువదించబడినాయి. నన్నయ అనంతరం రమారమి వంద సంవత్స రాలకు సోమనాథుడు జన్మించాడు. సోమనాథుడు కాకతీయ తొలి రుద్రదేవ మహారాజు కాలంవాడని గుర్తించడమే సముచితంగా ఉంటుంది. ద్విపద ప్రక్రియలో పరిపూర్ణ పరిణితి సాధించిన మహాకవి సోమనాథుడు. ద్విపద పరంపర సృజనకు పాల్కురికి సోమనే ప్రేరణగా నిలిచాడు. పాల్కురికి సోమనాథుడు కొంచెం అటు-ఇటుగా గోనబుద్ధారెడ్డి ద్విపదలో రామాయణాన్ని రచించాడు.

బుద్ధారెడ్డి మహబూబ్‌నగర్ ప్రాంత అధికారి. గోన బుద్ధారెడ్డి రామాయణం, రంగనాథరామాయణమనే పేరుతో ప్రసిద్ధిపొందిన సంగతి తెలిసిందే. ద్విపదలో రామాయణాన్ని రచించి అందులో వాల్మీకి ప్రస్తావించని పలు అంశాల్ని చిత్రించిన కవి బుద్ధారెడ్డి. అహల్యా శాప విమోచనం, ఊర్మిళాదేవి నిద్ర వంటి ఈ అవాల్మీకాంశాలు తెలంగాణలో బాగా ప్రసిద్ధిని పొందాయి. తెలుగునాట గోన బుద్ధారెడ్డి తొలి రామాయణ రచన కర్త. తిక్కన నిర్వచనోత్తర రామాయణం, బుద్ధారెడ్డి రామాయణం తరువాతే రచించబడింది. గోన బుద్ధారెడ్డి రామాయణానికి అతి విశిష్టమైనస్థానం ఉంది. ఇప్పటికీ తెలుగుసాహిత్యంలో ఎన్నో రామాయణాలు వచ్చినా వాటిలో రంగనాథ రామాయణానికే ప్రామాణికత దొరుకుతోంది. పాల్కురికి సోమన-గోన బుద్ధారెడ్డి తరువాత రెండు వందల సంవత్సరాలకు గౌరన అనే కవి ద్విపదకు తిరిగి వైభవాన్ని సాధించిపెట్టాడు. గౌరన దేవరకొండ ప్రాంతీయుడు. సరస సాహిత్య లక్షణ చక్రవర్తిగా పేరున్న విద్వాంసుడు. ఆయన హరిశ్చంద్రోపాఖ్యానము, నవనాథ చరిత్రము అనే రెండు ద్విపద రచనలు చేశాడు. వాటిలో హరిశ్చంద్రోపాఖ్యానము బాగా ప్రఖ్యాతిని పొందింది. కానీ హరిశ్చంద్ర నాటకంలో నక్షత్రకుడు అనే పాత్ర కనపడుతుంటుంది. ఇది విలనీతో కూడిన హాస్యపాత్ర. నక్షత్రక పాత్రను గౌరన సృష్టించాడు. ద్విపదను చక్కగా తీర్చిదిద్దిన కొద్దమంది కవులలో గౌరన ప్రముఖుడు. పాల్కురికి సోమన, గోనబుద్ధారెడ్డి, గౌరన. ఈ ముగ్గురిని ద్విపద కవిత్రయంగా అభివర్ణించవచ్చు. గౌరన 'హరిశ్చంద్రోపాఖ్యానా'న్ని శంకరకవి అనే ఆయన పద్యరూపంలో రాశాడు. అయితే, అది ఏమాత్రం ప్రచారాన్ని పొందలేదు. గౌరన ద్విపదలోని ప్రతిభ శంకరకవి పద్యాలలో కనిపించదు. రెండు మూడు మాటలతో పాత్ర స్వరూప స్వభావాలను ఆలవోకగా పరిచయం చేయగలిగే నేర్పు గౌరనలో ఉంది. ఆయన లక్షణదీపిక అనే రచన కూడా చేశాడు. ద్విపద ప్రక్రియకు తెలంగాణ పురిటిగడ్డ. ద్విపద మూలాలు తెలంగాణ సీమలోనే దొరుకుతాయి.

**శతకం** : సంస్కృతంలోకంటే తెలుగు సాహిత్యంలోనే శతకం ఎంతో ప్రచారాన్ని పొందింది. 108 పద్యాలతో పూర్తయ్యే శతకం నేటికీ సాహితీ ప్రక్రియల్లో అగ్రగామిగా నిలబడగలిగింది. పద్యానికి ప్రాణ ప్రతిష్ట చేసింది. నేటికీ తెలంగాణలో ఎంతో మంది ప్రసిద్ధ- వర్ధమాన కవులు శతకరచన చేస్తున్నారు. వస్తువిస్తృతిని ప్రదర్శించేందుకు కవి మనసులో సుడులు తిరుగుతూ అనేక అలజడులకు కారణమవుతున్న అనేక భావాల్ని వ్యక్తీకరించడానికి శతకం చక్కని సాధనమవుతోంది. శతకాలలోని మకుటాలు సర్వసాధారణంగా భగవదంకితాలుగా ఉంటాయి. తెలుగులో మల్లికార్జున పండితారాధ్యుడి 'శివతత్వసారం' తొలి శతకమనే అభిప్రాయం ఉండేది. అయితే ఆ శతకంలో సంఖ్యానియమం, మకుటంలో నిర్దిష్టత లేవు. అందువల్ల దాన్ని ప్రక్రియా మాత్రంలతో శతకమని చెప్పేందుకు వీలులేదు. ఈక్రమంలో పాల్కురికి సోమనాథుని 'వృషాధిపశతకం' తొలి సంపూర్ణ శతక మవుతుంది. జాలువారే జాను తెనుగుతనంతో, పరవళ్ళు తొక్కే ప్రవాహవేగంతో, భక్తిరసభావ భరితంగా, వృషాధిప శతకం రూపుదిద్దుకున్నది. తెలుగులో తొలిశతకం భక్తి సంబంధమైనదే కనుక- శతకమంటే భక్తి భావాన్ని వ్యక్తంచేసే ప్రక్రియ అన్న భావన ఏర్పడి ఉంటుంది. పాల్కురికి పద్యరచనా గరిమకు వృషాధిప శతకంలోని పద్యాలన్నీ తార్కాణాలు అవుతాయి. అందులో ఒక ప్రసిద్ధ పద్యం -

"ఒలుసడ తోలు సరమును
బాపసమల్ గిలుసారు కన్ను వె
న్నెల తల సేదుకృత్తు కయునిండిన
వేలుపుటేఱు వల్లు పూ
సలు గల జేసి జాను దెనుంగున
సన్నుతించెదన్
వలపు మదిందలర్ప బసవా, బసవా
వృషాధిపా!"

దాశరథీ శతకం, ధర్మపురి శ్రీనారసింహాశతకం.. మరెన్నో శతకాలు తెలంగాణలో ప్రసిద్ధిపొందాయి.

**సంప్రదాయ పురాణం** : మొత్తం సాహిత్యాన్ని ఒకచోట కలిపివేయడం కుదరని పని. ఇట్లా కలపకూడదనే సాహిత్యాన్ని విభిన్నమైన ప్రక్రియలుగా విభజించారు. ప్రతి సాహిత్య ప్రక్రియకూ పండితులు కొన్ని నియమాలను, లక్షణాలను ఏర్పరిచారు. వీటిని అతి అరుదుగా మాత్రమే అతిక్రమించడం జరుగుతుంది. ప్రబంధాలు, కథాకావ్యాలు, ఇతిహాసాలు, పురాణాలు.. ఇవన్నీ వేర్వేరు ప్రక్రియలు. ఇక పురాణం విషయానికివస్తే, దీనికి ఐదు లక్షణాలను ఆపాదించారు. **'సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశో మన్వంతరానిచ - వంశానుచరితంచైవ పురాణం పంచలక్షణం'** అన్నారు. ఈ లక్షణం పరిధిలో చేరగలిగిన తొలి తెలుగు పురాణం మారన రచన 'మార్కండేయ పురాణం'. ఇది అష్టాదశ పురాణాలలో ఒకటి. అల్లసాని పెద్దన తన మనుచరిత్రకు అవసరమైన మౌలిక కథను మార్కండేయ పురాణంనుంచే స్వీకరించాడు. అయితే ఈ మారనకవి ఏ ప్రాంతానికి చెందినవాడు? ఇది చాలా కాలం వరకూ నిర్ధారణకాలేదు. మారన తిక్కన శిష్యుడు. మారన తెలంగాణ ప్రాంతంలోని ఏదో ఒక గోదావరీ తీరప్రాంతానికో చెందిన కవి అని చాలామంది అభిప్రాయం. మారన ప్రతిభావంతుడు. ప్రథమాంధ్రపురాణ కర్తగా పేరు పొందాడు. మారన కాకతీయ ప్రతాపరుద్రుని కాలంవాడని ఖచ్చితంగా చెప్పవచ్చు. ఎందుకంటే.. ఆయన తన మార్కండేయ పురాణాన్ని కాకతీయ ప్రతాపరుద్రుని సేనాపతి గన్నయ మంత్రికి అంకితం ఇచ్చాడు. ఎనిమిది ఆశ్వాసాలు, 2,500 పద్యాలతో కూడిన మార్కండేయ పురాణం తెలుగులో వెలువడిన తొట్టతొలి సంప్రదాయ పురాణం.

మిగతాది వచ్చే సంచికలో....

**(ఈ లోకాన్ని విడిచిపెట్టిన బాల శ్రీనివాసమూర్తి స్మృతిలో...)**

కవిత

# వెలుగుల వానను....



నంది శ్రీనివాస్, 94904 01861

నేను తెలంగాణ గీతాన్ని
ఆదిమ కాలంలో ఆదితాళాన్నై అడుగులు వేశాను

నిన్నటిదాకా గాయాల వీణను
అప్పుడన్నీ శివరంజని రాగాలే...
తెగిన తీగల రుద్రవీణను సవరించుకొని
క్షుద్రులపై గొంతెత్తి వైతాళిక గీతాన్నయ్యాను.
వీరభద్రులను మేల్కొలిపి ప్రళయ తాండవమాడించి
పరతంత్రం సంకెళ్లను తెంచిన స్వతంత్ర గీతాన్నయ్యాను...
కొత్తపాటకు కొత్త స్వరాలద్దాను..
పంచమస్వరంలో పల్లవిస్తున్నాను..

పరిణామ క్రమంలో దశరూపాలు ధరించిన దారి నాది.
ఆదిలో జలచరమయ్యాను
నీటికి ఎదురీగడం కాదు
పల్లమెరిగిన గోదారి దారిని
ఎత్తుకు ఎత్తుకున్నాను.

ఉభయచరమయ్యాను భూమిని నీటిని
సమన్వయం చేసుకున్న సాధకున్నయ్యాను.
కుంగిన బతుకులను పైకెత్తడానికి కూర్మాన్ని అయ్యాను.

భూచరమయ్యాను. అన్యాక్రాంతం అయిన ధరణిని
దక్కించుకోవడానికి తీక్ష్ణ వరాహ దంష్ట్రనయ్యాను.

బలిచ్చే మేకలుగా కాదు బలవంతుడైన సింహంలా గర్జించి,
స్వయమేవ మృగేంద్రతా అని చాటి నరహరినయ్యాను.

వామనున్ని అని నన్ను చూసి నవ్వారు.
కానీ త్రివిక్రమత్వాన్ని ప్రకటించి
ప్రపంచాన్ని నావైపు తిప్పుకున్నాను.

అక్రమాల ముళ్ళతీగలను ఖండించడానికి
పరశు ధారున్ని అయ్యాను.

నా భాషా మర్యాద యాగరక్షణకు
కోదండ దండ దారున్ని అయ్యాను.
రైతుబంధువునిగా బలదామున్ని అయ్యాను.

ఆబాలగోపాలానికి
మానవ జీవన పాఠాలు నేర్పడానికి
బతుకు గీతాన్ని పాడుతున్నాను.

ఇక ఈ దశాబ్ది వత్సరంలో
కల్మషాలను ఖండించే కల్కినవుతాను.
సగర్వంగా చాటుతున్నా...
నేను తెలంగాణను
నేను వెలుగుల వానను...



కవిత

# ఊహాలోకంలో...

దేవలపల్లి సునంద, 82977 44716

వసంతకాలంలో కురిసే
ఉషోదయపు తుషారంలో తడిసిపోవాలని..
భానుడి లేలేత కిరణాల వెచ్చదనంలో
చలి కాచుకోవాలని...
మల్లెలు విరిసే మధుమాసంలో
నీ అడుగులో అడుగునై నడవాలని..
మావిచిగుళ్ల తిని మత్తకోకిలలు
ఆలపించే కుహూ కుహూ రాగాలు వింటూ
నీ ఒడిలో సేదదీరాలని..
గోదారొడ్డున నీటి గలగలల సవ్వడులతో పాటు
నా ముంజేతి గాజుల మంజీర నాదాలు నీకు వినిపించాలని
పున్నాగ పూలు రాలిన పచ్చిక బయళ్లలో నడుస్తున్న
నా కాలి అందియల మువ్వల సవ్వళ్ళు
నీ గుండెలయతో జతకూడాలాని..
నిండు పౌర్ణమి నాటి వెండి వెన్నెల్లో
యమునానదీ తీరాన ఇసుక తిన్నెలపై
నీ యెదపై నా తలవాల్చి
నామనసు నీమనసుతో ఊసులాడాలని
చంద్రుని వీడని వెన్నెలలా
ఆజన్మాంతం నీతో నేనుండిపోవాలని
ఊహాలోకంలో విహరిస్తున్నా



క
థ

# నిండు మనసులు

సహృదయత ప్రతిఫలించిన దాంపత్యం...



అన్యం పద్మజ రెడ్డి
94415 07852

"ఏవోయ్! నీ ఫేవరెట్ మొక్కజొన్న పొత్తులు తింటావా?" బైక్ నడుపుతూ కొద్దిగా తల వెనక్కి తిప్పి అన్నాడు చంద్రశేఖర్.

"అబ్బా! మీకు కానట్టు. ఎంచక్కా ఒలిచిస్తే తినడం మీకు సరదానే కదా! కొందాం పదండి."నవ్వుతూ అంది నీలిమ.

ముప్పైఏళ్ళు ఉంటాయేమో మార్కెట్లో ఒక పక్కన కూర్చుని బొగ్గుల కుంపటి మీద కాలుస్తూ అమ్ముతుంది ఆమె.

కమ్మటి ఆ వాసన పీలుస్తూ "ఎంతకిస్తావమ్మా" అడిగాడు చంద్ర.

"జర పెద్దగున్నై 15 రూపాలు జర సిన్నగున్నై 10 రూపాలు సారూ" చెప్పింది.

"సరే 100 కి పెద్దవి 10 ఇచ్చేయ్యమ్మా" అనగానే

"ఇగ తీసుకోండి సారూ జర నా మొగం జూసి ఇయ్యుండ్రి" అన్నది ఆమె.

నీలిమకి బేరం చెయ్యడం నచ్చలేదు "ఏంటండీ మీరు ఇవి కూడా బేరమాడు తున్నారు. తను చెప్పినంత ఇవ్వండి" అనేసరికి చంద్ర ఆమె చెప్పిన రేటుకి డబ్బులు ఇచ్చాడు.

"నీపేరేమిటి" కాస్త జాలిగా అడిగింది నీలిమ.

"లచ్చిమి" కొంచం సిగ్గుపడుతూ, తన పేరు అడిగినందుకు మరికొంచెం అభిమానంతో ఇంకో రెండు ఎక్స్ట్రా ఇచ్చింది.

వాటికి కూడా డబ్బులు ఇచ్చేసి అక్కడ్నించి వెనుదిరిగారు. చంద్రశేఖర్, నీలిమ ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులు. ఇద్దరు అబ్బాయిలు విదేశాల్లో స్థిరపడ్డారు. కారు ఉన్నా అది పెద్దగా వాడరు. బైక్‌పై వెళ్ళడమే వారికి ఇష్టం. రోజూ బడికి వెళ్లి వచ్చే దారిలోనే లక్ష్మి దగ్గర మొక్కజొన్న పొత్తులు కొనుక్కుని వెళ్ళేవారు.

"ఏం లక్ష్మి రాత్రవుతున్నా ఇంకా ఇక్కడే ఉన్నావు. ఏ ఊరు నీది" రాత్రి ఎనిమిదింటికి కూడా ఇంకా పొత్తులు అమ్ముతూ కూర్చున్న ఆమెని అడిగాడు చంద్ర బండి ఆమె దగ్గర ఆపి. వాళ్లకి ఆరోజు బళ్ళో ఆలస్యం అయ్యింది.

"ఏం లేదు సారూ. మా సంటిది పుట్టిన రోజుకి డ్రెస్ కావాలని లొల్లి జేస్తుంది అందుకే జర పైసల్ గావాలే" చెప్పింది.

ఎందుకో ఆమె చాలా నీరసంగా ఉంది." మీ ఆయన ఏం పని చేస్తాడు." అడిగింది నీలిమ.

"ఆడేం పని జేయడు తాగి తొంగుంటడు.ముగ్గురు బిడ్డలని నేనే సాదుకోవాలే" విసనకర్రతో బొగ్గుల మీద ఊపుతూ పొత్తులని అటూ, ఇటూ తిప్పుతూ చెప్పింది.

"అదేంటి ఒక్కదానివి ఎలా నెట్టు కొస్తున్నావు. ఏదైనా పని చేయమని మీ ఆయనకి చెప్పు" ఆశ్చర్యంగా అన్నాడు చంద్ర.

"ఆనికెంత జెప్పినా ఇనడు సారూ పొద్దుగాల పోతడు రాత్రికి ఫుల్ తాగొస్తడు. ఇంత తిని పంటడు. ఆనికి కూడా నేనే తిండి బెట్టాలే."

మనసంతా ఏదో కెలికినట్లైంది నీలిమకి. ఇంటికి చేరాక కూడా లక్ష్మి తాలూకు ఆలోచనలు బాధిస్తున్నాయి. భర్తని, ముగ్గురు బిడ్డలని ఒంటి చేత్తో ఎలా పోషించగల్గుతుంది. ఇంకా సమాజంలో మార్పు రాలేదు. ఇలాంటి సంసారాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఏదో ఒకటి చేయాలని తపన కలుగుతుంది. ఏం చేయాలి.

మర్నాడు సాయంత్రం బడి నుంచి త్వరగా బయలుదేరి వెళ్ళారు. అక్కడే కూర్చుని "ఇవి శానా లేతగా ఉంటాయి సారూ మీరు తిని చూడండి. పది రూపాలు తక్కువిచ్చినా సరే సారూ. మల్ల నా దగ్గరకే వస్తవు సారూ" అంటూ ఎవరికో పొత్తులు అమ్ముతుంది. చంద్ర, నీలిమ ఆమె దగ్గర ఆగారు.

"అచ్చిండ్ర అమ్మ మీ కోసం ఇయ్యాల లేత మక్కెన్లు కాల్చి పెట్టిన తీసుకోండి" అంటూ ఇచ్చింది.

"లక్ష్మీ ఏమన్నా తిన్నావా?" చంద్ర అడిగాడు.

"లే సారూ పొద్దుగాల ఇంత తింటే మల్ల రాత్రి ఇంటికి పోయినంకనే తినుడు. మూడు పూటలు తిననీకి నా కాడ

కథ

సాలదు. చాయ్ తాగిన" నవ్వుతూ చెప్పింది. దాని మొగుడు మీద చాలా కోపం వచ్చింది నీలిమకి.

"పనీ పాటా లేకుండా తిని తిరిగే నీ మొగుడికి కూడా తిండి పెట్టడం దండగ. ఇంట్లోంచి వెళ్లగొట్టెయ్. అప్పుడు తెలుస్తుంది" కోపంగా అంది నీలిమ.

"లేదమ్మా! ఏదో మగదిక్కులెక్క పడుంటడు. మంచోడేనమ్మా! తాగుడు జేయవట్టి కరాబైతుండు."

ఆమె కళ్ళల్లో మొగుడి పట్ల కాస్త జాలి, ప్రేమ రెండూ కనిపించాయి నీలిమకి. ప్రతిరోజూ కాసేపు లక్ష్మితో మాట్లాడి మొక్కజొన్న పొత్తులు తీసుకొని ఇంటికి చేరడం దినచర్యలో భాగమై పోయింది వాళ్లకి. అలా నాల్గురోజులు గడిచాయి. ఒకరోజు తల్లో పూలు పెట్టుకుని అందంగా కనిపించింది.

"ఏం లక్ష్మీ ఈరోజు ప్రత్యేకంగా కనిపిస్తున్నావు ఏంటి సంగతి" నవ్వుతూ అడిగింది నీలిమ.

తన సంచీలోంచి చిన్న కవర్ తీసి చేతిలో పెట్టి "ఇయ్యాల మా పెండ్లిరోజు" మొహం చాటంత చేసుకుని చెప్పింది. ఏమిటాని చూస్తే మిరపకాయ బజ్జీలు.

"అవునా ఆ తాగుబోతు మొగుడి గురించి ఇంత సంతోషిస్తున్నావా? ఆశ్చర్యంగా అడిగింది నీలిమ.

"మరి మీ ఆయన కొత్తచీర కొని పెట్టాడా! లేదా!" సరదాగా అడిగాడు చంద్ర.

"లేదులే సారూ ఆడికాడ ఏముంది. కానీ ఇయ్యాల మాత్రం అసలు తాగడు. నాతో పేమగా ఉంటడు. ఆడికి నేను జేసే మిర్చీ బజ్జీలంటే శానా ఇష్టం. గందుకే జేసిన. మీకు ఇయ్యాలనిపించి ఇచ్చిన. ఏమనుకోకుండ్రి సారూ.

సంవత్సరమంతా గీ దినం కోసం ఎదురు సూస్తా సారూ గంతే".

ఇంటికి వచ్చాక అన్యమనస్కంగానే భోంచేసి పడుకున్నారు. నీలిమకి నిద్ర పట్టడం లేదు. ఏ విధంగానూ తనకి సపోర్ట్ చెయ్యని భర్త అంటే లక్ష్మికి ఎంత ప్రేమ.

పెళ్ళైన కొత్తల్లో తన పుట్టిన రోజు మర్చిపోయాడని భర్త మీద అలిగి తను చేసిన రాద్ధాంతం గుర్తొచ్చింది.

పక్కన నిద్రపోతున్న చంద్రని చూస్తూ తను ఎన్నోసార్లు చిన్న చిన్న విషయాలకే విసిగించినా ఓపిగ్గా భరిస్తాడు. ఇన్నేళ్ల కాపురంలో తనని ఒక్కసారి కూడా కోపగించుకోలేదు.

దగ్గరికి వెళ్లి దుప్పటి సరిగ్గా కప్పింది నీలిమ. లక్ష్మి గురించిన ఆలోచనలు తనని బాగా డిస్టర్బ్ చేస్తున్నాయి. ఎలాగైనా లక్ష్మి జీవితానికి న్యాయం చేయాలి. ఒక్క నిట్టూర్పు విడిచి నెమ్మదిగా కళ్ళు మూసుకుంది.

మరుసటి రోజు లక్ష్మి చేతిలో ఓ కాగితం పెట్టి సంతకం చేయమంది నీలిమ.



"ఏంటమ్మా ఇది" సందేహంగా అడిగింది లక్ష్మి.

"విడాకుల నోటీసు. మీ ఆయనకి. నిన్ను ఇంతలా బాధ పెట్టే అతన్ని ఇక వదిలించు కోవడం మంచిది." ఆవేశంగా అంది నీలిమ.

పక్కలో బాంబు పేలినట్టు ఉలిక్కిపడి "మీరు సెప్పేది నాకేం అర్థం కాలే. ఆడు ఎట్టాంటోడైనా నా మొగుడమ్మా! నా బిడ్డలకు తండ్రి. ఆడ్ని ఇడిసి నేను ఎట్టా బతకను మీ మాట కాదన్న. శమించు తల్లీ" కళ్ళ నీళ్ళు తుడుచుకుంది లక్ష్మి.

వైవాహిక బంధాన్ని గౌరవించే లక్ష్మి ఔన్నత్యాన్ని ఎలా అభినందించాలో తెలీలేదు చంద్ర, నీలిమలకు. విడాకుల సంఖ్య నానాటికీ పెరిగిపోతూ, విచ్ఛిన్న మవుతున్న నేటి వివాహ వ్యవస్థను చూస్తుంటే హైందవ సంస్కృతి ఏమైపోతుందోనన్న భయం కూడా కలిగింది. భారమైన హృదయంతో ఇంటికి వచ్చేశారు.

రాత్రంతా బాగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చారు.

రెండు రోజుల తర్వాత కావాల్సిన ఏర్పాట్లు అన్నీ పూర్తి చేశారు. లక్ష్మి భర్త ఈరయ్యను పిలిచి బాగా బుద్ధి చెప్పి మార్కెట్లో ఒక ఇడ్లీ సెంటర్ పెట్టించారు లక్ష్మి చేత.

లక్ష్మి నీలిమ కాళ్ళమీద పడి కృతజ్ఞతలు చెప్పింది.

"ఆ...లక్ష్మీ ఇద్దరూ బాగా కష్టపడి పిల్లల్ని చక్కగా చదివించండి. మళ్ళీ నీ మొగుడు ఏమన్నా పిచ్చి వేషాలు వేస్తే నాతో చెప్పు" అన్నాడు చంద్ర.

"అయ్యో సారూ! నాకు బాగా బుద్దొచ్చింది. ఇంకెప్పుడు తాగను" రెండు చెంపలు వాయించుకున్నాడు ఈరయ్య.

ఇప్పుడు నీలిమ మనసు కుదుట పడింది. "ఈరయ్య అంత బుద్ధిమంతుడు ఎలా అయ్యాడండీ" ఆశ్చర్యంగా అడిగింది నీలిమ బైక్ మీద వెళ్తూ.

"నువ్వు ఎంతో మథనపడుతూ ఉన్న విషయం నేను గ్రహించాను నీలిమా. నాకూ లక్ష్మిని చూస్తుంటే బాధనిపించింది.

ఆమెకి ఏదైనా సహాయం చేయాలని అనుకున్నాం కదా! అందుకే నా ఫ్రెండ్ ఎస్.ఐ రంగనాథ్ ని కలిసి ఈరయ్యకి మంచి కౌన్సిలింగ్ ఇప్పించాను. మొదట వినలేదు తర్వాత వాళ్ల రూల్స్ ప్రకారం వార్నింగ్ ఇచ్చేసరికి దారికొచ్చాడు. ఇక లక్ష్మి జీవితానికి ఏ భయం లేదు" చెప్పాడు చంద్ర.

చాలా రోజుల తర్వాత ప్రశాంతంగా నిద్రపోయింది నీలిమ.

సాహితీ శిఖరం

1972 నోబెల్ సాహిత్య పురస్కార గ్రహీత

## ప్రఖ్యాత జర్మన్ నవలా కారుడు....

# హెన్రిచ్ బాల్



హెన్రిచ్ బాల్ పూర్తి పేరు హెన్రిచ్ థియోడర్ బాల్. హెన్రిచ్ బాల్ యొక్క నవలలలో పునరావృతమయ్యే అంశం రెండవ ప్రపంచ యుద్ధం తరువాతి దశాబ్దాలలో జర్మన్ సమాజం ఎలా ఉన్నదో విశ్లేషించాడు. అతని ప్రారంభ నవలలలో, 'వో వార్స్ట్ డు ఆడమ్?' అతను యుద్ధం యొక్క అర్థరాహిత్యం, దానివల్ల ఉత్పన్నమయిన బాధలు మరియు భయానక పరిస్థితుల గురించి విపులంగా వ్రాసాడు. యుద్ధానంతర జర్మనీ యొక్క నైతిక క్షీణత ఆయన తర్వాతి నవలలకు ఇతివృత్త ములయ్యాయి. 1960లలో అతను వికసించిన జర్మన్ ఆర్థిక వ్యవస్థ యొక్క ప్రస్ఫుటమైన వినియోగాన్ని వివరంగా కూడా తన నవలలలో వ్రాసాడు. తన 'డై వెర్లొరెన్ ఎహ్రే డెర్ కాథరీనా బ్లమ్'లో తీవ్రవాద దాడులను ఎదుర్కోవాల్సిన జర్మన్ సమాజం గురించి రాశాడు. ఆయన 1917 డిసెంబర్ 21న జన్మించారు. జూలై 16, 1985న మరణించారు. హెన్రిచ్ బాల్ జర్మన్ రచయిత, 1972లో ఆయన సాహిత్యానికి నోబెల్ బహుమతి లభించింది. రెండవ ప్రపంచ యుద్ధం సమయంలో మరియు జర్మన్ జీవితం యొక్క కష్టాలపై బాల్ యొక్క వ్యంగ్య నవలలు జర్మన్ దేశం యొక్క మారుతున్న స్థితిగతులని వివరిస్తాయి. బాల్ 1937లో పట్టభద్రుడయ్యాడు. అతను 1938లో నిర్బంధ కార్మిక సేవలోకి ప్రవేశించబడ్డాడు. జర్మన్ సైన్యంలో ప్రైవేట్ కార్పోరల్‌గా ఆరు సంవత్సరాలు పనిచేశాడు. బాల్ యొక్క యుద్ధకాల అనుభవాలు-గాయపడడం, విడిచిపెట్టడం, యుద్ధ ఖైదీగా మారడం-ఒక రచయితగా ఆయనను చాలా ప్రభావితం చేశాయి. "సైనికుడిగా ఉండటం మరియు యుద్ధం ఓడిపోవాలని కోరుకునే భయంకరమైన పరిస్థితులు ఆయనను కలిచివేశాయి. యుద్ధం తర్వాత అతను తన స్వస్థలమైన కొలోన్‌లో స్థిరపడ్డాడు. సాహిత్య రంగంలో బాల్ యొక్క తొలి విజయం చిన్న కథలతో వచ్చింది. ఆయన మొదటి కథ 1947లో ప్రచురించబడింది. అతని ప్రారంభ నవలలు డెర్ జుగ్ వార్ పంక్ట్‌లిచ్ (1949 - ది ట్రైన్ వాజ్ ఆన్ టైమ్) మరియు వో వార్స్ట్ డు ఆడమ్? (1951 - ఆడమ్, వేర్ ఆర్ట్ యు). అతను సైనికుల జీవితాల్లోని భయంకరమైన నిరాశను తన రచనలలో వివరించాడు. "దాస్ బ్రోట్ డెర్ ఫ్రూహెన్ జహ్రే" (1955 - ది బ్రెడ్ ఆఫ్ అవర్ ఎర్లీ ఇయర్స్)లోని మెకానిక్ జీవితంలో, "బిల్లార్డ్ ఉమ్ హల్బ్ జెహ్న్" (1959 - బిలియర్డ్స్ ఎట్ హాఫ్-పాస్ట్ నైన్)లో వాస్తుశిల్పుల కుటుంబంలో వాస్తవికత యొక్క అసౌకర్యాల గురించి ఆయన చిత్రించారు. జనాదరణ పొందిన రచన "క్లౌన్స్" (1963 - ది క్లౌన్)లో, కథానాయకుడు మద్యపానం ద్వారా బాగా చెల్లించే ఎంటర్‌టైనర్ నుండి అడుక్కునే వీధి సంగీతకారుడి స్థాయికి దిగజారాడు.

బాల్ యొక్క ఇతర రచనలలో ప్రముఖ మయినవి "ఉండ్ సాగ్టే కెయిన్ ఎయింజిజెస్ వోర్ట్" (1953 - అక్విటెడ్ విత్ ది నైట్) మరియు "ఎండే ఐనర్ డైన్‌స్ట్‌ఫార్ట్" (1966 - ఎండ్ ఆఫ్ ఎ మిషన్), ఇందులో తండ్రి మరియు కొడుకుల విచారణ, పట్టణ ప్రజల పాత్రను తెలియజేస్తుంది. అతని పెద్ద నవల, "గ్రుప్పెన్ బిల్డ్ మిట్ డేమ్" (1971 - గ్రూప్ పోర్ట్రెయిట్ విత్ లేడీ)లో బాల్ ప్రపంచ యుద్ధాల నుండి 1970ల వరకు జర్మన్ జీవితం యొక్క పనోరమాను అందించాడు. "డై వెర్లొరెన్ ఎహ్రే డెర్ కాథరినా బ్లమ్" (1974 - ది లాస్ట్ హానర్ ఆఫ్ కాథరినా బ్లమ్) ఆధునిక పాత్రికేయ నీతి మరియు సమకాలీన జర్మనీ విలువలపై చేసిన రచన. నవల "డెర్ ఎంగెల్ ష్విగ్" (ది సైలెంట్ ఏంజెల్) 1950లో వ్రాయబడింది, అయితే ఆ నవల మరణానంతరం 1992లో ప్రచురించబడింది. అందులో ఒక జర్మన్ సైనికుడు రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత యుద్ధంలో నాశనమైన కొలోన్‌లో మనుగడ కోసం పోరాడుతున్న వైనాన్ని వివరించాడు. "క్రూజ్ ఓహ్నే లైబ్" (క్రాస్ వితౌట్ లవ్) 2003లో మొదటిసారిగా ప్రచురించబడింది.రోమన్ క్యాథలిక్ మరియు శాంతికాముకుడైన బాల్ తన చుట్టూ ఉన్న సమాజం గురించి, అనైతికకథను తెలియజెప్పినాడు. బోల్ తన యుద్ధ వ్యతిరేక, నాన్ కన్ఫార్మిస్ట్ దృక్కోణాన్ని ప్రదర్శించడానికి కఠినమైన వచనాన్ని అవసరమైనపుడల్లా పదునైన వ్యంగ్యాన్ని ఉపయోగించి పాఠకులను కట్టిపడేశాడు. అతను రెండవ ప్రపంచ యుద్ధంలో తన దేశం యొక్క అనుభవాల యొక్క అత్యుత్తమ మానవతా వాద వ్యాఖ్యాతగా తన రచనల ద్వారా సాహిత్యలోకంలో పరిగణించబడ్డాడు.

# వానమ్మ...



అనుముల ప్రభాకరాచారి, 96765 49963

వాన కురుస్తుంది...అమ్మ నవ్వినట్లుంది.
వెనుకటి కాలంలో... వర్షాలు, వర్షమంతా... రోజంతా... హర్షించినట్లే..
నేలకు ఆనందాలు పూయించినట్లే...
అమ్మ ఎప్పుడూ నవ్వుతూనే కన్పించేది నాకు.
అమ్మ... నవ్వు మొకందేకాదు... నవ్వే...
అమ్మ లెక్కుండేదనిపిస్తది నాకు.

కాలం మారింది కద..!?
కడుపు కాలిన నేలకు... వాన దూరమయినట్లే..,
అప్పుడప్పుడు మాత్రవే కురిసినట్లు.... తడిపినట్లు...
కడుపునిండా పండిన.... ఎండిన...అమ్మ ముఖంలోంచీ
నవ్వు మాయవయింది.
అప్పుడప్పుడూ నవ్వినట్లు చేసేది.... వానలెక్క..... అప్పుడప్పుడు
కురిసినట్టు.

అమ్మేలేదిప్పుడు.....
అయితేనేం...! వానకురుస్తుందిగా....
అమ్మలేనట్లేవీ అనిపించదు నాకు.
ప్రతి చినుకూ....అమ్మ నవ్వు లెక్కనే.
ఒళ్ళంతా తడిసిన ప్రతిసారీ...అమ్మ కొంగుసాటున..
తడిసి ముద్దయినట్లనిపిస్తది నాకు.
అమ్మే... నా ఒళ్ళంతా తుడిచినట్లనిపిస్తది నాకు.

అప్పుడు........ అమ్మ... వాన నాకు.
ఇప్పుడు..... వాన... అమ్మ నాకు.
వానమ్మ.

వ్యాసం

# హృదయాభినందనం

అవధానుల చమత్కారాలు, సద్యస్ఫూర్తి...

కాంచనపల్లి గోవర్ధన్ రాజు

తెలంగాణ రాష్ట్ర అవతరణ అనంతరం అన్ని రంగాలలో చైతన్యం అనేక రూపాలలో వికసిస్తున్నది. కళాకారులు సాహితీవేత్తలు తమ మూలాలను త్రవ్వి బయటకు తీయడానికి కృషి చేస్తున్నారు. తమ వారసత్వ సంపదను పునశ్చరణకు తెచ్చుకుని కొత్త చైతన్యం ప్రోది చేసుకుంటున్నారు. ఒకనాడు 'కవులు పూజ్యము'' అని నిరసించిన ఈ గడ్డ కవులే కాదు మహా పండితులను అవధానులను కూడా ఎంతమందిని వికసింప చేసిందో తెలుసుకుంటున్నారు.

ఈ పరిశోధనా క్రమంలో విరిసిన మరొక సాహిత్య చారిత్రక గ్రంథం అవధాన తెలంగాణ. ప్రముఖ కవి అష్టావధాని అవుసుల భాను ప్రకాశ్ సంపాదక నేతృత్వంలో సుమారు 80 వరకు అవధానుల విశేషాలతో ఈ గ్రంథం సంతరించడం జరిగింది.

అవధానం ఒక తెలుగువారికి సొంతమైన ఒక అపురూప విద్య. అసలు తెలుగులో పద్య నిర్మాణమే అత్యంత ప్రభావవంతం. తమిళ కన్నడ భాషలలోని పద్యాలతో పోలిస్తే నిర్మాణంలో మరింత పటిష్టత సంతరించుకుంది తెలుగు పద్యం. ఈ పద్యం మూలధాతువుగా అవధానం ధారధారణలతో సాగిపోతుం టుంది. అష్టావధానంలో 8 మంది




పృచ్ఛకులుంటారు. ప్రాశ్నికులకు అవధాని పద్యం చెబుతున్నప్పుడే అవధాని ఏకాగ్రతను భగ్నం చేసే అసందర్భ ప్రసంగంతో కొనసాగే ఈ సాహిత్య కళాపరి పోషణకు అవధానికి ఆశు వుతోపాటు ఏకాగ్రతతో కూడిన ధారణ కావాలి. ఒక్క తెలుగు భాషలో తప్ప వేరే ఏ ప్రపంచ భాషలో కూడా ఈ ప్రక్రియ లేదని మాజీ ప్రధాని పివి అన్న విషయం ఇక్కడ స్మరించుకోవాలి.

ఇట్లాంటి ప్రక్రియ జ్ఞాతులు వెనకబడి నదని నిందించిన తెలంగాణలో కూడా నాటినుండి నేటి దాకా అపూర్వంగా వికసించింది. అందుకు ఈ పుస్తకం ఒక గొప్ప ఉదాహరణ.

కాగా ఈ పొత్తంలో అవధానం అంటే ఏమిటో వివరించారు. దీన్ని ఒక కళాక్రీడగా పేర్కొన్నారు. పృచ్ఛకుల సంఖ్య లేదా అంశాల ఆధారంగా అష్ట, నవ, దశ, ద్విగుణిత, త్రిగుణిత, చతుర్గుణిత, శత, సహస్ర, ద్విసహస్ర, పంచసహస్ర అవధానాలుగా అవధానంగా జనరంజకమైంది. తెలంగాణలో కొలిచలమ మల్లినాథసూరి మొదటి శతావధాని. ఈయన 13వ శతాబ్దివాడు. ఈయన పెదమల్లినాథసూరి మనమడే. సంస్కృత కావ్య వ్యాఖ్యాత ముఖ్యంగా కాళిదాసు కావ్య వ్యాఖ్యాత మల్లినాథసూరి ఈయన మనమడే. ఈ పుసక్తం 13వ శతాబ్ది వాడని పేర్కొన్నది. కొలిచెలమ మల్లినాథసూరి తెలంగాణలో అవధానానికి ఆద్యుడు. తరువాత 15వ శతాబ్దిలో చరిగొండ ధర్మన్న, ఇదే శతాబ్దానికి చెందిన హరిభట్టు 16వ శతాబ్దికి చెందిన మరింగంటి జగన్నాథసూరి, ఇదే శతాబ్దికి చెందిన మరింగంటి సింగరాచార్యుడు మొదలైన 20 మంది ప్రాచీన అవధానుల పరిచయం ఈ పొత్తంలో చూడవచ్చు. ఇటీవల కీర్తిశేషులైన 18 మంది అవధానులు శిరశినహల్ కృష్ణమాచార్యుల నుండి రాళ్ళబండి కవితా ప్రసాద్ వరకు ఈ పుస్తకంలో స్థానం పొందారు.

తరువాత వర్తమానంలో సజీవులైన 43 మంది అవధానుల పరిచయం ఉంది. అవధానుల పరిచయం వాళ్ళు చమత్కారంగా చేసిన సమస్యాపూరణాలు, దత్తపదులు భానుప్రకాశ్ చేతిలో చక్కగా రూపొందాయి. అక్కడక్కడా ఉపయుక్త మైన ప్రాసలను అలంకారాలను ప్రయోగించి ఈ గ్రంథాన్ని రసోదితంగా రచించాడు భానుప్రకాశ్.

దివ్యమూర్తులలో ఉదాహరణకి ధూపాటి సంపత్కుమారాచార్య పూరణం చూడండి -

'ఝల్లని గుండె చప్పుడు నిశా సమయంబిది నామనంబుకున్' అనే సమస్యకు ఆయన పూరణం-

"తెల్లని మల్లెపూలు కడుదీనముగా యిట పలవాడెనో
యల్లరి చేయు
చంద్రుడటహర్నిశలున్, తలపోతు వానికై
యుల్లము మల్లెపూపగిది నుంచితి
కాని యితండు రాడిటన్
ఝల్లనె గుండెచప్పుడు
నిశాసమయంబిది నామనంబుకున్"

నాటి అవధాన శిఖామణులు పూరించిన వైనం సహృదయున్ని ఆనంద డోలికలలో ఊగింపజేస్తుంది. పద్యాల్లో ఒదగగలవా అనే సామాన్య పదాలు కూడా పద్యాలలో అమరించారు.

గుమ్మన్నగారి లక్ష్మీనరసింహశర్మ ఇలాంటి ఒక పద్యం చూడండి-

ఒక అవధానంలో కల్లు, సారా, బీరు, రమ్ము అనే పదాలనిచ్చి భారతార్థంలో పద్యం చెప్పమన్నపుడు...

"ఆయువరాజనన్ శకుని కల్లుడు
వేల్లిత మానయోధడున్
న్యాయముతోడ కర్ణుమనసారగ నేలిన
ప్రోడపాండవ
శ్రీయలరారు తేజమున నచిందెడు
లక్ష్మికి బీరు వోవుచున్
మాయలు పన్ని వేచెరచి మాయు
సుయోదను జూడరమ్మురా"

కొంతమంది అవధానులు ఏ పదాలిచ్చినా సామాజికతకు అనువర్తింప జేయడం చూస్తాం. రుమేనియా, మలేరియా, సోమాలియా, సడేమియా అనే పదాలిచ్చి కుటుంబ నియంత్రణ గురించి చెప్పమంటే అష్టకాల నరసింహరామశర్మ ఈ విధంగా తేటగీతిని ఎన్నుకొని పూరించారు.

'మీ'రుమేనియా'ర్తి వెలియలేరు గనుక
భా'మలేరియా' ప్రసవాబ్ది పారమెరుగ
ఇక 'సడేమియా' నన్న జీవిక ఫలంబె?
కనుడు 'సోమాలియా' కాశ
గరిమమించ.

ఇట్లాంటివే కాకుండా నైమిత్తికంగా ఈనాటి సమాజంలో పొద్దునే తినే ఉపాహారాలను గూర్చి అవధానుల పద్యాల్లో ఒదిగించారు.

దోసె, పూరి, వడ, సాంబారు అనే పదాలు పార్వతీ కళ్యాణంపై పద్యం చెప్పమన్నప్పుడు-

"పూరించెంగద దివ్య శంఖమును
శంబుండల్లదే నగ్రి
ప్రారంభించిరి శైవఘోషలట సాంబా
రుద్రయంచున్
స్మేరాస్య ప్రధితాప్తి తావడకుచున్
సిగ్గిల్లగా పార్వతిన్
చేరెన్ శంభుడు పెండ్లివేళను నేదో
సెప్పంగ తాప్రేమతోన్"

సామాజిక చింతన లోపించినా అక్కడక్కడా కాల్పనిక భావమాధుర్యం మనల్ని కట్టిపడేస్తుంది. కవులు ప్రసాద మాధుర్యంతో వాడిన లలితపదాలు, వీళ్ల ఆశువుగా ఎలా చెప్పగలిగారు అని ఆశ్చర్యం కలుగుతుంది.

"వీణలు మ్రోగెనో పుడమి వెన్నెల
లెల్లెద ప్రాకులాడెనో
ప్రాణులు మోదమగ్నులయి
భావమహత్తుల తేలియాడెనో
శ్రేణులు గట్టి కన్నియలు చెమ్మలు
చెక్కలు నాడుచుండిరో
వేణులుగా సితాభ్రములు విచ్చి
వియత్తుల క్రమ్ముచుండగన్"

వీణలు, ప్రాణులు, శ్రేణులు, వేణులు అనే పదాలనిచ్చినపుడు కోవెల సుప్రసన్నా చార్య చేసిన పూరణం ఇది. కాళిదాసు, కృష్ణశాస్త్రి లాంటి ఎందరు మహాకవులో ఆయనలో ఇంకిపోతే ఇలాంటి పద్యం ఆశువుగా చెప్పగలుగుతారు.

శరత్కాలంలో పాయలుపాయలుగా (జడలుగా) తెల్లటి మబ్బులు ఆకాశంలో వ్యాపిస్తున్నాయి. ప్రాణుల తలంపులు ఆనందంతో మురిసిపోతున్నాయి. కన్నెపిల్లలేమో వరుసగా చెమ్మచెక్కలాడు తున్నారు. ఈ రకంగా ఒక భావచిత్రాన్ని బొమ్మకట్టించారు ఈ అవధాని.

అవధానాలలో అనేక చమత్కారాలు జరుగుతాయి. ఓ స్థాయికి చేరిన సాహితీ పిపాసులకు ఇది రసాహారం. ఒక్కోసారి అవధానిని ప్రశ్నీకరించడం ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. అవధాని ప్రాశ్నికుని కంటే చమత్కారి అయి వుంటే ఇంక చెప్పవలసినదేమున్నది? ఆరుట్ల రంగాచార్యులకు వచ్చిన ప్రశ్న అట్లాంటిదే.

ఒక అవధానంలో ఉత్పలమాల, చంపకమాల, మత్తేభము, శార్దూలముతో కలిపి సరస్వతిని గూర్చి పద్యం చెప్పమన్నారు.

"తల్లీ యుత్పలమాల తోడ నిను
ధ్యానింతు, కాకున్నచో
భిల్లన్ చంపకమాల గూర్తును
దయాభిక్షార్థినై వేడుకన్
మల్లెల్ వోసిన రీతి
భాసిలుమనోమత్తేభ మెక్కింతునే
సల్లాపింపగ బిల్వవచ్చునుగదే
శార్దూలముల్ భారతీ"

దేవీ, నిన్ను చెంగలువ పూదండతో ధ్యానిస్తాను. లేకపోతే సంపెంగమాలను కూర్పుతాను. నీ దయను కోరుతూ వేడుకతో మల్లెలు పోసిన విధంగా ప్రకాశించేటట్టు నా మనస్సు అనే ఏనుగు ఎక్కిస్తాను. ఓ సరస్వతీ శార్దూలముతో పరస్పర సంభాషణలకు పిల్వవచ్చును కదా అని అమ్మతో మాట్లాడిన పద్యం ఎంత సౌందర్యదృక్పథంతో ఉన్నదో.

మరో అవధానంలో "రణమే శ్రేష్టము శాంతి నిల్పుటకు సర్వార్థమ్ము సాధింపగా అనే సమస్యకు గంధ్ర లక్ష్మణరావు అనే అవధాని

"క్షణముల్ తీరక భోగభాగ్యములకై
కామ్యార్థులై వర్తిలన
వ్రణముల్ పుట్టి రూరించు జీవితము

తీవ్రంబైన దు:ఖమ్ము నన్
గుణముల్ మార్చగ దుర్వ్యసనముల్
కవారంపు దైత్యాళితో
రణమే శ్రేష్ఠము శాంతి నిల్పుటకు
సర్వార్థంబు సాధింపగా''

రణమే శాంతికారకము అనే భావం దైత్యాళితో రణమే శ్రేష్ఠము అనడంతో సమంజసమైపోయింది.

కరోనా ఉత్పాతాన్ని గురించి ఈరోజు కొత్తగా చెప్పాల్సిన అవసరమే లేదు. మనిషితో పాటు అతనికి జీవవాయు వులూదగలిగే సాహిత్యాన్ని కూడా అతలాకుతలం చేసింది. పద్యకవిత్వంలోకి చివరికి అవధానంలోకి కూడా కరోనా చొరబడింది. ప్రాశ్నికులు కూడా కరోనాకు అతీతం కాలేదు.

కంది శంకరయ్య అనే అష్టావధానిని చిత్తము, పొత్తము, విత్తము, బెత్తము అనే పదాలనుపయోగించి లాక్డౌన్ సందర్భం గురించి పద్యం చెప్పమన్నప్పుడు...

"చిత్తమునన్ భయమ్ము
గడుచిత్రమ్ముగాగ కరోన నింపెనే
పొత్తములందెటన్ జదువబోము
గతమ్మున నిట్టి దుస్థితిన్
విత్తము లేనిదాయె గనవింతలు
పెక్కులు గానవచ్చె బో
బెత్తము బట్టువారి గనభీతిని బాఱుచు
నుంటి మయ్యయో!''

కరోనా కాలం అందరినీ బెదిరించినట్లే, బెత్తముతో పరుగెత్తించినట్లే ఉందనే భావన ద్వారా దత్తపది చక్కగా పూరించారు.

సమస్యల చమత్కారంగాను హాస్యస్ఫోరకంగాను, ఇచ్చేవాళ్ళున్నారు. ఇట్లాంటి సమస్యే ఎదుర్కొన్నారు. అష్టావధాని ముద్దు రాజయ్య. అతనికి వచ్చిన సమస్య "కారము పెట్టినాడతడు కాంతకు కన్నుల వేడ్క తీరగన్'' ఆయన ఈ సమస్యను ఇట్లా పూరించాడు.

"కారము పుండుపై పడిన కలిగెడు
మంట విధానసే యలం
కారము లేని భర్తగన కాంతను
క్రోధము గల్గువాని, ధి
క్కారముజేసె అప్పుగొని కాంచన
హారము కాన్కగా నలం
కారము పెట్టినాడతడు కాంతకు
కన్నుల వేడ్క దీరగన్.''

సరస్వతీ ఆరాధన అవధానుల్లో చాలా ప్రత్యేకమైన ఆచారం. ప్రతి అవధాని నోట అమ్మవారి శక్తిని పరవశంతో చెబుతూం డడం చూస్తుంటాం. శరదృతువును అమ్మవారితో పోల్చి వర్ణించమన్నపుడు తిగుళ్ళ శ్రీహరి శర్మ అపూర్వంగా వర్ణించారు. ఇందులోని కవిత్వం గమనించండి.

"శారద చంద్ర చంద్రికలు సౌమ్య
మహాకవి వారు చుట్టులన్
నీరద నీలిమన్ గనని నిర్మల
మభ్రము, నిర్మలాంబువుల్
సారస పుష్పశోభితము సారస హంస
విహార రమ్యముల్
శారదకాల శీతగతి చక్కగనుందుము
శారదోపమన్''

## తెలంగాణలో

**కొలిచలమ మల్లినాథసూరి మొదటి శతావధాని. ఈయన 13వ శతాబ్దివాడు. ఈయన పెదమల్లినాథసూరి మనమడే. సంస్కృత కావ్య వ్యాఖ్యాత ముఖ్యంగా కాళిదాసు కావ్య వ్యాఖ్యాత మల్లినాథసూరి ఈయన మనమడే. ఈ పుసక్తం 13వ శతాబ్దివ వాడని పేర్కొన్నది. కొలిచెలమ మల్లినాథసూరి తెలంగాణలో అవధానానికి ఆద్యుడు.**

శరత్కాలపు వెన్నెలలు మహాకవి మాటలవలె ఉన్నాయి. ఆకాశం మేఘాలు లేకుండా నిర్మలంగా ఉంది. స్వచ్ఛమైన నీరు తామర పువ్వులతో శోభిస్తుంది. అందంగా విహరించే బెగ్గురు పక్షులు, హంసలు శరత్కాలపు చల్లదనంలో ఉన్నట్టే చక్కగా శారదవలె ఉన్నాయి. ఈ విధంగా ఉపమా సౌందర్యంతో అలరారింది ఈ పద్యం.

ఒక్కోసారి అవధానికి సినీతారల పేర్లిచ్చి పద్యం చెప్పమనే ప్రాశ్నికులు ఉంటారు. ప్రేక్షకులకు వినోదం అవధానికి ఉండే వర్తమాన జ్ఞానం దీనివల్ల తెలుస్తుంది. అలాగే వేదాటి రఘుపతి ఇలాంటి ప్రశ్న ఎదుర్కొన్నారు. ఆయన నాటి తెలుగు తారామణుల పేర్లతో పద్యం రమ్యంగా నడిపించారు.

"అంజలి సూర్యకాంతము, రమాప్రభ,
శారద, లక్ష్మి వాణి గీ
తాంజలి, జానకీ, జయసుధా,
జయచిత్ర, సుజాత, రాధికా
మంజుల, మంజుభార్గవి, రమాప్రభ,
మాధవి, రాజ్యలక్ష్మి బల్
రంజిలు తారలీభువికి రాలిన ఆ
దివిలోని తారకల్''

మలుగ అంజయ్య అవధాని చేసిన పద్యపూరణం రసరమ్య గేయం. ఆయనకు అందము, చందము, నందము, బంధము అనే పదాలతో నేటి స్త్రీల గురించి పద్యం చెప్పమనే ప్రశ్న వచ్చింది. ఆయన తడుముకోకుండా చేసిన పూరణం ఇది.

"జగతికందమ్ము వనితయే జాగృతమ్ము
ప్రేమ బంధమై వెలుగొందు రమ్యమూర్తి
ఏమనందము లోకమ్ము నిట్లు మారె
కష్టములు గలుగు చందమ్ము
కలియుగమ్ము''

దోరవేటి ఒక విలక్షణ పద్యకవి. ఆయన పూరణం ఆహ్లాదభరితం. హైదరాబాద్ వినాయక నిమజ్జనం చూస్తూ మాట్లాడుకొంటున్న సందర్భం గూర్చి వర్ణించమంటే

"హిమసుత నీదునందనుని యింపుగ
గంగను ముంచుమేల తా
నము కయి చేసె సాగరము నందది
వైతరణీ నది సమా
నము గద! ముగ్ధ భక్తిని గనంగను
వాసన లేలగల్గునో
శమదమనా! యటన్న విని శంకరు
నవ్వెను హాయిహాయిగా.''

మధురకవి బిరుదాంకితులు ఇమ్మడోజు భద్రయ్య. ఈయన తన చూపు అవధానంపై విసిరారు. ఆశుధుని

రెక్కలు విప్పింది. ఆయనను ఛందస్సుకు సంబంధించిన కవిత పద్యపాదం సమస్యగా వరించింది. భగణంబున గురువు లేదు పండితులారా అని ఆయనకు ఇచ్చిన సమస్య. ఆయన పూరణం చూడండి.

“తగుదని తగదని మది లో
తుగ యోజింపకయె చేయుదురు దురితమ్ముల్
పగతురు పశువుల క్రియ వృష
భ గణంబున గురువులేదు పండితులారా.”

ఛందోగణం కాస్తా వృషభగణంగా మారిపోయింది. అవధానిలోని ఔచితిని తెలుపుతున్న అంశం ఇది.

చక్కని ధార కలిగిన మరో అవధాని బండికాడి అంజయ్య. భామ, లేమ, రామ, సీమ అనే పదాలతో శ్రీకృష్ణలీలలు పద్యం చెప్పమన్నపుడు

“ఓ యదువల్లభా! మరులకోర్వను రమ్మిక శ్యామలాంగ సు
శ్రీయుత గోపికారమణ లేమహిమాన్విత నందనందనా
కామజుతండ్రి రామనగ కారణమీవయి వేడ్క మీరగా
శ్రీయము నా విహార తమసీ మధురాంగుడ బాలకృష్ణుడా.”

రసరమ్య పూరణాలతో, ఆశుధారతో, ఆద్యంతం పద్యప్రియులను కట్టివేసే ఈ అవధానం తెలంగాణకు సాహితీరంగంలో ఒక కొత్త ఆవిష్కరణ.

అవధానం ఒక సామాజిక వర్గం మాత్రమే చేయగలరని ఒక అపప్రథ ఉంది. కానీ ఈ వ్యాస సంకలనంలో వివిధ సామాజిక వర్గాల నేపథ్యం గల సబ్బండ వర్ణాల అవధానులు స్థానం పొందడం ఒక హర్షణీయమైన పరిణామం. వ్యాస రచయిత యొక్క ప్రజాస్వామిక స్ఫూర్తికి ఇది గొప్ప నిదర్శనం. అవధానులందరినీ ఒక్క చోట కూర్చడమే కాదు.అవధానం యొక్క ఆరంభవికాసాలను సంక్షిప్తంగా ఇందులో పేర్కొనబడ్డాయి.

పరిశోధకులకు సాహిత్య చరిత్రకారులకు ఇదో మంచి ఉపాధేయం. ఇంత చక్కని ఈ వ్యాస సంకలనంలో చిలకమర్రి రామానుజాచార్యులు చేసిన సమస్యను పూరించిన విధం చూడండి

“ఇట్రా ప్రాసమునన్ వచించుటకు నాకేలా విచారంబి దే
భట్రాజైనను చెప్పగా గలడు శుంభద్వాణియైయెందునే
కుట్రల్ సుద్దులు లేక గాథ విని మున్ కుఱ్ఱండు తానిట్లనెన్
గట్రాచూలికి సీత చెల్లెలటరా కామయ్య విన్నావటోయ్!”

ఈ పద్యంలో చివరి పాదం సమస్య. పై మూడు పాదాలు ఆయన పూరణం. ఇది ఆయన సద్యః స్ఫూర్తికి ఊహాశక్తికి ప్రతిబింబమైన పాదపూరణ.

ఏ భట్రాజైన ఇలాంటి సమస్య పూరణం చేయగలడు. నేను చేయలేనా అనే అమాయక అహంతో కూడిన ప్రకటనతో పాటు, ఇతరులను తక్కువ చేయడం సమంజసమా? ఇలాంటి వైక్లభ్యాలను మన పండితులు ఎలా పరిహరించుకుంటారు? ఆనాటి సామాజిక పరిస్థితులకు అద్దం పడుతుందీ పూరణ.

ఈ సంకలనంలో అవధానుల కూర్పు అద్భుతంగా జరిగింది. ఇంత మందికకవి పండితులను జత గూర్చిన ఈ ప్రయత్నం తెలంగాణకే గర్వకారణం.

మిత్రుడు భాను ప్రకాశ్ ను మనః పూర్వకంగా అభినందిస్తున్నాను.

***(అవధాన తెలంగాణ, అవధాన పరిచయ పుస్తకానికి డాక్టర్ కాంచనపల్లి రాసిన ముందుమాట)***



# హేతు వాదివై నడువుమా.....

**అన్వేషి**

పసిడిరేకులబంగారుపరిమళాల
జగతికిని వెలుగు పంచెడి జవనశీలి
అదిగో ఆకాశ వీధిలో అరుగురించి
ప్రకృతిని మేలుకొలిపెను ప్రగతి వైపు

తమసి నిశ్శబ్దమవుచును తరలిపోయె,
విరులు మొగ్గతనమ్మును విడిచిపెట్టె,
కవన ఝురులతో హృదయము గగనమంటె
కదలుచుండెను యాంత్రిక కాలరేఖ

జీవితంబున కష్టాలు శిరసు వంచు
భారమగు చీకటులు నింకదూరమగును
భగ్న ఆశయ పథములు మరలవిచ్చు
మానవావీడు మా ఇంక మరి నిరాశ

పాడుకొను హృదాంతర ప్రగతి గీతి
ఆడుకొనుము జయమ్ముల నందు ఆట
భ్రమల జగతిని ఒక కంట మార్చి వైచి
హేతువాదివై నడువుమా చేతనమున

1965 కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత...

సాహితీ శిఖరం

# వర్ణనలో మేటి....

# రాయప్రోలు సుబ్బారావు



నవ్య కవితా పితామహునిగా పేరుపొందిన రాయప్రోలు సుబ్బారావు 1892మార్చి 17న బాపట్ల, గుంటూరు జిల్లాలో జన్మించాడు. తెలుగులో భావకవిత్వానికి ఆద్యుడైన రాయప్రోలు సుబ్బారావు 1963వ సంవత్సరంలో ప్రచురించిన "మిశ్రమంజరి" అనే కావ్య సంపుటికి కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారం 1965వ సంవత్సరానికి "మిశ్రమంజరి" కావ్యం అందుకొంది.

మిశ్రమంజరి 54 కవితలతో కూడిన ఖండ కావ్యం. పీఠికలో రాయప్రోలు "వ్రాసినది సురక్షితంగా ఉంచుకోవడము మొదటి నుంచీ అలవాటు లేదు. ఇటీవల పాత కాగితాలన్నీ వెతకడం మొదలెట్టాను. ఏవో లభించినవి, కొన్ని వెలుతురు చూడనివి ... అన్నిటినీ కలిపి "మిశ్రమంజరి" పేరుతో ప్రకటిస్తున్నాను. కలగూర గంపలాగా తయారయింది. ఇందులో పుల్లనివీ, తీయనివి, చప్పనివి కూడా మిశ్రమమై గుత్తి కొన్నవి... రుచులలో భేదం సుతారం. నిమ్మ పండు పులుపూ, దానిమ్మ పండు పులుపూ ఒక్కటే అనదు నాలుక. తీపికీ, చెరుకు పాల తీపికీ ఏదో రసపాలు భేదం లేకపోలేదు. ఇక కావ్యం అంతటా ఏకైకంగా ఉండునన గలమా!" అంటూ కవితాత్మకంగా చెప్పుకున్నారు. "పల్లెపడచు", "కాపుకన్నె" "మిశ్రమమంజరి" సంకలనము లోని రెండు ప్రసిద్ధ కవితా ఖండికలు. ఈ కవితలలో రాయప్రోలు సుబ్బారావు తెలుగుదేశపు గ్రామ ప్రాంతాలను, ప్రజల జీవన విధానం, స్త్రీల కట్టు బొట్టు, అలవాట్లు, అద్దం పట్టినట్లు చూపిస్తారు. స్త్రీ వర్ణనలో పూవులో తావిలా సహజత్వం ఉట్టి పడుతుంది. తెలుగు పల్లె పడచు సౌదర్యం రమణీయంగా వర్ణించారు. అత్యుక్తులు గాని, పదాడంబరము గాని కని పించవు. స్త్రీల సౌందర్యాన్ని వర్ణించుటలో వారు నిర్ణయించుకొన్న పరిధి ఎంతో ఆదర్శనీయమైనది. వీరి రచనలలో ఎక్కువగా స్త్రీ కన్నులు, శరీర కాంతి, ప్రాయము వంటి వాటిని గూర్చిన వర్ణనలే కనిపిస్తాయి. మొగలి పూవు వంటి దేహకాంతితో, పచ్చి పసుపు కొమ్ము వంటి మంగళ ఛాయతో స్త్రీలు వారి రచనలలో మనకు దర్శన మిస్తారు! రాయప్రోలు వారు తమ కవితా ప్రతిభ అనే ప్రత్యేక సొమ్ముతో స్త్రీలను అలంకరించి తీర్చిదిద్దుతారు.

ఆశ్లీలత మైక్రోస్కోపుతో పరిశీలించినా కనిపించదు. పల్లె పడుచు సజీవంగా ప్రత్యక్ష మవుతుంది. తెలుగు పల్లెపడుచు పొలంలో తనకు తాను పశుపక్ష్యాదులతో మమేకమై ఆడుతూ, పాడుతూ సంతోషముతో ఎలా కాలక్షేపం చేస్తుందో సహజంగా చిత్రిస్తారు రాయప్రోలు. ప్రకృతి సౌందర్యాన్ని స్వల్ప వర్ణనలతో చలనం, చైతన్యం మూర్తీభవించు విధంగా చిత్రపటం లాగా కళాను భూతిని పాఠకులకు కలిగిస్తారు ఆయన. తృణకంకణము, ఆంధ్రావళి, కష్టకమల, రమ్యాలోకము, వనమాల, మిశ్రమంజరి, స్నేహలతా దేవి, స్వప్నకుమారము, తెలుగు తోట, మాధురీ దర్శనం, రూపనవనీతం మొదలైన ఖండాకావ్యాలు రాశారు. అనుమతి, భజగోవిందము, సౌందర్య లహరి, దూతమత్తేభము, లలిత, మధుకలశము మొదలైన అనువాదాలనూ చేశారు.

ఆంగ్లకవి 'గోల్డ్ స్మిత్ - హెర్మిట్' కవితని 'లలిత (1909)గా, టెన్నిసన్స్ రచన - 'డోరా'ను 'అనుమతి (1910) లఘుకావ్యంగాను అనువాదం చేశారు. కళాకారుని ఊహలు, భావాలు, సృజనాత్మకతకు ప్రాధాన్యమిచ్చే కళారూపం భావుకత. 18వ శతాబ్దంలో జర్మనీ, ఫ్రాన్సు దేశాలలో వికసించిన ఈ కళాప్రక్రియ చిత్రకారులనూ, రచయితలనూ, శిల్పులనూ, కవులనూ గాఢంగా ప్రభావితం చేసింది. పాశ్చాత్యదేశాలలో పరిమళించిన ఈ భావుకతను రాయప్రోలు తెలుగులో విరజిమ్మాడు. రాయప్రోలు సుబ్బారావు 1984 జూన్ 30న పరమపదించారు.



# స్పర్శరేఖ



ముదిగొండ సంతోష్, 79813 52713

పట్నానికి పల్లెకు మధ్య స్పష్టమవుతూ
బలపడుతున్న రేఖ
మనిషి నుండి బతుకువేరై తెగిపోతున్న కర్కశరేఖ

పట్నము ఓ వికృతితో నిష్ప్రకృతికి పయనిస్తోంది
పల్లె ఇంకా పురివిప్పిన పచ్చదనమై
ప్రసవిస్తూ నగరం పై నీడను పరుస్తుంది

మట్టిని లేపనం చేసి అందాల పేరిట అగాధాలు త్రవ్విపోస్తూ
నోరు తెరుచుకున్న బ్లాక్ హోల్ నగరం
ప్రాణపు గింజల వేటలో శ్రామిక స్వేదం
బురదై విరిసిన సహజాద్భుతమైన పరిమళం

ఎగజల్లిన విత్తనాల కడుపుల్లో పచ్చని కాంతి
సెలవుల్లేని కష్టంతో శ్రమించి
పట్నానికి హారంగా ఆహారం
శ్రమైక జీవన సౌందర్యానికి పాటై పల్లవిస్తుంది.

ఉరుకుల పరుగుల జీవితంలో ఉషస్సు గగనకుసుమం
రంగుల్ని ఎండబోసే పొద్దులు,
ఆశలు రేకెత్తించే చుక్కలు అనాథ శిశువులు ఇక్కడ
తీరిక లేని పనుల్లో తీరం చేరక అలసిపోతుంది

గాజు పువ్వులు అల్లుకున్న ద్వారాల్లో
ఆప్యాయతల సూత్రం కనుమరుగు
వికృత స్వేచ్ఛల్ని పీలుస్తున్న విశాల కారాగారం
పొడి వస్తువులను ఉత్పత్తి చేస్తున్న కర్మాగారం పట్నం

నేలతో చుట్టరికం తెంపుకోలేక, ఒక దిక్కంత ఆశల్ని కలగంటు
పచ్చని పొదరిళ్లలో చుక్కల్ని, వెన్నెలను కప్పుకొని
ముడుచుకున్న ఆకాశం పల్లె
అందుకే పట్నాన్ని పల్లెలు పల్లెలుగా విడగొట్టాలనిపిస్తుంది.

కథ

# పొక్కిలి

**పొక్కిలై పోతున్న మానవ ప్రపంచం...**



**రామా చంద్రమౌళి**
93901 09993

అంతిమంగా మనిషి తిరిగి తిరిగి బాల్యం నుండి యవ్వనం, యవ్వనం నుండి ప్రౌఢస్థితి, పొద్దువాలే దశ, అస్తమయం.. రౌద్ర నిష్క్రమణం.. తర్వాత.

తర్వాత అదేమిటో ఏ అనుభూతికీ తెలియని ఒకానొక నిశ్చేష్టతో కూడిన మబ్బుపింజవలె ఎటో, ఎక్కడికో, ఏ దిగ్మండలంలోకో అదృశ్యమైపోతూ.. నిష్క్రమణ.

మరణమా.? రణమా.?

ఎవరికైనా 'జీవితాన్ని' నిర్వచించ వలసివస్తే, అంతిమంగా జీవితం కేవలం 'పిడికెడు జ్ఞాపకాల సంహిత' అనేనా. నిజమింతేనా. సత్యమూ ఇంతేనా. కఠోరమైన వాస్తవమూ ఇంతేనా.

'ఊ.. ఇంతే. ఇంతేగాక ఇంకేమున్నది. ఏది ఉన్నది.. ఏది లేనిది.. ఏదైనా ఏమిటి అన్న మీమాంసలో గరాటులోకి విసిరేయబడ్డ గాజుగోళీలా కొట్టుకుని కొట్టుకుని.. తిరిగి తిరిగి.. భ్రమించి భ్రమించి.. గెట్ చోక్డ్ ఎట్ ఎ హోల్. ఫూల్ ప్రూఫింగ్.

ఫూల్ ప్రూఫింగ్.. అంటే.. ఇక అంతిమంగా అక్కడికే వచ్చి ఆగిపోవడం. అక్కడే ఆగిపోవడంకంటే వేరే ఇంకేచోటికీ చేరుకోలేక అనివార్యమై అక్కడే ముగిసిపోవడం.

అంతేనా.. ఊ.. అంతే. తప్పక అంతే.

అతను.. అరవై ఏడేళ్ల అతను.. ఒక విశ్రాంత ప్రొఫెసర్.. ఆ ఒంటరి రాత్రి, నిద్రరాని ఆ కఠోర రాత్రి.. అప్పటిదాకా పిడికెడు నిద్రకోసం పరితపించీ పరితపించీ.. అప్పుడే ఓ నాల్గు నిముషాల కింద ఒక యుగకాలం తపస్సించగా అందిన చిటికెడు నిద్రను ఆస్వాదించి.. చటుక్కున మెలుకువించి కనురెప్పలను విప్పుతూ.,

నేత్రద్వయంపై వాలిన సకల ప్రపంచ భారాన్ని గోవర్ధనగిరిధారియై ఉచ్ఛ్వాసిస్తున్నట్టు.

ఆ గది అంతటా పరుచుకుని ఉన్న తెల్లని చిక్కటి పాలవంటి కాంతిలో.

'వీనికి వెల్లువెత్తే కాంతి అన్నా, గడ్డకడ్తున్న వెన్నెలన్నా ఎంత ఇష్టమో' అని అమ్మ తన పసిచెంపలపై అమృతపు ముద్దు పెడ్తూ.. మురిసిపోయిన ఆ జ్ఞాపకం.. ఎంత రసోత్తర మహానుభూతో.

మెల్లగా, అతి ఆత్మ పారవశ్యతతో కరిగిపోతూ.. కనుచిప్పలను విప్పగానే, ప్రక్కనే ఎప్పుడో ఇరవై ఏడేండ్లనాడు మక్కువపడి కొనుక్కుని అమర్చుకున్న క్రాంప్టన్ టేబుల్ ల్యాంప్. తెల్లని పాల వెలుతురు వర్షం.

మళ్ళీ మనసు యథాస్థితిలోకి ఒక తెగిన నక్షత్రంలా జర్రున జారిపడ్తూ.,

ఊ. అప్పటినుండి తను పాత ఉత్తరాలను చదువుతూ.. చదువుతూ.. మనస్సు సుడిగాలిలో కొట్టుకుపోతున్న కాగితపు ముక్కలా తేలిపోతూ, గాజు ముద్దకింద ఆ ఉత్తరం అట్లాగే ఉంది.

తన అత్యంత ఆత్మబంధువు, యోగి, జీవితమంతా ఎక్కడెక్కడో రసవద్లోకాల్లో విహరిస్తూ విహరిస్తూ అప్పుడప్పుడు మాత్రమే ఈ భౌతికలోకంలోకి ఊడిపడి క్షణకాలం అనువర్తించి నిష్క్రమిస్తూ చిరునవ్వు నవ్వుతూ వికసించే మిత్రుడు.. ప్రసిద్ధ రచయిత వడ్డెర చండీదాస్ రాసిన ఉత్తరం గాలికి కొట్టుకుంటూ నిశ్శబ్దంగా శబ్దిస్తూంటే మళ్ళీ ఒకసారి చేతిలోకి తీసుకుని అతను చదవడం ప్రారంభించాడు.

ఉత్తరపు కాగితం నీరకాయ రంగులోకి మారి చివికిపోయి.. ఇక విరిగిపోతుందా అన్నట్టు.,

**28.2.85**

శ్రీ రామా చంద్రమౌళి గారికి,

మీరు పంపిన మీ కవిత్వం పుస్తకం చదివాను (కొన్ని ఆంధ్రజ్యోతి వీక్లీలో చూశాను). విశ్లేషణ వివరణ అనుశీలనలు చాతనైతే అందుగురించి రాద్దును. అనుభూతించడం తప్ప మరేం చాతకాదు. కవిత్వం ఐతే మరీ మరీ యిష్టం. మీవంటి కవులు కొందరు యీ తరంలో వుండబట్టి చదువుకోడానికి అప్పుడప్పుడు లభ్యమౌతోంది.

కొన్ని కవిత్వ పుస్తకాల్లో కవిత్వం

క
థ

ఉంటుంది. మరికొన్ని పుస్తకాల్లో అక్కడక్కడ కవిత్వం ఉండదు. మీ పుస్తకం యీ రెండో కోవకు చెందుతుందనిపించింది.

కృతజ్ఞతలతో,
- వడ్డెర చండీదాస్
హి.మో.హ సదనం.

తన 'శిలలు వికసిస్తున్నాయి' కవితా సంపుటిని స్వయంగా తిరుపతిలో చండీదాస్ గార్కి అందజేసి.. వెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుండి ఆయన ఒంటిగది పెంట్హౌజ్ నివాసంలో ఆ రోజు గడిపి వచ్చిన నాటి రాత్రి.. ఆయన ఒక విలక్షణ రీతిలో తన వాహనంగా ఒకరిక్షా తొక్కే వ్యక్తిని తన స్వంత గజ్జెలరిక్షాకు డ్రైవర్గా పెట్టుకుని యూనివర్సిటీకి వస్తూ పోతూండడం.. ఆ గజ్జెల లయాత్మక సవ్వడి.

తత్వ శాస్త్ర ఆచార్యునిగా అతని విశేష జీవన విధానం, భిన్నత.. తెలుగు నవలా సాహిత్యాన్ని ఒక మలుపు తిప్పిన అతని నవల హిమజ్వాల, అనుక్షణికం, చీకట్లోంచి

**జీవితమంటే అన్నీ మధురమైన ఘట్టాలతో నిరంతరం ఉన్నతపథంలోనే కొనసాగడం ఎవరికీ సాధ్యమయ్యే సంగతి కాదు. కొన్ని చీకటి వెలుగులు, నిమ్నోన్న తాలూ, కష్ట సుఖాలూ సమ్మిళితమై ఉంటాయి తప్పక. ఈ సత్యాన్ని మనిషి ఎంత తొందరగా గ్రహించి అందుకు తనను తాను సంసిద్ధుణ్ణి చేసుకుంటే అంత తొందరగా పక్వతను సాధించి పరిపూర్ణుడౌతాడు.**

చీకటిలోకి, ప్రేమతో.. మొదలైన కృతులన్నీ మెరిసే గుర్తులైతే,

మాయని మరుపురాని వడ్డెర చండీ దాస్తో గడిపిన ఘటనలన్నీ ఒట్టి జ్ఞాపకాలేకదా.

మరో ఉత్తరం. పోస్ట్కార్డ్. పోస్ట్కార్డ్ రాయడమే యిష్టం మిత్రుడు ఇస్మాయిల్ గారికి. అత్యంత ఆత్మీయమైన పిలుపు ఆయనది. ఇప్పుడు మనుషుల్లో ఆ ఆత్మీయతలోలికే స్వరస్పర్శ పూర్తిగా లోపించింది.



చంద్రమౌళి గారూ,
మీ అందమైన పుస్తకం పంపించి నన్ను సంతోషపెట్టినందుకు ఎన్నో కృతజ్ఞతలు. నన్ను గుర్తుంచుకున్నందుకు కూడా.

మీ కవిత్వమంటే నా కిష్టమని చెబితే చాలదూ? ఇంకేం చెప్పాలి!

మీ
ఇస్మాయిల్
లచ్చిరాజు వీధి,
కాకినాడ- 1

తేది: 1-3-85

ఇస్మాయిల్ గారిది నిర్మలమైన కోల ముఖం. బంగరు వన్నె. హృదయంకూడా స్వర్ణమే. జీవితమంటే ఒక జ్ఞాపకమై ఒక ఘటన దోసిట్లో శిశుపక్షిలా గుండెల్లో ఒదగడమేగదా.

ప్రక్కన మరో లేఖ.. గుంటూరు శేషేంద్రశర్మగారిది.

శేషేంద్ర/ కవిసేన
జ్ఞాన్ బాగ్ ప్యాలెస్, హైదరాబాద్
మిత్రులు శ్రీ రామా చంద్రమౌళి గారికి,
మీరు పంపిన మీ కావ్యకృతి 'స్మృతిధార' ను తృషిత పాంథునిలా దోసిళ్ళతో తాగేశాను. లోకాన్నంతా బింబాలు, ప్రతీకలు, అలంకారాలుగా మార్చి భాషలో దించారు.

'ఎన్నో ఒట్టి వెదుళ్ళు వేణువులైనట్టు నాకు జ్ఞాపకం' అన్నారు. చాలా బాగా చెప్పారు.

మీ,
శేషేంద్ర
24/2/1985

అన్ని జ్ఞాపకాలూ సముద్రాలను మోస్తున్న భూమిలా అక్షరాలను మోస్తున్న ఉత్తరాలై ఉండవు. స్వాభావిక అనుభవాలుగా ఆకాశంలో గుప్తమై ఉండే సముద్రాలను మోస్తున్న మేఘాల్లా ఉండిపోతాయి గుండెలో.

అటువంటి ఒక మహోజ్జ్వలమైన జ్ఞాపకం రాగి వాహకంలో విద్యుత్ ప్రవాహంలా కదుల్తూ, ఆరణాల కూలీగా ఆల్విన్ కార్మాగారంలో పనిచేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎదిగిన అతి సామాన్యుణ్ణి నేను అని ప్రకటించుకుని 1980 నుండి 1982 వరకు కొనసాగిన టంగుటూరి అంజయ్య తన పాలనలోని బహుశా 1982 సంవత్సరం అనుకుంటా ఆ సంవత్సర కాలం 'ఆంధ్రప్రదేశ్ అవతరణ' ఉత్సవాలను రాష్ట్రం లోపలా వెలుపలా నిర్వహించి తమిళనాడులోని ప్రసిద్ధ 'హోటల్ వుడ్లాండ్స్'లో గోయెంకా గ్రూప్కు చెందిన ఆంధ్రప్రభ దినపత్రికకు విలక్షణమైన ఏడుగురు తెలుగు కవులను

విశిష్ట పురస్కారానికి ఎంపిక చేయమని కోరి వారి నేతృత్వంలోనే మొత్తం కార్యక్రమాన్ని దక్షిణాది రాష్ట్రాలైన ముగ్గురు ముఖ్యమంత్రులతో ఒకే వేదికపై సన్మానించే కార్యాన్ని తలపెట్టారు. టి. అంజయ్య. తమిళనాడు ముఖ్యమంత్రి ఎం. జి. రామచంద్రన్, కేరళ ముఖ్యమంత్రి కరుణాకరన్ ఆ ముగ్గురు ముఖ్యమంత్రులు. అప్పటి ఆంధ్రప్రభ సంపాదకులు కె.ఎస్.సుబ్రహ్మణ్యం, ఉపసంపాదకులు పొత్తూరి వేంకటేశ్వరరావు ప్రధాన నిర్వాహకులు.

ఈ పురస్కారానికి ఎంపిక చేయబడ్డ కవులు బోయి భీమన్న, డా. అరిపిరాల విశ్వం, దాశరథి, ఇస్మాయిల్. డా. ఆవంత్స సోమసుందర్, రామా చంద్రమౌళి. ప్రసాదరాయ కులపతి.

దక్షిణాది రాష్ట్రాల ముగ్గురు ముఖ్యమంత్రుల చేత ఏకకాలంలో సన్మానించబడ్డం ఒక ప్రతిష్టాత్మక ఘట్టమే. ఆనాటి హేమా హేమీలలో అతి పిన్న వయస్కుడు తనే కావడం చాలా ఆనందాన్ని కలిగించింది.

జీవితమంటే అన్నీ మధురమైన ఘట్టాలతో నిరంతరం ఉన్నతపథంలోనే కొనసాగడం ఎవరికీ సాధ్యమయ్యే సంగతి కాదు. కొన్ని చీకటి వెలుగులు, నిమ్నోన్న తాలూ, కష్ట సుఖాలూ సమ్మిళితమై ఉంటాయి తప్పక. ఈ సత్యాన్ని మనిషి ఎంత తొందరగా గ్రహించి అందుకు తనను తాను సంసిద్ధుణ్ణి చేసుకుంటే అంత తొందరగా పక్వతను సాధించి పరిపూర్ణుడౌతాడు.

అందుకు ప్రతి వ్యక్తికి కావలసింది ఒకటి... ప్రకృతి నియమాలనూ, ధర్మాలనూ సృష్టినుండి సంగ్రహించగలిగే దార్శనికత. రెండు.. సమాజంలో తన్నుతాను నీతినియమాలతో, నైతికతతో.. శుద్ధతతో తీర్చిదిద్దుకునే బలమైన సంకల్పంతో పాటు కసితో నిండిన అంతరాగ్ని.

అతనికి తనలో కసితో నిండిన దీక్షనూ, పట్టుసడలని తపస్సువంటి కృషినీ కొనసాగించేందుకు హేతువైన ఒక అనుభవం జ్ఞాపకమొచ్చింది. అవి అతను ఆ పల్లెటూర్లో 6 వ తరగతి చదవడానికి ప్రతిరోజూ వాగును దాటి ప్రక్క ఊరి బడికి వెళ్ళొచ్చే రోజులు. ఆ బడిలో చాలా కనబడే కుల వివక్ష. అగ్ర కులస్తుడైన హెడ్మాస్టర్. అగ్ర కులస్తుడైన ఆ ఊరి విద్యార్థి. మిగతా అందరూ ఇతరేతర వెనుకబడిన, నిమ్న కుల సామాజికులైన మొత్తం పదహారు మంది విద్యార్థులు. ఒకే ఒక అమ్మాయి. అతిశూద్ర సామాజికురాలు. ఐతే.. అన్ని రకాల రాజకీయ పదవులూ, అవకాశాలూ, ప్రభుత్వ సదుపాయాలూ.. వాటిపై ప్రకటిత అప్రకటిత అధికారాలూ.. హెడ్మాస్టర్.. ఆ వెంకటరెడ్డిలదే. రెండే రెండు కుటుంబాల ఆధిపత్యం కింద మిగతా ఎనిమిదివందల మంది తలవంచుకుని నిలబడ్డం.

ఎందుకు? అని ప్రశ్న.

ఈ అంతరం నుండి, అణచివేత నుండి మనిషి స్వస్పృహతో చైతన్యుడు కావడానికి చేయవలసిందేమిటి? అని అన్వేషణ..

చదువు.. అని జవాబు.

చదువే ఆయుధం అన్న ఎరుక. చదువే ధైర్యం.. శక్తి, చేవ, సత్తువ.. అన్న జ్ఞానం.

ఆ సత్యం తెలుసుకున్న రోజే.. రాఘవ, తన క్లాస్మేట్.. అతనొక్కడికే వేరే ప్రత్యేక కుర్చీ కూర్చోడానికి. మిగతా అందరు నేలమీద.. మట్టిపైన తనతో సహా..

రాఘవ.. ఆ రోజు బడి ఐపోగానే అందర్నీ బడి మర్రిచెట్టుకిందికి తన పుట్టినరోజు మిఠాయిలిస్తానని పిలిచి.. లడ్డూలిచ్చి.. చివర్లో ఒక ఆట మొదలెట్టిండు.

లడ్డూలకు ముఖం వాచిన పేదరికం. అందువల్ల వాని చుట్టూ అందరూ గుంపుగుంపులుగా ఎగబడ్డం.

హేవ్స్.. హ్యావ్ నాట్స్. స్పృహ తనకు.. తెలుస్తోంది దోపిడీకి మూలసూత్రం.

రాఘవ మర్రిచెట్టు చుట్టూ కట్టి ఉన్న రచ్చబండవంటి గద్దెనెక్కి ఒక ప్రకటన చేసిండు తన పుస్తకాల బ్యాగ్లోనుండి ఒక పిడికెడునిండా కొత్త మెరిసే రూపాయి, రెండు రూపాయల నాణేలను తీసి పట్టుకుని.. "నేనిప్పుడు వీటిని గాలిలోకి ఎగజల్లుత. మీరందరూ అవి కింద భూమ్మీద పడడానికి ముందే చకచకా ఎగబడి ఎవరికి దొరికింది దాన్ని అందుకుంటే.. అప్పుడది వాందే. మళ్ళీ ఇంకో గుప్పెడు కాయిన్స్ను నేను ఎగజల్లుత. మీరు ఏరుకుని తీసుకోవాలె. ఎంజాయ్. అర్థమైందిగదా".

"ఆ.. ఆ" అని తలలూపి తయ్యారైనారు ఆటకు అందరు. చూస్తూండగానే రాఘవ తన బ్యాగ్లోనుండి పిడికెడు కొత్త నాణేలను తీసి అరుస్తూ గాలిలోకి వెదజల్లాడు. దాదాపు వందమంది విద్యార్థులు.. గుంపుగా గాలిలోకి ఎగబడి.,

అర్థమైంది తనకు. మొత్తం మూడు ట్రిప్పుల్లో ఏడెనిమిది మంది పిల్లలకు మోకాళ్ళ మట్టికొట్టుకుపోయి.. రక్తాలు కారడం.. కుంటుకుంటూ.. ప్రక్కకు తప్పుకుంటూ.,

ఈ టార్చర్ అండ్ ఎంజాయ్.. క్రీడను గుర్తించి తను రాఘవరెడ్డి దగ్గరికి వెళ్ళి.. వాని చేతుల్లోని సంచిని గుంజుకుని.. 'ఈ నాణేలను ఇప్పుడు నేను విసుర్త.. నువ్వు కూడా వాళ్ళందరిలో కలిసి ఏరుకరాపో. ఎన్ని నువ్వు తెస్తే.. అవి నీకే..' అని అంటూండగా.. ఘర్షణ.. రాఘవరెడ్డి.. హెడ్మాస్టర్ వచ్చి.. అందర్నీ బలవంతంగా ఆపి,

"అరేయ్.. నీ మాయ తెలుస్తాంది మాకు. ఇక చాలుపో చాలుపో తోక ముడుచుకుని".

అప్పుడు వినబడ్డది సన్నగా వెనుక నుండి.. "ఈ లంజకొడ్కులు తెలివి మీరు తాండ్లురా దినదినం .. తుంచెయ్యాలె" అని హెడ్మాస్టర్ కంఠం.

సరిగ్గా ఆ క్షణమే విపరీతమైన ఉధృతితో చినుకులు మొదలై వాన మొదలైంది.

ఐదు నిముషాల తర్వాత అప్పటికే అంతా నీటితో తడిచిన నేల.. మెత్తబడ్తూ.,

అప్పటికే ఆగ్రహోదగ్రుడైన తను ..

కథ

కసిగా కోపమొచ్చిన ప్రతిసారీ చేసేట్టుగానే చటుక్కున తన పుస్తకాల సంచీలో దాచుకున్న 'బొంగరాన్ని' చకచకా పేనిన నూలు తాడుతో చుట్టి.. లాఘించి ఈడ్చి నేలకేసి కొట్టాడు బలంగా. ఒడుపుగా విసిరిన బొంగరం మహెూధృతితో గిరగిరా తిరగడం ప్రారంభించి .. భూమిని తొలుస్తూ పొక్కిలి చేయడం మొదలెట్టింది.

చూస్తూ చూస్తూండగానే.. భూమి పొక్కిలి పొక్కిలైపోతూ.. మట్టి చిమ్ముకుంటూ చుట్టు ప్రక్కలకు ఎగజిమ్ముతోంది.

రాఘవ వంక ఆ రోజు తను నిప్పులు ఎగజిమ్మే చూపులతో చూస్తూ వెంట పదుల సంఖ్యలో తోటి విద్యార్థులతో పిడుగులవంటి అడుగు లతో.. నిష్క్రమించడం.. ఒక అద్భుత దృశ్యం.

ఆ క్షణం తనప్రక్కకు మొత్తం విద్యార్థుల్లో ఏకైక విద్యార్థిని ఐన జుబేదా పరుగు పరుగున పరుగెత్తుకు రావడం కనిపించింది తనకు.

నిప్పుకు గాలి తోడైనప్పుడు నిప్పు రగులుకుంటుంది.

2

జుబేదా అప్పుడు మధ్యధరా సముద్ర తీర ప్రాంతమైన గ్రీస్ దేశంలోని ఒక అంతర్జాతీయ హెూటల్లోని ప్రపంచ కవుల కాంగ్రెస్.. వరల్డ్ కాంగ్రెస్ ఆఫ్ పోయెట్స్ (WCP) భారతదేశ ప్రతినిధిగా తన కవితను చదువుతూ సభికులను ఉర్రూతలూగిస్తోంది. ఆ కవిత శీర్షిక 'ఈ ప్రపంచం నిన్ను మోసగిస్తోంది.. మేల్కోండి ఇకనైనా'. ఆమె ఈ తరాన్ని పెద్ద పెద్ద దేశాలు, స్వచ్ఛంద సంస్థల పేరుతో బడా బడా వ్యవస్థలు, బిజినెస్ హౌజ్లు ప్రపంచదేశాల యువతకు ప్రధానంగా అనేకానేక చౌకబారు సుఖాలను అత్యంత సన్నిహిత చేరువలోకి చేర్చుతూ.. పబ్స్, క్లబ్స్, డ్రగ్స్, ఎంప్లాయ్మెంట్, ట్రాఫికింగ్, టెర్రరిస్టిక్ ఏజన్సీస్, మెడికల్ చీటింగ్, మీడియా డామినెన్స్ వంటి పలు బలహీనతల్ని వెదజల్లుతూ వాళ్ళను బానిసల్ని చేస్తూ.. యువతలో విచ్చలవిడి

**ఒక ఆల్ట్రా మాడర్న్ మాయతో వృద్ధిచెందిన దేశాలు ప్రపంచాన్నే శాసిస్తున్న 'ఫార్మా మాఫియా' గురించీ.. 'ఆయుధ మాఫియా' గురించీ, బడుగు దేశాలను ఆదుకుంటున్న నెపంతో జరుపుతున్న దాతృ కార్యక్రమాల మాఫియా గురించి పాండోరా బాక్సును తెరిచి చూపెడ్తోంది.**

తనాన్ని పెచ్చరిల్లగొడ్తూ.. మనుషులు వాళ్ళ చోట్లోనే ఉంటారు.. కాని వాళ్ళపై కంట్రోల్స్ మాత్రం తమ చెప్పుచేతల్లో ఉంచుకుంటూ.. ఇన్విసిబుల్ గవర్నెన్స్.. చివరికి నువ్వు నువ్వు కావు. నీపై నీకు నియంత్రణ లేదు.. ఎంకెవరో నిన్నూ నీ ప్రవర్తననూ అనుశాసిస్తూంటారు.. వంటి అత్యాధునిక కృత్రిమ రుగ్మతల ప్రకోపాల గురించీ, వర్చువల్ కంట్రోల్స్ గురించీ వినిపిస్తోంది.

ఆమె.. అగ్రదేశాలన్నీ అమాయక దేశాల మధ్య చిచ్చుపెడ్తూ, శత్రుభావాల్నీ రెచ్చగొడ్తూ యుద్ధాల్ని సృష్టిస్తూ .. యుద్ధాల్ని ఇంకా ఇంకా కొనసాగిస్తూ.. తమ తమ ఆయుధాల్నీ, ఆయుధ సామగ్రిని.. విమానాలను, యుద్ధ ట్యాంకర్లనూ, బాంబర్ ప్లేన్స్ను, జలాంత ర్గాములనూ కోట్ల కోట్ల డాలర్లకు అమ్ముకుంటూ.,

ఉక్రెయిన్ గురించీ.. 500 రోజులకు పైగా రష్యాతో కష్టమై కొనసాగుతున్న మానవ హననం గురించీ, విధ్వంసం గురించీ.. పుతిన్ వంటి క్రూర పిశాచి గురించీ.. చెబుతోంది.

ఒక ఆల్ట్రా మాడర్న్ మాయతో వృద్ధిచెందిన దేశాలు ప్రపంచాన్నే శాసిస్తున్న 'ఫార్మా మాఫియా' గురించీ.. 'ఆయుధ మాఫియా' గురించీ, బడుగు దేశాలను ఆదుకుంటున్న నెపంతో జరుపుతున్న దాతృ కార్యక్రమాల మాఫియా గురించి పాండోరా బాక్సును తెరిచి చూపెడ్తోంది.

జుబేదా తన భర్త, ప్రసిద్ధ కవి మౌళి నుండి పొందిన మానవీయ తత్వ తాత్విక మౌళికత గురించిన లోతైన అవగాహనను వృద్ధి చేసుకుని.. ఒక రకంగా చెప్పాలంటే వాస్తవాన్నీ, సత్యాన్నీ ప్రబోధిస్తూ అగ్ని చికిత్సతో శుద్ధి చేయబడ్తున్న కొత్త తరాన్ని తయారు చేసే సంస్కరణ వ్యవస్థలో మునిగిపోయి ఒక మిషన్ను నిర్వహిస్తోంది.

ఈ రకమైన ముసుగు చాటున విశ్వవ్యాప్తంగా జరుగుతున్న మోసాల గురించిన నిజరూప రహస్యాలను బట్టబయలు చేయడానికి.. ముంచుకు రాబోతున్న పెనుప్రమాదాన్ని ఒక తుఫాన్, హర్రికేన్ వచ్చేకంటే ముందు ప్రపంచానికి ఒక హెచ్చరికను అందిస్తున్న 'విజిల్ బ్లోయర్' పాత్రను నిర్వహిస్తోంది జుబేదా.. హద్దులను చెరిపేసుకుంటూ విస్తరిస్తూ.. వ్యాపిస్తూ.. కృత్రిమ మేధ విస్ఫోటనంతో.. రెవర్సిబిలిటీ.. ఇర్రెవర్సిబిలిటీ.. రెమిషన్ వంటి.. భౌతిక వ్యవస్థలను శాసించ బోతున్న అతి ప్రమాదకర టెలిమర్స్ నియంత్రణతో.. మనిషి మృత్యువును జయిస్తాడనీ, హెూమియోస్టాసిస్ నియంత్రణలతో రిజువనేషన్.. పునర్యవ్వన ప్రాప్తితో.. అంతా ఒక మాయామేయ జగత్తును మనముందు ప్రతిష్టిస్తూ.. గుప్పిట్లో గోల్మాల్ గోవిందాకు తలుపులు తెరుస్తూ., వర్చువల్ ఇనుప తెరలను బద్దలుకొట్టే ఒక వైతాళిక తరాన్ని తయారు చేసే క్రమంలో నిమగ్నమై ఉంది జుబేదా.

మనుషులు రెండు రకాలు. ఒకరు తమకోసం మాత్రమే తాము జీవించే వాళ్ళు. తమకోసం కాకుండా ఇతర మానవులకోసమే జీవితాన్ని త్యాగిస్తున్న వాళ్ళు రెండవ రకం. ఈ రెండూ కాని పరమచెత్త మనుష్యులు అధికాధిక స్థాయిలో పెరిగిపోతున్న వర్తమాన నిరర్థక మానవజాతి నిర్మూలన కోసం జుబేదా లాంటివాళ్ళు శ్రమిస్తూంటారు నైతికతను తమ బాధ్యతగా నిర్వహిస్తూ.

వ్యాసం

# పరిశోధనా పరుసవేది...

పరిశోధనలోని లోతులు చూస్తున్న వ్యాసం...



డా॥ వెల్దండి శ్రీధర్
98669 77741

'వరివస్య' అనే పదానికి 'అర్చన', 'పూజ', 'ఉపచారము' అనే అర్థాలున్నాయి. ఆచార్య వెలుదండ నిత్యానందరావు సమగ్రసాహిత్య పరంపరలోని మూడవ సంపుటి 'వాగ్దేవి వరివస్య'. ఇందులో రెండు విభాగాలున్నాయి. 1. భాషా వరివస్య. ఇందులో 27 వ్యాసాలున్నాయి. 2. సాహిత్య వరివస్య. ఇందులో కూడా 27 వ్యాసాలున్నాయి. మొత్తం 54 వ్యాసాల బృహత్తర వ్యాస సంపుటి ఇది. పూవు నుంచి పూవు పుట్టినట్టు వారి తండ్రిగారి వారసత్వాన్ని అందిపుచ్చుకొని, గురువుల శిక్షణలో మరింత సానలుదేరి నిత్యానందరావు విద్యార్థి దశ నుండే రచనా వ్యాసంగంలోకి వచ్చారు. దానికి నిదర్శనం ఇందులో దాదాపు సగం వ్యాసాలు వారు విద్యార్థిగా ఉన్నప్పుడు రాసినవే. మిగిలినవి అధ్యాపకత్వం చేపట్టిన తరువాత రాసినవి.

భాషావరివస్యలోని వ్యాసాలు చదివితే తెలుగువారి భాషా విశాలత్వం బోధపడుతుంది. ఈ వ్యాసాలను పరిశోధనా దృష్టితో చదివితే ఎన్నో పరిశోధనాంశాలు దొరుకుతాయి. ఒక భాషా విద్యార్థికి చిన్ననాటి నుండే ఉండాల్సిన పరిశోధనా దృష్టిని ప్రకటించే వ్యాసాలివి.

ఆంగ్లేయులు భారతదేశాన్ని మరికొంత కాలం ఎదురులేకుండా పరిపాలించాలంటే వారికి ఇక్కడి స్థానిక భాషలను నేర్చుకోవాల్సిన తప్పనిసరి పరిస్థితి ఏర్పడింది. అందువల్ల ఎంతో మంది ఆంగ్లేయ అధికారులు భారతదేశానికి వచ్చి స్థానిక భాషలను నేర్చుకున్నారు. తద్వారా ఎన్నో ఆదాన ప్రదానాలు జరిగాయి. వలసినంత క్రైస్తవ మత ప్రచారమూ జరిగింది. ఎన్నో భారతీయ భాషల అమూల్య గ్రంథాలు ఆంగ్లంలోకి అనువాదం చేయబడ్డాయి. ఎన్నో ఆంగ్ల గ్రంథాలు పలు భారతీయ భాషల్లోకి వెళ్లాయి. అట్లా బైబిల్ కూడా




తెలుగులోకి అనువాదం అయింది. (అనువాదకులకు జన వ్యవహారం తెలియక పోవడం వల్ల, కేవలం నిఘంటువులను చూసి చేసిన అనువాదం వల్ల 'నేను ఉత్తముండను, నువ్వు పాతకుండవు' అనే ధోరణిలో తెలుగు అనువాదం జరిగిందనే విమర్శ లేకపోలేదు) అయితే సి. పి. బ్రౌన్, కాల్డ్వెల్, క్యాంబెల్ వంటి పాశ్చాత్యులు తెలుగు భాషకు చేసిన సేవను మరిచిపోలేం. ఈ విషయాన్నింటినీ గుదిగుచ్చి చెప్పిన వ్యాసం 'భారతీయ భాషలకు పాశ్చాత్యుల సేవ'.

తెలుగు భాషది విశాలమైన గుండె. అందుకే వెయ్యేళ్ళు దాటినా కాలగర్భంలో కలిసిపోలేదు. దానికి ప్రధాన కారణం ఎప్పటికప్పుడు అన్యదేశ్యాలను తనలో కలుపుకోవడమే. నిజానికి "సజీవ భాష స్రోతస్వినిలాంటిది. దేశకాల పాత్రతల నెంచి కొత్త పదాలను తనలో ఇముడ్చుకుంటుంది. అన్యదేశ్యాలను ఆదరంగా స్వీకరిస్తుంది. పాతబడ్డ మాటలను విడిచిపెడ్తుంది. అవసరాన్ని బట్టి ఒదిగిపోతుంది. ఒక భాష సజీవత్వానికి లక్షణం ఇదే. ఏ భాషనూ గిరిగీసి హద్దుల్లో బంధించలేం. ఆంగ్ల భాష అంతర్జాతీయ భాషగా గణుతికెక్కిందంటే అది విస్తృత పదజాలాన్ని సమకూర్చు కోగలగడమే అని చెప్పవచ్చు.

అన్యదేశ్యాలను గ్రహించడం వల్ల భాషకు జీవం, జవం వస్తుంది. అన్యదేశ్యాల గ్రహణంలో తెలుగు అగ్రగామిగా నిలిచింది. ఆంగ్లం నుంచి మనం తీసుకున్నది ఎక్కువే అయినా ఇచ్చినవి కొన్నయినా లేకపోలేదు. ఆంగ్లేయులకు ముంగీస, పందికొక్కు తెలియవు. మాంగూస్, బాండీకూట్ అని ఆంగ్లీకరించు కున్నారు.'' అని 'జనవ్యవహార భాష' అనే వ్యాసంలో తెలుగు భాష యొక్క విశాలత్వాన్ని తడిమి చూపారు. అలాగే ఇదే వ్యాసంలో మితిమీరిన మాండలికం కూడా రచయితలు వాడడం సరైంది కాదని చెప్పడం ఆలోచనాత్మకం.

నేటి విమర్శకులు సాహిత్య విమర్శను పట్టించుకున్నంతగా భాషా విమర్శను పట్టించుకోవడం లేదనేది తెలుగు సాహిత్యంలో పెద్ద ఫిర్యాదు. అంతేకాదు భాషయొక్క నిర్దుష్ట స్వరూపాలను చెప్పే భాషావేత్తలు కూడా కరువయ్యారు. 'పరిణామ క్రమంలో భాషా పరిశోధన' అనే వ్యాసం ఈ విషయాన్నే చాలా లోతుగా చర్చించింది. సిద్ధాంత గ్రంథాలలోనే భాషా దోషాలు అలవోకగా దొర్లిపోతుంటే ఇంక చెప్పేదేమున్నది. 'కాలోహ్ని దురతిక్రమః' అనే అనుకోవడం మినహా అని రచయిత చాలా ఆవేదన చెందుతాడు ఈ వ్యాసంలో. తెలుగు భాష భవిష్యత్తు పట్ల ఒక భయాన్ని నెలకొల్పి మనల్ని కుదిపేసే వ్యాసం ఇది.

మృతప్రాయంగా ఉన్న ఎన్నో కావ్యాలకు జీవం పోసిన బ్రౌన్ కృషి గురించి, బ్రౌన్ కాలేజీ కృషి గురించి విడమరిచి చెప్పిన వ్యాసం 'ఆంధ్ర సాహిత్యోద్ధరణంలో బ్రౌన్ కాలేజీ'. పుస్తకం ఇలా ఉంటే రీడర్ ఫ్రెండ్లీగా ఉంటుందని పుస్తక 'రూపకల్పన'కు ఒక స్థిర రూపం ఇచ్చిన వారు సి. పి. బ్రౌన్. సాధుపాఠ నిర్ణయంలో, పాఠాంతరాల ఉటంకింపులో, వ్రాయసగాండ్ర నిర్లక్ష్యాల పైన బ్రౌన్ పరిశీలన వంటి ఎన్నో విషయాలను తెలియజేసిన విశిష్ట వ్యాసం ఇది. "బ్రాహ్మణ పండితులు సరియైన అర్థం నిర్ణయం చేయకపోతే ఆయా వృత్తులకు సంబంధించిన 'శూద్రులు' చెప్పారని బ్రౌన్ ప్రత్యేకించి చెప్పడం గమనించదగినది. సరియైన అర్థం ఎక్కడ లభిస్తే అక్కడకు వెళ్ళాలన్నది బ్రౌన్ అభిమతం.'' బ్రౌన్ కృషి గురించి చేసిన ఈ వ్యాఖ్య ఎంతో విలువైనది. సమకాలీన బ్రాహ్మణ పండితులు వేమనను కవిగా గుర్తించలేదు. అయినా కూడా వేమన పద్యాల పరిష్కరణలో సహాయం చేసిన వారు బ్రాహ్మణులేనని గుర్తుంచుకోవాలని నిత్యానందరావు చెప్పడం గమనార్హం.

వేమన కవిని ప్రపంచవ్యాప్తం చేసిన సి.పి.బ్రౌన్ అనువాద విధానం గురించి, లోపాల గురించి చర్చించిన 'బ్రౌన్ వేమన పద్యాల అనువాదం - పరిశీలన' వ్యాసం ఎంతో లోతైన పరిశీలనతో సాగింది. 'భాషా సేవ: సెంటిమెంట్లు' అనే వ్యాసం ఔత్సాహిక పరిశోధకులు చదివి ఆలోచించవలసిన వ్యాసం. తెలుగు పోతుందా?, వర్ణద్వేషం, మాండలికం ప్రామాణికత, మాండలికాల సర్వేక్షణ, నిఘంటు నిర్మాణం, పదకోశాల నిర్మాణం, మరో కొత్త భాషా కుటుంబం, వర్ణనాత్మక వ్యాకరణ రచన మొదలైన విషయాల మీద ఎన్నో ఆలోచనాత్మక ప్రతిపాదనలు ఉన్నాయి. 'కవిత్వానువాదం ఒక కళ' అనే వ్యాసం కూడా ఇలాంటిదే.

"పాత రక్తకణాలు పోయి కొత్త రక్త కణాలు శరీరంలో చోటుచేసుకొన్నట్లే పాతపదాలు, పాత వాక్య విన్యాసాలు, రచనా రీతులు పోయి కొత్త పదాలు, కొత్త వాక్య విన్యాసాలు, కొత్త రచనా రీతులు భాషలో చోటుచేసుకుంటాయి.'' అని ప్రతిపాదించే విలువైన వ్యాసం 'ప్రత్యామ్నాయ పదకల్పనం: సాధక బాధకాలు' అనే వ్యాసం. సమాజంలోకి కొత్త వస్తువులు, భావనలు చొచ్చుకు వచ్చినపుడు కొత్త పదాల సృష్టి ఎలా చేయాలో, ఎంత బాధ్యతతో చేయాలో వివరించే వ్యాసం. ఈ క్రమంలో పండితులు, పత్రికలు ఎన్ని కొత్త పదాలను సృష్టించి ప్రజల మీద రుద్దినా ప్రజలు వేటిని తీసుకోవాలో వాటినే తీసుకుంటారు. అవే చలామణిలోకి

**మృతప్రాయంగా ఉన్న ఎన్నో కావ్యాలకు జీవం పోసిన బ్రౌన్ కృషి గురించి, బ్రౌన్ కాలేజీ కృషి గురించి విడమరిచి చెప్పిన వ్యాసం 'ఆంధ్ర సాహిత్యోద్ధరణంలో బ్రౌన్ కాలేజీ'. పుస్తకం ఇలా ఉంటే రీడర్ ఫ్రెండ్లీగా ఉంటుందని పుస్తక 'రూపకల్పన'కు ఒక స్థిర రూపం ఇచ్చిన వారు సి. పి. బ్రౌన్. సాధుపాఠ నిర్ణయంలో, పాఠాంతరాల ఉటంకింపులో, వ్రాయసగాండ్ర నిర్లక్ష్యాల పైన బ్రౌన్ పరిశీలన వంటి ఎన్నో విషయాలను తెలియజేసిన విశిష్ట వ్యాసం ఇది.**

వస్తాయంటారు రచయిత. తెలుగు సమాస నిర్మాణానికి దీర్ఘత పనికి రాదని, మూడు నాలుగు అక్షరాల పదాలైతే తొందరగా ప్రజలు వాళ్ల నాలుకల మీదికి ఎక్కించుకుంటారనే సోయి పదసృష్టి కర్తలకు ఉండాలని చెప్తారు. కొన్నిసార్లు అన్యభాషా పదాలను అలాగే స్వీకరించాలని వాటికి తెలుగు పదాలను సృష్టించాలని పండితులు తలలు బద్దలు కొట్టుకోవద్దని సూచిస్తారు. పదసృష్టి ఎప్పుడైనా వాస్తవిక దృక్పథంతో సాగాలని అంటారు. "భాషాభివృద్ధికీ, పదాల జీవనానికీ ఏకైక మార్గం వినియోగించడమే. వినియోగించని తెలివి తేటలు, శక్తిసామర్థ్యాలు, డబ్బు వృథా అయినట్లే వినియోగించని పదజాలం, భాష అంతర్ధానం కాకతప్పదు'' అనే విషయాన్ని గ్రహించాలని సూచిస్తారు.

ఆంగ్లంలోకి అనువాదమైన తెలుగు కవిత విహంగ వీక్షణం 'ఆంగ్లంలో ఆంధ్ర కవిత' వ్యాసం. ఇందులో కావలి రామస్వామి దగ్గరి నుంచి నేటి కె. దామోదర్‌రావు దాకా తెలుగు సాహిత్యాన్ని ఆంగ్లం చేసిన అనువాదకుల గురించి ఎంతో సమాచారం ఇచ్చారు.

'తెలంగాణ సాహిత్యం భాషా వైవిధ్యం' వ్యాసం కూడా అనేక సూత్రీకరణలు,

ప్రతిపాదనలతో సాగిన విలువైన వ్యాసం. "ఆంధ్ర తెలంగాణలు కలిస్తే ఏదో మహత్తరంగా వెలిగిపోతుందన్న భావవాదంతో, సదాశయంతో కలిపారు. అభివృద్ధిలో విస్తారమైన తారతమ్యమున్న రెండు భిన్న ప్రాంతాల కలయిక వల్ల మానసిక, భౌతికమైన ఆధిపత్య ధోరణికి ద్వారాలు తీసినట్లయింది. అది భాష మీద ప్రభావం చూపించింది. తెలంగాణ ఒక ప్రత్యేక రాజ్యం కావడం వల్ల దానితో పరిచయం లేకపోవడం వల్ల దాని గురించిన అవగాహన లేమితో అసలు ఇక్కడ భాషే లేదు. మాదే మంచి తెలుగు అన్న ఒక తప్పుడు భావం ప్రబలి పోయింది. ఇందులో సగభాగం అహంభావం, పావుభాగం అజ్ఞానం, మరో పావుభాగం అమాయకత్వం గూడుకట్టు కున్నాయి." అంటూ తెలంగాణ తెలుగు ఎందుకు వివక్షకు గురైందో లోతుగా చర్చిస్తూనే గురజాడ అప్పారావు కన్యాశు ల్కంలో వాడిన భాషను, రావిశాస్త్రి 'సొమ్ములుపోనాయండి' అంటే తెలంగాణ ప్రజలు తలకెత్తుకున్నారు. కాని తెలంగాణ తెలుగును మాత్రం ఆంధ్రులు ఈసడించుకున్నారని తెలంగాణ తెలుగులోని సొగసును, నుడికారాన్ని ఆయా రచయితల రచనల నుండి ఉదాహరణలతో నిరూపించడం కొత్త తోవ. అలాగని "మాండలికాలు ఎప్పుడు కూడా పరిమిత ప్రయోజనాలు సాధించేవే. వాటిని ఎంత మేరకు ఉపయోగించు కోవాలో అంత మేరకు వినియోగించు కోవాలి. సంశయించకూడదు. వాటి పట్ల వ్యతిరేకత ఉండకూడదు. అట్లాగే అతి వ్యామోహం కూడ తగదు" అనడం రచయిత భాషా వాస్తవిక దృష్టిని పట్టి చూపుతుంది.

సాహిత్య వరివస్యలోని అన్ని వ్యాసాలు ఎంచుకున్న అంశాన్ని చాల లోతుగా చర్చించిన వ్యాసాలు. 'అభ్యుదయ కవిత్వ ప్రభంజనం' అనే వ్యాసం కొత్తగా సాగకున్నా "అభ్యుదయ కవిత్వానికి పూర్వమున్నదంతా ఆనంద కవిత్వమ యితే, తదనంతర కవిత్వమంతా చైతన్య కవిత్వం" అని వేయేండ్ల సాహిత్య నడవడికను ఒక వాక్యంలో కుదించి చెప్పటం వ్యాసకర్త అవగాహన స్థాయిని చూపుతుంది. 'ప్రజల మనిషి వట్టికోట ఆళ్వారుస్వామి' వ్యాసం కంఠీరవానికి, రచయితకు అభేదం చెప్తూ వట్టికోటను ప్రజల మనిషిగా నిరూపించే ప్రయత్నం చేశారు. ఏ రచయితైనా మొదట్లో ఆత్మకథాత్మకమైన నవలనే రాస్తాడు అనే దానికి ప్రజల మనిషి నవల ఒక ఉదాహరణ అని చెప్పడానికి ప్రయత్నించారు.

'విశ్వనాథ - తెలుగు సినిమా' అనే వ్యాసం పఠితలకు ఆశ్చర్యానందాలను కల్గించే వ్యాసం. పరిశోధకులకు అనుసరణీయ వ్యాసం కూడా. ఒక విషయాన్ని తీసుకొని ఎన్ని కోణాల్లో చెప్పవచ్చో రచయిత చెప్పి చూపించారు. సినిమా గురించిన ఎంతో సమాచారంతో పాటు విశ్వనాథకు సినిమా రంగంతో ఉన్న కొద్దిపాటి అనుబంధాన్ని చాలా నేర్పుతో చెప్పడం కనిపిస్తుంది వ్యాసంలో.

'చరిత్ర - చారిత్రక నవల' అనే వ్యాసంలో ఇంకా చారిత్రక నవలలు ఏయే అంశాల మీద రాయవచ్చో సూచిస్తూనే చారిత్రక నవలలకు సాంఘిక నవలలకు మధ్య పరిమితులను చర్చించారు. అలాగే 'తెలుగులో చారిత్రక కథలు' అనే అంశంపైన పరిశోధన చేయవచ్చునని మరో సూచన. వ్యాసాన్ని రాచమల్లు రామచంద్రారెడ్డి మాటలతో ముగించడం పాఠకులను ఆలోచనల్లో పడేస్తుంది.

'కంప్యూటరీకరణ నేటి ఆవశ్యకత' అనే వ్యాసం కూడా చాలా ఆలోచించదగినది. ఇప్పుడు ఎవరూ ఫిజికల్‌గా పుస్తకాలను ఇంట్లో పెట్టుకోవడానికి ఇష్టపడడం లేదు. సాధ్యమైనంత వరకు డిజిటలైజ్ చేసిన పుస్తకాల సాఫ్ట్ కాపీలనే కంప్యూటర్‌లోనో హార్డ్‌డిస్క్‌ల్లోనో భద్రపర్చుకుంటున్నారు. అయితే ఏయే పుస్తకాలను డిజిటలైజ్ చేయాలి. అందులోని సాధక బాధకాలేవి అని చర్చించిన వ్యాసం. "ఏ సాంకేతిక ప్రగతిలేని కాలంలో వచ్చిన 'వావిళ్ళ' వారి కావ్యాలలో ఒక్క అచ్చుతప్పు కనిపించదు. ఎంతో వృద్ధి చెందామనుకుంటున్న నేటి కాలంలో అచ్చుతప్పులేని పుస్తకం కనిపించదు" అనే వ్యాఖ్య నేటి మన పుస్తక నిర్మాణ 'పనితనాన్ని' ఎత్తిచూపుతుంది.

'యాత్రచరిత్రలు ప్రయోజనాత్మకత' అనే వ్యాసం యాత్రా చరిత్రల్లోని సాధకబాధకాలను వివరించిన ఏనుగుల వీరస్వామయ్య (కాశీయాత్ర చరిత్ర), చెళ్లపిళ్ళ వేంకటశాస్త్రి (కాశీయాత్రా నుభవాలు), కోలా శేషాచల కవి (నీలగిరి యాత్ర), నాయని కృష్ణకుమారి (కాశ్మీర దీపకళిక), పాతూరి వేంకటశివరామశర్మ, మల్లంపల్లి సోమశేఖర శర్మ, పి వి.మనోహరరావు (బ్రహ్మమానస సరోవరయాత్ర), రాహుల్ సాంకృత్యాయన్ (ఓల్గా సే గంగా) అనుభవాలను, ఆనాటి విశేషాలను వారు పొందుపరిచిన తీరును వివరించారు. "తెలుగుదేశంలో జమీందారుల కొలువుల్లో భోగపు స్త్రీలు సంగీతం వాయించేటపుడు తప్ప మిగిలిన సమయాల్లో కూర్చోవడం నిషిద్ధం. శిక్షార్హం." అని కాశీయాత్ర చరిత్రలోని ఒక విశేషాన్ని ఎత్తి చూపారు. ఇదెంతో ఆశ్చర్యాన్ని ఆనాటి జమీందారుల అతి క్రూరత్వాన్ని తెలియజేస్తుంది. అంతేకాదు అమ్మాయిలను అమ్మే సంతలు, రైల్లో తిరగడానికి 'బైరాగి టికెట్'లు మరింత ఆశ్చర్యపరిచే అంశాలు.

ఎన్నిసార్లు విన్నా పాతబడని, తనివి తీరని కథ ఏదైనా ఉన్నదీ అంటే అది రామకథే. వివిధ దేశాల్లో రామకథ ఎలా ఉందో స్థూలంగా పరిచయం చేసిన వ్యాసం 'విదేశాల్లో రామకథ'. మనిషి జీవితం నదుల చుట్టే పెనవేసుకొని ఉంటుంది. వాటిలో కృష్ణా నది మరింత ప్రియమైనది. తెలుగు కవుల హృదయంలో కృష్ణానది పరవళ్ళు తొక్కిన తీరును వర్ణించిన వ్యాసం 'కృష్ణా కవిత్వ తరంగ శీకరాలు'.

"తెలుగునేల పొలాలకు జలములొసగి
తెలుగు వారల మతులకు తేజమిచ్చి
తెలుగు దేశమ్ము కీర్తికి వెలుగు

కూర్పు
కృష్ణవేణీ నదీ! నమస్కృతులు
గొనుము"

అంటూ దివాకర్ల వేంకటావధాని పద్యాన్ని గుర్తు తెచ్చుకోవడం బావుంది.

సామెతల్లో దాగివున్న వైద్యవిజ్ఞానాన్ని లోతుగా పరిచయం చేసిన వ్యాసం 'సామెతలు - వైద్యవిజ్ఞానం'. "అనంతమైన జానపద విజ్ఞాన వారాశిలో సామెతల స్థానం అద్వితీయం. అనన్య సామాన్యం. 'పరంపరాగతమైన అనుభవాలను కాచి వడబోసి తీసిన మేలిమి సారం సామెత'. సామెత పొట్ట విప్పి చూస్తే సందేశముం టుంది. మార్గదర్శనముంటుంది. మనస్తత్వముంటుంది. సరసముంటుంది. విరసముంటుంది. విజ్ఞానముంటుంది. లౌకికముంటుంది. పారలౌకికముం టుంది. అది ఉంటుంది. ఇది ఉండదు అని కాదు అన్నీ ఉంటాయి." ఈ వాగ్దేవీ వరివస్య గ్రంథంలో ఈ వ్యాసమొక్కటి తళతళ మెరిసిపోతుంది. ఎన్నో సామెతల్లో అంతర్లీనంగా ఉన్న వైద్య విషయాలను చర్చించిన వ్యాసమిది.

'పాటలతో పరిమళంతో ద్విపద' అనే వ్యాసం కూడా రచయిత పరిశోధనా లోతులను పట్టిచూపేదే. "నాట్యకారిణి ఒక్కతే. కాని ఆమె హస్తచాలన విన్యాసానికి, వివిధ భంగిమలకు నాట్యశాస్త్రంలో వివిధ నామాలు పెట్టినట్లుగా, ఒక సూర్యుండు సమస్త జీవులకు తానొక్కక్కడై తోచు అన్నట్లుగా ఒకే ద్విపద కొదికొద్ది మార్పులతో రకరకాల పేర్లు ధరించిందని చెప్పడానికి సాహసించవచ్చు." అని ప్రాచీన, ఆధునిక కవులు ద్విపదను, మంజరీ ద్విపదను ఎలా వాడుకున్నారో నిరూపించారు. చాలా జానపద పాటల్లో, పిల్లల గేయాల్లో, వచన కవిత్వంలో కూడా ద్విపద ఎలా ఒదిగిపోయిందో తెలుసుకొని ఆశ్చర్య పోతాం. మనిషి ప్రతి మాటలో ఏదో లయాత్మకత ఉన్నదని అర్థమవుతుంది.

**ఒక సూర్యుండు సమస్త జీవులకు తానొక్కక్కడై తోచు అన్నట్లుగా ఒకే ద్విపద కొదికొద్ది మార్పులతో రకరకాల పేర్లు ధరించిందని చెప్పడానికి సాహసించవచ్చు." అని ప్రాచీన, ఆధునిక కవులు ద్విపదను, మంజరీ ద్విపదను ఎలా వాడుకున్నారో నిరూపించారు. చాలా జానపద పాటల్లో, పిల్లల గేయాల్లో, వచన కవిత్వంలో కూడా ద్విపద ఎలా ఒదిగిపోయిందో తెలుసుకొని ఆశ్చర్య పోతాం. మనిషి ప్రతి మాటలో ఏదో లయాత్మకత ఉన్నదని అర్థమవుతుంది.**

ఈ గ్రంథంలోకెల్లా అతి పెద్ద వ్యాసం 'వ్యాసవిలాసం' (24 పేజీలు). ఇందులో వ్యాస పరిణామ క్రమాన్ని ఎనిమిది విభాగాలలో వింగడించుకొని విస్తృతమైన సమాచారంతో చర్చించారు. "రూపం పరిమితమైతే వ్యాసం, దీర్ఘమైతే పుస్తకం, వాచకమైతే ఉపన్యాసం" అని ఇచ్చిన నిర్వచనం ఆలోచనాత్మకం. 'సాహిత్య విమర్శ - వచనరీతులు' శీర్షిక కింద చర్చించిన విషయాలు ఇప్పటి విమర్శకులందరికీ ఆదర్శప్రాయం. తెలుగులో ప్రముఖుల విమర్శనా రీతులను సోదాహరణంగా చూపించారు. పైగా పదకొండు రకాల వ్యాస రచనా శైలులను కూడా తేల్చి చెప్పారు. "వీలయినంత సూటిగా నిష్కర్షగా హేతునిరూపణ పద్ధతిలో, కార్యకారణ సమన్వయంతో, అనుభూతులు ఆవేశాలు రెచ్చగొట్టకుండా, అవగాహన స్థాయిని పెంచేందుకు అనువైన శైలిలో విమర్శనాత్మక వ్యాసాలు, గ్రంథాలు రాయడం మంచిది" అని విలువైన సూచన చేశారు.

తెలుగులో దేశభక్తి కవిత్వం, తెలంగాణ కథా క్రమం, సంస్కృతి ద్వారా సమైక్యసాధన, శ్రీశ్రీ పరిశోధనా పటిమ, తెలుగులో ఆకర గ్రంథాల తీరుతెన్నులు, తెలుగు భాషా సాహిత్యం గమ్యం, గమనం, నిజాం పాలననాటి తెలుగు పరిస్థితి, జాతీయోద్యమ సాహిత్యం, వ్యాఖ్యానాల్లో చేసే అర్థనిర్ణయం వాటి సాధకబాధకాలు, తెలంగాణలో విజ్ఞాన సర్వస్వాలు, సూచీ గ్రంథాలు, నిఘంటువులు తదితర విషయాల మీద సాధికారికమైన వ్యాసాలు పాఠకులను కొత్త దారుల్లో పయనింప జేస్తాయి. ఆలోచనా సముద్రంలో ముంచెత్తుతాయి.

కొందరి వ్యాసాలు ముళ్లకంపలాగా లోపలికి చొరబడనీయవు. మరికొందరి వ్యాసాలు నవ్వుతూ, హాస్య చమత్కృతులతో, వ్యంగ్యంతో పాఠకులను వేలుపట్టి ఆవలి తీరానికి తీసుకువెళ్తాయి. అలాంటి వ్యాస శిల్పం ఈ వాగ్దేవి వరివస్యలో పుష్కలంగా కనిపిస్తుంది. వెలుదండ నిత్యానందరావు వ్యాస నిర్మాణంలో ఒక బిగువైన శైలి, శిల్పం ఉన్నాయని ఈ వ్యాసాలు చాటిచెప్తాయి. ఇందులోని చాలా వ్యాసాల్లో వస్తువు ఒకింత కాఠిన్యమైనది. అయినా చదువరి ఏ మాత్రం అలసి పోకుండా వ్యాసాన్ని పూర్తిచేస్తాడు. అలాంటి జాగ్రత్త తీసుకోవడంలో రచయిత నేర్పరితనం అవగాహన అవుతుంది. ప్రతి వ్యాసం నిత్యానందరావు పరిశోధన దృష్టికి నిలువెత్తు నిదర్శనం. సారాంశంలో వాచకాన్ని కాని, పద్యాన్ని కాని విమర్శనా దృష్టితో ఎలా చదవాలో తెలిసొస్తుంది.

ఈ బృహత్ గ్రంథంలో నిత్యానందరావు చేసిన దశాబ్దాల నిరంతరాన్వేషణ, ఎన్నో కొత్త విషయాల సమన్వయం, విస్తారమైన సమాచారం అందులోని నిజాయితీ, పరిశోధకులు ఎదుర్కోవాల్సిన సవాళ్లు ఎన్నో తొంగిచూస్తాయి. ముఖ్యంగా తెలుగు భాషను ఎలా బతికించుకోవాలి? కాలానుగుణంగా తెలుగు భాష ఎలా మారాలి? పరిశోధన ఎంతటి లోచూపుతో సాగాలి? విషయ సేకరణ ఎంత లోతుగా చేయాలి? తదితర ఎన్నో మౌలిక ప్రశ్నలకు ఈ గ్రంథం సమాధానంగా నిలుస్తోంది.

# సమగ్రమైన వెలగందుల చరిత్ర

వెలగందుల చారిత్రక పరిణామం...



కూర చిదంబరం
86393 38675

మానవ వికాసానికి, నాగరికత పరిఢవిల్లటానికి ఏరు ప్రాణం వంటిది. ప్రపంచవ్యాప్తంగా, నదీతీరాల వద్దనే తన ఉనికిని స్థిరపరుచుకున్నాడు. నైలూనది నాగరికత, సింధూలోయ, వోల్గా నది పరివాహక ప్రదేశం ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చును.

వెయ్యేళ్ళ వెలగందుల చరిత్రను మనతో పంచుకోదలిచిన ఈ గ్రంథ రచయిత తుమ్మూరి రాంమోహన్‌రావు కూడా మానేరు ప్రస్తావనతో నాంది పలకటం సముచితంగా ఉంది. 'వృత్తి పరంగా కెమిస్టు. ప్రవృత్తిపరంగా ఆల్కెమిస్టు' అని కొనియాడబడిన రావుగారు రచన, నటన, వ్యాఖ్యానం, గానం, చిత్రలేఖనంలలో నిష్ణాతులు. వీటన్నింటిని మించి గొప్ప చరిత్రశోధకులు. తన జన్మస్థలమైన ఎలగందుల (ఉమ్మడి కరీంనగర్ జిల్లా) పుట్టుపూర్వోత్తరాలను, ఎన్నో శిలాశాసనాలు, దస్త్రాలు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి 'మానేరు ముచ్చట్లు'గా తీర్చిదిద్ది మనకందిస్తున్నారు. అవరమున్నచోట్ల కరీంనగర్ జిల్లా ప్రముఖ చరిత్ర పరిశోధకులు శ్రీ జైశెట్టి రమణయ్య, శ్రీ పి.వి. శాస్త్రి గారల పరిశోధనలను తన అభిప్రాయాలకు బలం చేకూర్చేందుకు ఉపయోగించుకున్నారు.

వీటన్నింటి ఆధారంతో ఎలగందుల




(వెలగందుల) గ్రామం 10వ శతాబ్దంలో రూపొందినదిగా నిర్ణయిస్తున్నారు. అంటే ఇరవయ్యవ శతాబ్ది పూర్తివరకు వెయ్యేళ్ళు! కాకతీయుల ఏలుబడిలో గిరి దుర్గంగా రూపుదిద్దుకున్న ఎలగందుల, వారి పతనానంతరం (క్రీ.శ. 1323) మహమ్మదీయ రాజుల ఏలుబడిలోకి వచ్చినది. బహుమని సుల్తానులు, నిజాము రాజుల ఏలుబడిలో ఈ గిరిదుర్గము (ఖిల్లా) క్రమక్రమంగా విస్తరించి, ఒకనాడు ఎలగందుల జిల్లా కేంద్రం. ఆనాడు, నేటి కరీంనగర్ (జిల్లాకేంద్రం) ఒక చిన్న గ్రామంగా ఉండేదంటారు. ఎలగందుల ఖిలాదార్ కరీమోద్దీన్ 1904లో తన పేరున 'కరీంనగర్'ను రూపొందించాడని తెలుస్తున్నది. (పేజి. 37) ఒకనాటి బళ్ళు ఓడలవటం, ఓడలు బళ్ళవటం అంటే ఇదేననిపించుతుంది.

వెలగందుల చరిత్రను వివరిస్తూ రచయిత ఎన్నో ఆసక్తికరమైన వివరాలను ఈ గ్రంథం ద్వారా వివరిస్తున్నారు.

**మచ్చుకు కొన్ని...**

తెలుగులో మొట్టమొదటి కందపద్యం కురిక్యాలలో ఉన్న జినవల్లభుడి బొమ్మల గుట్ట శాసనం. ఈ ప్రాంతానికే చెందిన మల్లియ రేచన 'కవిజనాశ్రయం' తొలి తెలుగు గ్రంథం. సుమతి శతకం వ్రాసినది బద్దెన/ బద్దెనుడు ఈ ప్రాంతము వాడే (పే. 35). క్రీ.శ. 1323లో ఓరుగల్లు కోటను మహమద్ బిన్ తుగ్లక్ స్వాధీనపరచుకోవటంతో దక్షిణభారతదేశమున ముస్లింల పాలన ప్రారంభం అయింది. (పే. 51). వెలగందుల గ్రామానికి తొలికవి కందనామాత్యుడు. 'నీతితారావళి' అను 27 పద్యాల మాలికా కావ్యం వ్రాసాడు (పే. 56). పోతన భాగవతాన్ని కొంతవరకు పూరించిన నారయ వెలిగందులవాడే (పే. 62). ఎలగందులకు ఆ పేరు ఎలా వచ్చిందో ఆసక్తికరంగా వివరించారు రచయిత (పే. 109). ఒకసారి కొందరు వర్తకులు బండ్లపై

పుస్తక పరిచయం

ముత్యాలు తీసుకువెళ్తుంటే, సరిగ్గా నేడు ఎలగందుల వెలిసిన చోట ఒక సాధువు 'బండ్లల్లో ఏమి తీసుకువెళ్తున్నారు?' అని అడిగాడట. సాధువును మారువేశంలో ఉన్న దొంగగా భావించి 'వెల్ల (తెల్ల) కందులు' అన్నారట. కొంతసేపటికి ఎందుకో అనుమానం వచ్చి చూసిన వర్తకులకు బండ్లల్లో ముత్యాలకు బదులు తెల్ల కందులు కనిపించాయి. తిరిగి సాధువు దగ్గరకు వచ్చి వేడుకోగానే ముత్యాలుగా మారాయట! అందుకే ఈ ఊరికి వెల్లకందుల, వెలిగందుల, ఎల్గందులగా నామాంతరం చెందినదట! (పే. 109). దగ్గరలోని కరీంనగర్‌కు జిల్లా ఖ్యాతి దక్కటంతో ఎల్గందుల ప్రాభవం 1905 నుండి తగ్గటం ప్రారంభించింది. 1985లో లోయర్ మానేర్ డ్యాం వల్ల ఊళ్ళోకి నీళ్ళు రావటం వల్ల గ్రామానికి దక్షిణం వేపు ఉన్న ప్రాంతం అంతా పాడుబడటం ప్రారంభం అయింది.(పే. 177). మానేరు నదికి ఆ పేరు బహుశా ఏదైనా మాను ప్రక్కనుండి పారగా వచ్చినది కావచ్చును (పే. 205). బౌద్ధ వాఙ్మయంలో పేర్కొనబడిన అస్సక, ఆశ్మక, పోతలి, పోదనయే నేటి బోధన్ (పే. 29). చరిత్రను వివరించటం అందరూ చేయగలరు. కాని ఆసక్తికరంగా చెప్పటంలోనే రచయిత ప్రత్యేకత గోచరమవుతుంది. తన తాత కాలం నుండి ఎలగందుల గ్రామ/ పట్టణ విశేషాలు నాటి పంటపొలాలు, గ్రామంలోని వివిధ వృత్తులవారు, వారి పరస్పరాధీనత, స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దుకోవటం, నాటి విద్యావ్యవస్థ, పరిపాలన, గ్రామ జీవనం, నాటి కళలు, చిడతల రామాయణం లాంటి వినోద కార్య కలాపాలు కన్నులకు కట్టినట్లు రచయిత వివరించారు. నేటి స్వార్థపరుల, లాభాపేక్షుల వల్ల ప్రభుత్వ నిరపేక్ష వల్ల మాయమౌతున్న ఎలగందుల గుట్టల గురించి, పర్యావరణ ప్రేమికుల గుండెలు బేజారయ్యేట్లు వ్రాసిన వివరణ బాగుంది. కరీంనగర్ నుండి జగిత్యాల మార్గంలో ఉన్న నేటి కొత్తపల్లి గ్రామపు పాతపేరు 'దిందొంట' (పే. 45) అని అచ్చటి శిథిలమవుతోన్న త్రికూటాలయ ప్రసక్తి రచయిత సమగ్ర పరిశీలనకు గొప్ప ఉదాహరణ.

ఈ సమగ్ర గ్రంథంలో చెప్పుకోదగిన మరో ప్రత్యేకత ఛాయాచిత్రాలు. తన వాదనకు పటిష్టత చేకూర్చటానికి పేర్కొన్న పలు ప్రాంతాల, వ్యక్తుల ఫోటోలు ఇవ్వటం ఈ చరిత్ర గ్రంథానికి సమగ్రత ఇచ్చినట్లయింది. అయిదు తరాల గమనికతో వెలయించిన ఈ గ్రంథానికి ఎన్నోచోట్ల ప్రథమపురుషలో తాను కన్నవి, విన్నవి అనుభూతించినవి వివరించటంతో పాఠకుడు అతి సహజంగా, తెలియకుండానే రచయిత వెంట తీసుకెళ్ళి చూపించిన అనుభూతిని కలుగజేశారు.

చరిత్ర 'టెక్స్ట్' పుస్తకాల్లో కానవచ్చే నిస్తేజత, విసుపు కానరాకుండా రచయిత వివరించిన తీరు, తీసుకున్న జాగ్రత్త ప్రత్యేకంగా ప్రశంసించతగినది. చరిత్ర సంస్కృతులపై అవగాహన పెంచే ఇటువంటి గ్రంథరచనలను ప్రోత్సహిస్తోన్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలం వారికి అభినందనలు. తెలంగాణ చరిత్రలో ఇలాంటి గ్రంథాల ఆవశ్యకత ఎంతగానో ఉంది.

కవిత

# గజల్



**వకుళ వాసు, 99891 98334**

చెప్పకుండ చక్కనినగ తెచ్చినావ ఒక్కసారి
చీరకొని ఆత్రతతో వచ్చినావ ఒక్కసారి

బతుకంతా నీకేనని అర్పించిన ఆలిమనసు
ఎరిగిచేరి సంతసంగ గడిపినావ ఒక్కసారి

ఏమున్నా లేకున్నా నడిపించే సంసారం
సతినిచూసి గర్వంగా పొగిడినావ ఒక్కసారి

తనకోసమె సమయాన్ని వెచ్చించగ సాయంత్రం
వ్యాహ్యాళికి తీసుకెళ్ళి తిరిగినావ ఒక్కసారి

పండగకో పబ్బానికొ కట్టుకుంటె కొత్తచీర
ఎంతందం నీదంటూ పలికినావ ఒక్కసారి

నీవింట్లో ఏలోటూ లేకుండగ చూసుకున్న
పుట్టింటికి సంబరంగ పంపినావ ఒక్కసారి

వెన్నెలంత ఒంపుకోని కలంలోన కుమ్మరించె
వకుళపూల కవనాలను మెచ్చినావ ఒక్కసారి

కథ

# సైనికుని భార్య

ఒక సైనికుని భార్య మనోచిత్రణ...



ఎం.వి. ఉమాదేవి
78423 68534

"ధరణీ!వంటలు ఏమిటీ? సరుకులు బాగా కుదిరాయా తల్లీ? నిన్న గులాబ్ జామ్ బాగుంది.!"

"హా, మామ్మ గారు!"

"ఆ రోటీలు రుమాల్‌లో చుట్టి మూతపెట్టు. తినేవరకు మెత్తగా ఉంటాయి. నువ్విలా గట్టిగా చేస్తే నేను నవలలేనుగా! నా వరకూ నూనె లేకుండా చెయ్యి ఎప్పటి లాగే! కావాలంటే నేను కూరపై నెయ్యి వేసుకొని తింటా! ముప్పొంకాయ భరత్ కిష్టం. తప్పకుండ చెయ్యి. ఆ పాలకూర బాగా ఎదిగి పోతుంది. బుట్ట ఇలా తే. కోసి తెస్తాను.పాలక్ పనీర్ చేయండి.!"

"సరే నండి!"

"అమ్మాయి ధరణి! నీ కొడుకు అల్లరి ఎక్కువగా ఉంది. పక్కింట్లో పాపను చెయ్యి కొరికాడట. కాస్త భయం పెట్టుకో!"

"నేను చెప్తున్నా అత్తయ్యా, రెండు దెబ్బలు కూడా వేసేను. ఇక అలా చేయను అన్నాడు. రేపు సెలవులు తర్వాత ప్లే స్కూల్లో వేద్దాం. అప్పటికి నాలుగేళ్లు వస్తాయి కదా!"

"ఇదుగో వదినా. నేను సాయంత్రం పార్టీ కెళ్లాలి. కాస్త నా డ్రెస్ ఐరన్ చెయ్యి!" అంటున్నాడు విజయ్ హడావిడిగా.

"ఓకే విజయ్. మరీ పొద్దుపోయి రావద్దు. అత్తయ్య మేలుకొని ఉంటారు నీ కోసం!"

అంతలో పెద్దాయన హాల్లోకి వచ్చాడు. టేబుల్ మీద వాజ్ లో పూలు మారుస్తూ ఉన్నాడు. ధరణి ఫ్లాస్క్‌లో కాఫీ ఓ కప్పులో పోసి ఆయనకిచ్చింది. ఉదయం రెండు సార్లు కాఫీ ఆయన అలవాటు.

"నా బుద్ధిజం పుస్తకం ఇక్కడ కనపడలేదు. ఎవరు తీశారో అడిగికనుక్కోమ్మా. నాకు వినపడలేదు వాళ్ళు చెప్పేది. మాట విసురుతూ పోతారు. ఎదురుగా నిలబడి మాట్లాడాలి మనుషులు. ఓల్డ్ జనరేషన్ అని చులకన. నువ్వొక్కదానివే ఈ కొంపలో నాతో సవ్యంగా ఉండేది. అన్నట్టు నా షేర్వాణి పైజమాలు ఉతికి ఆరేసుకుని క్లిప్ పెట్టడం మర్చిపోయా. కాస్త పెట్టు. ఆరాక నా రూమ్లో పెట్టు బంగారూ! మా స్నేహితులు కాశీ నుండి వచ్చి సమారాధనకి పిలిచారు. భోజనాలు అక్కడే. ఆవిడ రాను అన్నది, ఒక్కరైనా వెళ్ళాలి నేను వెళ్తున్నా. సాయంత్రం వస్తాను.!"

"అలాగే తాతగారూ. వెళ్లి వచ్చి విశేషాలు చెప్పండి.!"

"వదినా, నా చున్నీ బోసిగా ఉన్నట్టుంది, కాస్త మధ్యాహ్నం తీరికతో ఓ పాతిక అద్దాలు కుట్టిస్తావా. డిఫరెంట్ కలర్‌దారం వాడు!"

"చూస్తాను దివ్యా! మీ అన్నయ్యకి బ్యాగ్ సర్దాలి. వంట ఆలస్యం అవుతుంది. పాలక్ పనీర్, పూరీలు, కేసరి హల్వా, పులిహోర కూడా చేయాలి. కాస్త సాయం చెయ్యి! మీ అమ్మ గారు పూజలో ఉన్నారు.!"

"సరే వదినా!మీరు పిండి తడిపి ఉంచు కోవాలి. నేను పూరీలు వత్తుతా! మామ్మకి నూనెలేని రోటీలు!"

★ ★ ★

"ధరణీ, ఇలారా!"

"ఏమిటీ, పిలిచారా?"

"హుమ్మ్. ఇవాళ నేను వెళ్ళాలి కదా. లోపల ఎక్కడనో ఉంటావేం? కాస్త నా సంగతి చూసుకోవాలి కదా? మళ్ళీ ఎప్పుడో మనం సంతోషంగా ఉండేది!"

"ఇంట్లో వాళ్ళు పనులు చెప్పారండీ! పట్టించుకోకుంటే ఎలా? మీరు వెళ్ళాక ఏమైనా అంటారేమో!?"

"అవున్లే. నేను వెళ్లిపోయాక వాళ్ళేగా నీకు తోడుగా...!"

యథాలాపంగా అన్న మాట బాణంములికిలా తగిలింది ధరణికి. కుండ భళ్ళుమన్నట్టు కన్నీళ్ల ప్రవాహం! గభాల్నా లేచి పెరట్లోకెళ్ళి ముఖం కడుక్కుని, తాతగారి బట్టలకి క్లిప్‌లు పెట్టి వచ్చింది.

విజయ్ షేర్వాణి ఇస్త్రీ చేసి అతని రూములో హ్యాంగర్ కి తగిలించి, అస్తవ్యస్తంగా ఉన్న పుస్తకాలు, బట్టలు సర్ది

షెల్ఫ్ ల్లో పెట్టి వచ్చింది.

రూములో భరత్ లేడు, బైట మాటలు వినిపించడం తో కిటికీ లోనుండి చూసింది. అతని బాల్య మిత్రులు ఇద్దరు వచ్చి మాట్లాడుతూ ఉన్నారు. బామ్మగారు వెళ్లి యాలకుల చాయ్ పెడుతున్నారు. ఇల్లంతా పరిమళం! ఆవిడకి ఎనభయి పైనే. అయినా చిన్న చిన్న పనులు చేస్తూవుంటారు. చేతులు కాస్త వణుకుతాయి. పెట్టాక ఎవర్నైనా పిలుస్తారు. కప్పుల్లో పోసివ్వాలి గెస్ట్ లకి.

ఏమిటో ఇంట్లో ఎవరికి కూడా తన బాధ పట్టించుకునే అవసరం లేదు. స్వార్థం తో పనులు చెప్తూనే ఉంటారు. అయినా భరత్ ఉన్న రోజులలో ఎక్కువగా బైటకు తీసుకొని వెళ్లి తమకి ఏకాంతం కల్పించి బాగా చూసుకుంటాడు. పేపర్స్ లో ఎప్పుడైనా సైనికుల మృతి అని చూస్తే చాలా భయంగా ఉంటుంది. టీవీ న్యూస్ వస్తున్నపుడు సైనికుల విషయం వస్తే చటుక్కున లేచి వెళ్లిపోతుంది తను. పుల్వామా ఘటన మనసులో ఇంకా పచ్చిగానే ఉంది. ఆ సైనిక్ పేటికలు ప్రభుత్వమర్యాదతో రావడం, కుటుంబం రోదనలూ.. కాళ్ళు గడగడ వణికిపోతూ, తల తిరుగుతూ ఉంటుంది టీవీ చూస్తూ ఉంటే. అసలు తమ పెళ్లికి తన బాబాయిలు ఇష్టంగా లేరు. సైన్యంలో వాడికి ఎందుకు ఇవ్వడం? ఆనక ఏదైనా జరిగితే పిల్ల బ్రతుకు మొత్తం ఏడవాలి అని. కానీ నాన్న గారు ధైర్యంగా ముందుకు వచ్చి చేశారు. నాన్న దేశభక్తుడు అనుకున్నది ధరణి.

అందరి భోజనాలు అయ్యి, ఫంక్షన్ కెళ్ళిన తాత గారు వచ్చాక ,ప్రయాణం సమయం రాగానే భరత్ అందరికి వీడ్కోలు చెప్పి వెళ్లి పోయాడు. తమ గదిలో స్థబ్దుగా ఒక్కతే కూర్చొని ఉన్న కోడలి దగ్గరికి వచ్చింది జానకి. గడ్డం పట్టుకొని వంచిన తల పైకెత్తి చూసింది. కన్నీళ్లు చెక్కిళ్ల మీద కారుతుంటె తుడిచి పక్కన కూర్చుంది.

"అమ్మా! నీ మనసులో ఇవాళ పరిస్థితి, ఆవేదన మా అందరికి స్పష్టంగా తెలుస్తుంది.అబ్బాయి వచ్చి వెళ్లే ప్రతిసారీ నువ్వు పడే నరకయాతన మేం కూడా అనుభవిస్తున్నట్టుగా ఉంది. కానీ మనం బైట పడకూడదు. వాడిని బాధ పెట్టకుండా ధైర్యంగా పంపాలి. అందుకే వాడు రావడం వెళ్లడమూ పెద్ద ముఖ్యమైన విషయం కానట్టుగానూ, ఈ ఇంట్లో నీకున్న ప్రాముఖ్యత గుర్తు చేస్తున్నట్టు గాను, నువ్వు దుఃఖపడకుండా మేం ప్రతి క్షణం తాపత్రయపడుతున్నాం తల్లీ.

నువ్విలా ప్రతిసారి వాడు వెళ్ళేటప్పుడు భయపడితే ఎలా? కొన్ని వేల మంది సైన్యం లో చేరాక పని చేస్తూనే, ప్రమోషన్ లు పొంది, ఉన్నత స్థానంలో రిటైర్ అయి, మళ్ళీ స్వస్థలంలో వేరే ఉద్యోగం చేసి హాయిగా పిల్లల పెళ్లిళ్లు చేసిన వాళ్ళున్నారు తెలుసా? యుద్ధం ఎప్పుడూ రాదు. వచ్చినపుడు వెళ్లి పోరాటం చేయకతప్పదు. అదుగో మీ మామయ్యా అదే చెప్తారు. ఆయన యుద్ధంలో పోయినప్పుడు పిల్లలు చిన్న వాళ్ళు, నా లోకం శూన్యం కాకుండా వాళ్ళ పెంపకంలో ఆయన రూపం చూసుకున్నా. ఇక ఈ ఇంట్లో అలా జరగదు" గంధపు మాలవేసిన పటంలో మామ గారిని చూపుతూ అంటున్నది అత్తగారు.



"ఆయన వృత్తిపరంగా పొందిన సాహసం పిల్లలకి వచ్చింది. అందుకే నేను కాదనలేకపోయా. భరత్ మిలిటరీ ఎంచుకున్నప్పుడు! నీ ఆడపడుచు కూడా ఈ నర్సింగ్ పూర్తి కాగానే మిలిటరీలోకి మాత్రమే వెళ్తాను అంటుంది.మన ముందు పెడసరంగా పెద్ద రౌడీలా ఫోజులిచ్చే విజయ్ కూడ నావీలోకి వెళ్లి పోతాను అన్నాడు. వాడికి ఆ జలాంతర్గాములు అంటే పిచ్చి ఇష్టమమ్మాయి!"

"అదేమో సముద్రం అడుగున ఉంటుంది కదా. ఊపిరి ఎలా ఆడుతుంది అనుకున్న. వాడే అంతా చెప్పాడు. మనము అన్నవరం, సింహాచలం యాత్రలో చూసాం కదా విశాఖ బీచ్ లో జలాంతర్గామి. భలే ధైర్యంగా ఉంటారు దాన్లో చిన్న క్యాబిన్ లోనే! తాతయ్య, మామ్మగారు అభ్యంతరం చెప్పలేదు.

వీరుల కుటుంబంగానే ఉందాం తల్లీ.అలాగని నీ బిడ్డ గురించి మేం ఎవరమూ పెత్తనం చేయము. నీకు, పిల్లవాడికి ఇష్టమైన రంగంలోనే చేర్చుదాం.తల్లి మనసు నాకు తెలుసు కదా!!"అంటున్న అత్తగారి పాదాలకు చటుక్కున వంగి నమస్కారం చేసింది ధరణి.

నాణెం రెండో వైపు తను చూడనే లేదు కదా! తన పరిధిలో మాత్రమే ఆలోచన చేస్తూ ఇన్నాళ్లు అనవసరంగా మథనపడింది. అసలు తనే వీళ్ళకి ధైర్యంగా ఉండాలని చెప్పాలి ఇక. అవును కదా... కాలం ఎంత వేగంగా గడుస్తుంది. ఈ సారి భరత్ వచ్చేటపుడు ప్రమోషన్ రావొచ్చు. ఆ మధ్య క్లిష్టమైన ఆపరేషన్లలో వీళ్ళ పటాలం పాల్గొన్నారు. చాలా ప్రశంసలు వచ్చాయి. భరత్ అంకిత భావంతో డ్యూటీ చేస్తాడు. అదే గుర్తు పెట్టుకోవాలి తను. అత్తయ్య చెప్పినట్టు ఇలాగే రిటైర్ అవుతాడు. అప్పుడు ఎంత ప్రశాంతం గా ఉండొచ్చు అనుకున్నది ధరణి!

# ఆకలి



నక్క హరికృష్ణ, 99488 77662

కడుపునిండా తిన్నాను
ఒంటి నిండు బట్ట కట్టాను
ఇలా కలకాలం ఉంటే ఎంత బాగుండు?!
ఈ కల ఎల్లకాలం వస్తే ఎంత బాగుండు?!

ఎండిన కడుపు లేదు
పీలికల గుడ్డలేదు
గడ్డకట్టుకుపోయిన మౌనమూ లేదు

నిట్టూర్పులను మోస్తూ
కంటి నుండి పారిన కాల్వలలో
జీవితాన్ని ఈదుతూ వస్తున్నానిలా
ఎందుకో, ఆకలికి నేనంటే గిట్టదు
అనునిత్యం నాతో
ఓ అంతర్గత యుద్ధం చేయిస్తూనే ఉంటది
నేనూ మనిషినన్న విషయం మరచి
మానవత్వం లేని ప్రదేశంలో
ఒంటరి ప్రయాణం చేయమంది

ఇంకా ఎన్నాటలాడాలి
ఎన్ని వేషాలేయాలి
భరించలేని రూపాలు చూపి
ప్రపంచానికి నన్ను దూరం చేసింది

నాపై ఆకలిని ఉసిగొల్పిన కాలమంటే నాకు కోపం
ఆ కృత్రిమ కాలాన్ని కల్పించిన
నాయకుడంటే క్రోధం
ఇలాంటి పెద్దలను చేసిన వ్యవస్థలంటే ద్వేషం

అయినా నా కోపమన్నా క్రోధమన్నా ఎవరికి పట్టింపు?
నాకూ ఆకలంటే  ద్వేషం లేదు
నా చివరి ఊపిరికి ఉండేది ఈ ఆకలే కదా
మరణంలో సైతం నన్ను వీడని
నా ఆత్మబంధువు ఆకలే కదా!



కవిత

# ఆకుపచ్చ అలలు



డా॥ టి.రాధాకృష్ణమాచార్యులు, 98493 05871

*(5-6-2023న ప్రపంచ పర్యావరణ దినం సందర్భంగా ఈ కవిత...)*

ఆకులూ కొమ్మలే కాదు
అలలు కూడా
ఆకుపచ్చ దారాలను అల్లుకున్నవిక్కడ

ప్రకృతిసిద్ధంగా పచ్చగా ఉంది
నీటి పుట్ట ఇప్పుడు
ఆక్సిజన్ క్లోరోఫిల్ కలిసిన
గాలిలో నది నడకగా

పర్యావరణ పరిరక్షణకు
తోలింది నన్ను దయతో
కాలుష్యానికి సంకెల వేసేటి గ్రీనరీ
ప్రవహించే నది ఊగింది అందాలతో
ఆకుపచ్చ తుంపరల అలలై

మనిషి పచ్చగుండుడే
ప్రకృతిలో ఆశ
ప్రకృతిని బతికించుడే మనిషి సోయి
మనిషీ ప్రకృతీ
పరస్పర చరాచరులే కాదు
సమాంతర చలనాచలన జీవులు కూడా

మనసు పెడితే మనిషి
పచ్చపచ్చగా ఎదుగు లోకమంతా
పచ్చని వస్త్రధారణలో
నేల పలకరిస్తున్న ప్రకృతి
ఆకాశం విహరిస్తున్న ఆకుపచ్చ నీటి గూడు



# చంద్రశేఖర్ వైద్య... హిందీ తెరపై మన హీరో

తెలంగాణ సినీ కథానాయకుని జీవితం...



హెచ్. రమేష్ బాబు
77807 36386

భారతీయ సినిమా రంగానికి, ముఖ్యంగా హిందీ చిత్ర రంగానికి హైదరాబాదు కు చెందిన ఎందరో తారల ప్రాతినిధ్యం మూకీల కాలం నుండే మనకు కనిపిస్తుంది. 1925లో సరోజినీ దేవి చెల్లెలు మృణాళిని -సునాళినీలతో మొదలుకుని ఎమ్.ఏ. రెహమాన్,ఎండి బేగ్, రామ్ ప్యారి, పైడి జయరాజ్, అజిత్, సరితాదేవి వంటి వారితో బాటు చంద్రశేఖర్ వైద్య హిందీ చిత్ర రంగంలో తనదైన ముద్ర వేశారు.

అవి 1940 నాటికి హైదరాబాదు స్టేట్ విమోచనోద్యమం ఊపందుకుంటున్న రోజులు. ఎవరో నిజాం నవాబు కారుపై బాంబు విసిరారు. అంతే కనిపించిన వారిని కనిపించినట్లే అరెస్టు చేసి జైల్లో పెడుతున్నారు. ముఖ్యంగా యువకులను. ఈ భయంతో నగరంలోని యువకులంతా దిక్కుతోచిన చోట్లకు పోయి తలదాచుకోవడం మొదలు పెట్టారు. ఆ సమయంలో చంద్రశేఖర్ కూడా నిజాం వ్యతిరేక పోరాటంలో పాలుపంచుకున్నాడు. దాంతో పోలీసుల నుండి తప్పించుకోవడానికి 'సినిమాల్లో ట్రై చేస్తే పోలా' అనుకుని మద్రాసు వెళ్లాడు. ఆ తరువాత బెంగుళూరు వెళ్లాడు. ఎక్కడా అవకాశాలు రాలేదు. తిరిగి హైదరాబాదు వచ్చి, బ్రతుకుదెరువు కోసం ఏవేవో పనులు చేశాడు. కానీ సినిమాల్లోకి రావాలనే కోరిక అతన్ని వదలలేదు. హైదరాబాదులో ప్రదర్శితమైన ప్రతి మూకీ సినిమాను, అపుడపుడు డే వస్తున్న టాకీలు ఆయనను సినిమాల వైపు ఇట్టే ఆకర్షించినవి. రూబీ మేయర్ సులోచన, మాస్టర్ నిస్సార్, జుబేదా, పృథ్వీరాజకపూర్ వంటి హేమాహేమీలు నటించిన తొలి దశకం నాటి టాకీలు విడవకుండా చూసేవాడు. వీటి ప్రభావం ఆయనపై బలంగా పడింది. వీటికి తోడు చంద్రశేఖర్‌ను హిందీ సినిమాలలో అదృష్టం పరీక్షించు కొమ్మనే మిత్రుల ప్రోత్సహం. తెలుగు సినిమాలలో ప్రయత్నించాలని ముందుగా మద్రాసు వెళ్లి అక్కడ వేషాల కోసం తిరిగితే ఆయన తెలుగు భాష నచ్చక ఇట్లాంటి భాష తెలుగు సినిమాలకు సరిపోదని అక్కడి దర్శక నిర్మాతలు ఆయనను ముఖం మీదే తిరస్కరించారు. ఇక చంద్రశేఖర్ రెండవ అవకాశంగా బొంబాయి వెళ్లాలని నిర్ణయించుకున్నాడు. 1942లో రైలు ఎక్కి తన పెట్టే బేడాతో బొంబాయి ల దిగాడుకూడా.

**హిందీ సినిమా తొలితరం సూపర్ స్టార్ మాస్టర్ నిసార్. ఆయన హీరోగా ఒక వెలుగు వెలిగిన రోజుల్లో షూటింగ్లో పాల్గొని స్టూడియోలోంచి బయటికి రాగానే ఆయనపై అభిమానులు కరెన్సీ నోట్లు విసిరి తమ అభిమానాన్ని చాటుకునేవారు. అంత గొప్ప హీరో చివరి రోజుల్లో ముంబాయిలోని హాజ్ అలీ దర్గా వద్ద భిక్షాటన చేసి పొట్ట పోసుకున్నాడు.**

★ ★ ★

40 ఏండ్ల తరువాత ఒకరోజు!

హిందీ సినిమా తొలితరం సూపర్ స్టార్ మాస్టర్ నిసార్. ఆయన హీరోగా ఒక వెలుగు వెలిగిన రోజుల్లో షూటింగ్లో పాల్గొని స్టూడియోలోంచి బయటికి రాగానే ఆయనపై అభిమానులు కరెన్సీ నోట్లు విసిరి తమ అభిమానాన్ని చాటుకునేవారు. అంత గొప్ప హీరో చివరి రోజుల్లో ముంబాయిలోని హాజ్ అలీ దర్గా వద్ద భిక్షాటన చేసి పొట్ట పోసుకున్నాడు. ఆఖరికి ఇంట్లో నయాపైసా లేని స్థితిలో కన్నుమూశాడు. చివరి చూపులు చూడటానికి వచ్చిన వాళ్లంతా అంత్య క్రియల కోసం తలా ఇంత చందాలు వేసుకుంటున్నారు. అంతలో అక్కడికి కార్లో వచ్చిన మన చంద్రశేఖర్ తక్షణమే చందాలు వసూలు నిలిపివేసి స్వంత ఖర్చులతో జరగవలసిన వన్నీ జరిపించాడు. అంతగొప్ప ఔదర్యాన్ని

చూపే స్థాయికి ఎదిగిన చంద్రశేఖర్ సినిమా ప్రస్థానం ఎలా సాగిందో చూద్దాం.

1923 జూలై 7న హైదరాబాద్ పాత నగరంలో జన్మించిన చంద్రశేఖర వైద్య తండ్రి వృత్తిరీత్యా డాక్టరు. హైస్కూల్ చదువు పూర్తవుగానే నాటకాలు సినిమాలు ఆయనకు ఇష్టమైన ప్రవృత్తులైనవి. సినిమాల్లో నటించడానికి బొంబాయి వచ్చిన తొలిరోజుల్లో దాదార్లోని ఫుట్‌పాత్ లతపైనే గడిపిన చంద్రశేఖర్ అష్టకష్టాలు పడ్డాడు. అక్కడే తనకు

కొందరు మధ్యప్రదేశ్‌కు చెందిన మిత్రులు పరిచయమైనారు. వారితోబాటే కలిసుండేవాడు. రోడ్డు పక్కనే రాళ్లతో పొయ్యి నేర్పాటు. చేసుకుని వంట చేసుకునేవారు. రోజూ దాదర్‌లోని స్టూడియోల చుట్టూ ఏదైనా వేషం దొరుకుతుందాని తిరిగేవాడు. ఒకరోజు ఓ జూనియర్ ఆర్టిస్ట్ సప్లయర్ వచ్చి హీరోను చేస్తానని చెప్పి తీసుకెళ్లి నటుల బృందంలో కూర్చోబెట్టాడు. అది దిలీప్ కుమార్ మొదటి చిత్రం "జ్వార్ భటా (1944) మొదటి రోజు షూటింగ్ లోనే మనవాడి ఒడ్డూ పొడుగూ చూసి నీవు. ఎక్స్ట్రాలో ఏమిటి, నీ అందానికి డిసెంట్ ఎక్స్ట్రాలో చేరిపోవాలన్నారు. ఆ రోజుల్లో ఎక్స్ట్రాకి రోజుకి రూపాయిన్నర ఇస్తే, డిసెంట్ ఎక్స్ట్రాకి 8, 9 రూపాయలు ఇచ్చేవారు.

1945 నాటికి షాలిమార్ ఫిలిం కంపెనీ(పూనా)లో నెలకి 70 రూపాయల జీతంతో కుదిరిపోయాడు మన చంద్రశేఖర్. అక్కడే భరత్ వ్యాస్, రామానందసాగర్, భరత్ భూషణ్ వంటి వారితో పరిచయమేర్పడింది. ఇక్కడే "రంగీలా రాజస్థాన్" 1949లో

రెండో హీరోగా చేశాడు. హీరో భరత్ భూషణ్, అక్కడే షంషాద్ బేగంతో కలిసి కోరస్ లో గొంతు కలిపాడు మనవాడు. ఇంతలో షాలిమార్ కంపెనీలో నుండి బయటికి రావలసి వచ్చింది. శ్యామ్ వంటి పెద్ద హీరోలు షాలిమార్‌ను వదిలేశారు. మనోడి కథమల్ల మొదటికి వచ్చింది. తిరిగి బొంబాయి వచ్చి దాదర్‌లోని స్టూడియోల చుట్టూ చక్కర్లు కొట్టక తప్పలేదు. ఆయన మిత్రుడు ఎస్.ఏ. ప్రేమ్ తీసుకెళ్లి రాజకమల్ కంపెనీలో నెల జీతానికి కుదిర్చాడు. దాంతో బతుక్కి భరోసా ఏర్పడింది. రాజ్ కమల్ సెలక్షన్లో పాల్గొంటున్నప్పుడు కేశవరావ్ దాతే పక్కనే ఉన్న పంషాద్ బేగం అతన్ని చూసి ఇతను బాగా నటించడమే కాదు... పాడతాడు. కూడా. మనకు పనికి వస్తాడు "సెలక్ట్ కరో" అని రికమండ్ చేసింది..

**శ్యామ్ వంటి పెద్ద హీరోలు షాలిమార్‌ను వదిలేశారు. మనోడి కథమల్ల మొదటికి వచ్చింది. తిరిగి బొంబాయి వచ్చి దాదార్లో స్టూడియోల చుట్టూ చక్కర్లు కొట్టక తప్పలేదు. ఆయన మిత్రుడు ఎస్.ఏ. ప్రేమ్ తీసుకెళ్లి రాజకమల్ కంపెనీలో నెల జీతానికి కుదిర్చాడు. దాంతో బతుక్కి భరోసా ఏర్పడింది. రాజ్ కమల్ సెలక్షన్లో పాల్గొంటున్నప్పుడు కేశవరావ్ దాతే పక్కనే ఉన్న పంషాద్ బేగం అతన్ని చూసి ఇతను బాగా నటించడమే కాదు... పాడతాడు.**




అప్పుడే రాజ్ కమల్‌వారు తీసిన 'అప్నాదేశ్ (1949- తమిళంలో 'నమోనాడ్')లో ఎవరో నటుడు బాగా చేయలేకపోతే. కేశవరావ్ దాతే ఆ వేషానికి మన చంద్రశేఖరును సూచించాడు. మనవాడు సింగిల్ టేక్ లో ఒకే చేసేశాడు. అంతే శాంతారాం తన తర్వాతి చిత్రం "సురంగ్"లో ఇద్దరు హీరోల్లో ఒకడిగా ఎంపిక చేశాడు.చంద్ర శేఖర్ హీరోయిన్ షిలా రమ్మాని. చంద్రశేఖర్ ది గని కార్మికుడి వేషం. అద్భుతంగా పండించాడు. సినిమా బాగా ఆడింది. మనోడికి వేషాలు వరుసకట్టినవి. శాంతా రాంతోనైతే చాలా మంది మిత్రులు, సెన్సార్ బోర్డు మెంబర్లు "సురంగ్"లో చంద్రశేఖర్ పాత్ర పోషణ చూసి "ఈ ఒరిజినల్ గని కార్మికుడిని ఎక్కడ పట్టుకొచ్చారండి" అనడిగేశారు. అదీ మనోడి గొప్పతనం. సినీ పత్రికలన్నీ మన చంద్రశేఖర్ గురించి గొప్పగా రాశాయి. "ఏ స్టార్ ఈజ్ బోర్న్" అని. సురంగ్ (1953) సమయంలోనే "ఫర్మాయిష్" కూడా వచ్చింది. 1954లో విడుదలైన "ఔరత్ తేరి యహీ కహానీ" లో భరత్ భూషణ్ తో బాటు మరో హీరోగా చేశాడు చంద్రశేఖర్. ఈ సినిమాకు బి.కె. సాగర్ వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా కూడా పని చేశాడు.

"బారాదరి (1955)"లో అజిత్ తో పాటు చంద్రశేఖర్ కూడా మరో హీరో .తలత్ మొహమూద్ పాడిన "తస్వీర్, బవాతహరా" పాటను ఇందులోనే మన చంద్రశేఖర్ పై చిత్రీకరించారు. మల్టీ స్టారర్ చిత్రం "బాగి సిపాహి (1958)"లో మధుబాల - రంజన్, ఓంప్రకాష్ లతో చాటు చంద్రశేఖర్ కూడా ముఖ్య భూమికను పోషించాడు. దానికి ముందు తీసిన రూపుకుమార్ "పన్నా"

"బజ్ రంగబలి", "బసంత్ బహార్ (1958)" చిత్రాల్లో రెండో హీరోగా నటించాడు.

'సురంగ్' చంద్రశేఖర్ సినీ జీవితాన్ని మలుపు తిప్పితే "కాలీటోపీ లాల్ రుమాల్ (1959), మైలురాయిగా నిలిచిపోయింది. షకీలా హీరోయిన్. సూపర్ హిట్ చిత్రంగా ఆడింది. "మస్తానా (1954)"లో మోతీలాల్, నిగార్ సుల్తానాతో కలిసి పని చేశాడు. "భలా ఆద్మి (1958)"లో శేఖర్ అనితాగుహ హీరోయిన్గా నటించింది. తరువాత "హమ్ దివానే, నచ్చే కా భోలా బాలా", "మినార్", "బర్సాత్ కి రాత్" ఒకదాని తరువాత ఒకటి చంద్రశేఖర్ని హీరోగా నిలబెట్టాయి.

"తస్వీర్ బనాతాహూ తస్వీర్ నహీ బన్ తీ"

**విభిన్నంగా మెడలు విరుస్తూ డాన్స్ చేసిన షమ్మీ కన్నా ముందుగా "చాచాచా" డాన్స్ లలో బాలీవుడ్లో ట్రెండ్ సెట్ చేసింది మన చంద్రశేఖరే, "చాచాచా" వచ్చిన తరువాతనే షమ్మీ కపూర్" తీస్రీ మంజిల్" (1966) తదితర చిత్రాలు వచ్చిన విషయం ఇక్కడ గమనార్హం. 23 కేంద్రాల్లో విజయవంతంగా శతదినోత్సవం చేసుకున్న చాచాచా చంద్రశేఖర్ను బహుముఖ సినీ టెక్నీషియన్గా నిలబెట్టింది.**




"లాగే టూటేనా అబ్ తో సనమ్".

"నతుమ్ హమే జానో న హమే తుమ్హాజానో "

లాంటి అత్యంత జనాదరణ పొందిన ఈ హిందీ సినిమా గీతాలు తలత్ మొహమూద్, మహ్మద్ రఫీ, హేమంత్ కుమార్ లు పాడగామన హీరో చంద్రశేఖర్ పై చిత్రీకరించారు.

అయితే శాంతారాం వద్ద పని చేస్తున్నప్పుడే ఎడిటింగ్, డైరెక్షన్, స్క్రిప్టు వర్క్ విభాగాల్లో శిక్షణ పొందిన చంద్రశేఖర్ తాను స్వంతంగా సినిమా తీయాలని నిర్ణయించుకున్నాడు. ఆర్. చంద్ర, భరత్ భూషణ్, చంద్రశేఖర్ ముగ్గురూ ప్రాణమిత్రులు, అంతకు ముందే. స్వంత నిర్మాణ సంస్థల నెలకొల్పుకుని స్థిరపడి పోవాలను కున్నారు. అనుకున్నట్లుగానే భరత్ భూషణ్ "దూజ్ కా చాంద్' తీస్తే: ఆర్.చంద్ర "నయా ఉమర్ నయా పసల్ తీశారు. మన చంద్రశేఖర్ రైటర్, డైరెక్షన్, ప్రొడ్యూసర్, హీరోగా తీసిన సినిమా "చా చా చా" (1964), హిందీ చిత్రరంగంలో ఒక సంచలనం. ఒక సాధారణ బాలీవుడ్ హీరో తీసిన మ్యూజికల్ హిట్ నిలిచిపోయింది. ఎక్బాల్ ఖురేషి (ఇతను హైదరాబాదీనే) సంగీతంలో నీరజ్ రాసిన"సుభాన ఆయే - షామూ న ఆయే", "ఓ తుమ్ న థే- ఓ హమ్ న థే" పాటలు మారుమోగి పోయినవి. సినిమా అంతా తయారయ్యాక అప్పటికే రికార్డయిన ముగ్గుల "ఏక్ చమేలీకి మండ్వే తలే" పాటను రాజ్ భోస్లేసలహా మేరకు సలీం అనార్కలి కాస్ట్యూమ్స్ తో షూట్ చేసి జతచేశారు. ఈ పాట ఆ రోజుల్లో హిందీ సినిమాను ఒక ఊపు ఊపింది."చా చా చా". పాట రాసిన హైదరాబాది మగ్దూం అలనాటి గొప్ప ఉర్దూ కవి ఆయన ఈ పాటతో హిందీలో గొప్ప గేయ రచయితగా అవకాశాలు వచ్చిన ప్పటికీ పూర్తిస్థాయి కమ్యూనిస్టు నాయకునిగానే కొనసాగారు.

"చాచాచా". హీరోయిన్ హెలెన్ ధనవంతుల పిల్ల. సెలవుల్లో కాశ్మీర్ వెళ్లిన తను అక్కడ పేదవాడైన హీరో చంద్రశేఖర్ ప్రేమలో పడుతుంది. లో బడ్జెట్ సినిమా నెల రోజుల్లోనే పూర్తి చేశాడు. అది కలర్ చిత్రాల కాలమైనా నలుపు తెలుపుల్లో తీసి సస్సెస్ సాధించడం చంద్రశేఖర్ ప్రతిభకు నిదర్శనం. చాలా మంది యాక్టర్, రైటర్స్, డైరెక్టర్, ప్రొడ్యూసరిగా మొదటి వ్యక్తి మనోజకుమార్ అంటారు. కానీ చంద్రశేఖరే ఆద్యుడు. విభిన్నంగా మెడలు

వ్యాసం

విరుస్తూ డాన్స్ చేసిన షమ్మీ కన్నా ముందుగా "చాచాచా" డాన్స్ లలో బాలీవుడ్లో ట్రెండ్ సెట్ చేసింది మన చంద్రశేఖరే, "చాచాచా" వచ్చిన తరువాతనే షమ్మీ కపూర్" తీస్రీ మంజిల్" (1966) తదితర చిత్రాలు వచ్చిన విషయం ఇక్కడ గమనార్హం. 23 కేంద్రాల్లో విజయవంతంగా శతదినోత్సవం చేసుకున్న చాచాచా చంద్రశేఖర్ను బహుముఖ సినీ టెక్నిషియన్‌గా నిలబెట్టింది. "చాచాచా" విజయోత్సాహంతో తీసిన మరో చిత్రం 'స్ట్రీట్ సింగర్ (1966)". వీధి బాలల జీవితాలను కథాంశంగా తీసుకుని, రూపొందించిన ఈ సినిమా కమర్షియల్ గా ఫెయిలయినా పలు అవార్డులే గాక జాకీర్ హుస్సేన్, ఇందిరాగాంధీ వంటి ఎందరో దేశనాయకుల ప్రశంసలందుకున్నది. ఈ చిత్రం తరువాత నాలుగేళ్లపాటు ఏ చిత్రంలోనూ నటించని చంద్రశేఖర్ తానుఅంతకుముందే నెలకొల్పిన సినీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (సింటా), ఇతర అనుబంధ సంఘాల నిర్వహణలో మునిగిపోయాడు. 1950ల నాటికి తరచూ నిర్మాతలు నటీనటులు, టెక్నీషియన్లు పరస్పరం వివాదాలతో సినిమా షూటింగులు రద్దయ్యేవి. వీటిని దగ్గరగా గమనించిన చంద్రశేఖర్ అటు నిర్మాతలకు, టెక్నీషియన్లకు నష్టం లేని పరిష్కారాలు చూపి ఫిలిం ఫెడరేషన్ భూమికను ఇండస్ట్రీలో కీలకం చేశాడు. దాంతో షూటింగులు ఆగడం, సమ్మెలు, చెల్లింపులు నిలిపివేతలు అనేవే లేకుండా పోయినవి. న్యాయస్థానాలు చూపలేని పరిష్కారాలు చూపడం చంద్రశేఖర్ ప్రత్యేకత. "నూతన్" కేసులో చంద్రశేఖర్ పరిష్కారాన్ని చూసి బొంబాయి హైకోర్టు గొప్పగా ప్రశంసించింది. ఆ తరువాతే మహారాష్ట్ర ప్రభుత్వం చంద్రశేఖర్‌కు స్పెషల్ మెజిస్ట్రేట్ హోదానివ్వగా మూడేళ్ల ఆ పదవిలో కొనసాగి పరిశ్రమ నుండి పలు ఒత్తిడిల కారణంగా స్వచ్ఛందంగా వైదొలిగాడు. కార్మిక నేతగా భారత ప్రతినిధి హోదాలో జెనీవా వంటి విదేశాల్లో పర్యటించాడు. హీరో పాత్రలు విరమించుకున్న తరువాత 1970లో శక్తి సామంత "కటీ పతంగ్"లో కారెక్టర్ యాక్టర్గా తన రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన చంద్రశేఖర్ "హమ్ తుమ్ ఔర్ వో, హల్చల్ (1971), కోషిష్, పరిచయ్ (1972), నఫ్రత్, దర్హా (1973), అపరాధి, దోఫూల్ (1974), సన్యాసి (1975), దఫా 302 (1975), బేకసూర్ (1980), బర్సాత్ కి ఎక్ రాత్ వంటి వందకు పైగా

చిత్రాల్లో నటించాడు. ఎక్కువగా రాజేష్ ఖన్నా చిత్రాలలో ఆయన సహచరుడుగా నటించాడు చంద్రశేఖర్. మరోవైపు కారెక్టర్ రోల్స్ చేస్తూనే రామాయణ, మహాభారత్, పరివర్తన్, కమాండర్ వంటి టీవీ సీరియల్స్ నటించిన చంద్రశేఖర్ చివరి చిత్రం "ఖాప్" (2000) యోధానుయోధులకే అసాధ్యమైన హిందీ



సినీరంగంలో ఏడు దశాబ్దాలు- తనదైన శైలిలో ఉనికిని నిలుపుకుని మచ్చలేని జీవితాన్ని గడిపిన చంద్రశేఖర్ ను బొంబాయిలో సత్కరించని సంస్థలేదు. బాంబే సినీ పరిశ్రమలో ఆయన ఇంటికి రాని చలనచిత్ర ప్రముఖుడు లేదంటే అతిశయం లేదు సులోచన నుండి మొదలుకొని దిలీప్ కుమార్ దేవానంద్ నిరుపరాయ్ కవి ప్రదీప్ పైడి జయరాజ్ వంటి నటులు ఆయన ఇంట జరిగే సంబరాలలో పాల్గొనేవారు. ఆయన ఇంట్లో జరిగిన ముషాయిరాలలో హరివంశరాయ బచ్చన్ పాల్గొనేవారు.

మన చంద్రశేఖర్‌కు ఇది శతజయంతి సంవత్సరం. ఆయన బొంబాయిలో స్థిరపడిన ప్పటికీ హైదరాబాద్‌తో తనకున్న అనుబంధాన్ని వీడలేదు. టంగుటూరి అంజయ్య, కే.కేశవరావు నటుడు, నిర్మాత ,దర్శకుడు అయినటువంటి ప్రభాకర్ రెడ్డి, బి. కిషన్, జె. గీతారెడ్డి వంటి వారితో ఆయన స్నేహం చివరిదాకా కొనసాగింది. బాలీవుడ్ లో లెజెండరీ హీరోలైన దిలీప్ కుమార్ పైడి జయరాజుల తర్వాత అంత దీర్ఘకాలం శనివారంలో పనిచేసిన చంద్రశేఖర్ 2021 జూన్ 16న బొంబాయిలో తన 98వ ఏట కన్ను మూశారు. ఆ మహనీయునికి ఇదే శతజయంతి నివాళి.

(శతజయంతి సందర్భంగా...)

**మన చంద్రశేఖర్‌కు ఇది శతజయంతి సంవత్సరం. ఆయన బొంబాయిలో స్థిరపడిన ప్పటికీ హైదరాబాద్‌తో తనకున్న అనుబంధాన్ని వీడలేదు. టంగుటూరి అంజయ్య, కే.కేశవరావు నటుడు, నిర్మాత, దర్శకుడు అయినటువంటి ప్రభాకర్ రెడ్డి, బి. కిషన్, జె. గీతారెడ్డి వంటి వారితో ఆయన స్నేహం చివరిదాకా కొనసాగింది. 98వ ఏట ఆయన కన్ను మూశారు. ఆ మహనీయునికి ఇదే శతజయంతి నివాళి.**

ముఖాముఖి

# కవి సత్యపథంలో పయనించాలి

- అయాచితం నటేశ్వరశర్మ

**ఈ సంవత్సరం దాశరథి అవార్డు గ్రహీత, అయాచితం నటేశ్వరశర్మతో ఘనపురం దేవేందర్ ముచ్చట, ఈ మాసం ...**

**సార్! నమస్తే! దాశరథి సాహిత్య పురస్కారాన్ని మీకు ప్రదానం చేయడం మాకు చాలా ఆనందాన్ని కలిగించింది. మీ అనుభూతి ఏమిటో చెప్తారా?**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రతి ఏడాది ఇచ్చే దాశరథి సాహిత్య పురస్కారాన్ని 2023 సంవత్సరంలో నాకు ప్రకటించి, ప్రదానం చేయడం నాకు ఎంతో ఆనందాన్ని కలిగించింది. నేను 1969 నుండి కవితారచన చేస్తున్నాను. యాభై ఏండ్లకు పైగాచేస్తున్న కవితా రచన వ్యవసాయం ఫలించి, ఈ పురస్కార రూపంలో నన్ను ఉత్తేజితం చేసింది. తెలంగాణ రాష్ట్రముఖ్యమంత్రి మాన్యశ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర రావు స్వతహాగా సాహితీప్రియులు. పద్యవిద్యారాధకులు. నా పద్యాలంటే వారికి ఎంతో ఇష్టం. అందుకే వివిధ సందర్భాలలో నాతో పద్యాలు రాయించి ప్రోత్సహించారు. వారి నేతృత్వంలో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలలో ప్రారంభవేదిక నా పద్యాలతోనే ప్రారంభం కావడం నాకు లభించిన అదృష్టం. దానికి కారణం చంద్రశేఖరరావుగారే. నాకు ఈ పురస్కారం చాలా ఆలస్యంగా వచ్చిందని నేను భావిస్తున్నాను. ఏదేమైనా, ఆలస్యం అయినా, అమృతఫలం లభించినందుకు సంతోషపడుతున్నా. నాకు ఈ విశిష్ట పురస్కారాన్ని ప్రకటించిన మాన్యశ్రీ చంద్రశేఖరరావుగారికి ధన్యవాదాలను తెలుపుకుంటున్నాను.



**సార్! మీపై, మీ సాహిత్య సృజనపై దాశరథి గారి ప్రభావం ఏమైనా ఉందా?**

నా పద్యసాహిత్యంపై దాశరథి గారి ప్రభావం ఎక్కువగా ఉంది. నేను 1973లో తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య కళాశాల గ్రంథాలయంలో దాశరథి - సినారె కవితా గ్రంథాలను పఠించేవాణ్ణి. హాస్టల్‌లోని రూముకు తెచ్చుకొని తనివితీరా చదివేవాణ్ణి. దాశరథి పద్యం, సినారె గేయం నన్నెంతగానో ఆకర్షించేవి. దాశరథి 'అగ్నిధార'ను వందలసార్లు చదివేవాణ్ణి. సినారె 'కర్పూరవసంత రాయలు' కావ్యాన్ని కూడా అలాగే ఎన్నోసార్లు చదివేవాణ్ణి. రాస్తే దాశరథి వలె పద్యం రాయాలనీ, సినారె వలె గేయం రాయాలని తపించేవాణ్ణి. ఆ తపనే నన్ను పద్యకవిగానే కాక, గేయవచనాది ప్రక్రియలలో కృషి చేసేవానిగా నిలిపింది. 'విక్రాంతి గీతి' అనే పేరుతో ఒక గేయసంపుటిని రాసి, దాశరథిగారికి అభిప్రాయం కోసం పంపాను. వారు నా గేయ రచనాశైలిని మెచ్చుకొంటూ, ఉత్తరం రాశారు. అచ్చు ప్రతులను పంపితే అభిప్రాయం రాస్తామన్నారు. అప్పటికి నాకు ఆర్థిక స్తోమత లేక అచ్చుకోసం ప్రయత్నించలేదు. దాశరథి గారి అభిప్రాయం పొందలేదు. అనుభూతి మాత్రం మిగిలింది. నాకు అదే చాలు అనిపించింది. మహాకవి ఆశీస్సు లభించడం కంటె గొప్ప విషయం ఇంకేముంటుంది?

**తెలంగాణ ఉద్యమంలో మీకు ఎప్పటికీ గుర్తుండి పోయే సాహిత్య సంబంధిత సంఘటన ఏదైనా ఉంటే వివరిస్తారా?**

మలిదశ తెలంగాణ ఉద్యమంలోని సాహిత్యం నాకెంతో స్ఫూర్తిని ఇవ్వడమే గాక, నా మదిలో ప్రగాఢంగా ఉజ్జ్వలమైన అనుభూతి నాటుకొని పోయింది. గూడ అంజయ్య వంటి ఉద్యమకవులు రాసిన 'అయ్యోనివా నీవు అవ్వోనివా?' అనే గీతం తేలు విజయ వంటి ఉద్యమ కళాకారుల గళాలలో ప్రతిధ్వనించినప్పుడు నేనెంతో మురిసిపోయేవాణ్ణి. కామారెడ్డిలోని నిజాంసాగర్ చౌరస్తాలో ఉద్యమ

ముఖాముఖి

కవిత్వాలతో కవులు విజృంభించి గేయాలు, పద్యాలు, పాటలు, పాడిన వేళలన్నీ నన్ను ఎంతో ప్రభావితం చేశాయి. నిత్యం మరపురాని సంఘటనలే కనబడేవి. అంతకుముందు ఎంతో ప్రసన్నంగా కవిత్వం రాసే కవులు కూడా కవి సింహాల వలె విజృంభించి, గర్జించడం ఆశ్చర్యం, ఆనందం కలిగించింది. ఒక్కటేమిటి? అన్నీ గుర్తుంచుకోదగిన ఘట్టాలే అనిపిస్తాయి నాకు!

**సార్! 1969 ఉద్యమం చూశారు. మలిదశ ఉద్యమం చూశారు. ఈ రెండు సందర్భాలలో సాహిత్యం యొక్క పాత్ర ఏమిటంటారు?**

1969లో తొలిదశ ఉద్యమం జరిగినప్పుడు నేను తిరుమలలోని శ్రీవేంకటేశ్వర వేద సంస్కృత పాఠశాలలో ఎంట్రెన్స్ విద్యార్థిగా ఉన్నాను. అప్పుడు కాసు బ్రహ్మానందరెడ్డి గారు ముఖ్యమంత్రి. ఆ దశలో సాహిత్యపరంగా విజృంభణ లేదు. సామాజికంగా మాత్రమే నిరసనలు కొనసాగాయి. 1971లో పి.వి. నరసింహారావు గారు ముఖ్యమంత్రిగా ఉన్న రోజులలో జై ఆంధ్ర ఉద్యమం సాగింది. అప్పుడు సైతం సాహిత్య ప్రక్రియల రూపంలో నిరసనలు కనబడలేదు. ఉన్నా స్వల్పంగానే ఉండేది. నేను రోజు మా పాఠశాల దగ్గర ఉన్న ఒకకూడలిలో పాఠకుల కోసం



హైదరాబాదులోని భక్తిసాధనమ్ సంస్థచే *గజారోహణసత్కారం!*

దినపత్రికలు ఒక వేదికపై కనబడేవి. వాటిని చదివేవాణ్ణి. అవి ఏకపక్షంగా ఉండేవి. పి.వి. నరసింహారావుపై నిరసనల ప్రసంగాలే ఎక్కువగా వార్తలుగా వచ్చేవి. అది నచ్చక, నేను 'ఆంధ్రభూమి' దినపత్రిక కోసం చందాకట్టి, పోస్ట్‌లో తెప్పించుకొని చదివేవాణ్ణి. అయిదారు రోజులు గడిచాక 'ఆంధ్రభూమి' నాకు చేరేది. అయినా యథార్థ వార్తలు నాకు తెలిసేవి. ఆ ఉద్యమ సమయంలో నరసింహారావు గారి ప్రభుత్వం ఒడుదుడుకులతోనే సాగింది. మలిదశ ఉద్యమంలో సాహిత్య విజృంభణ వివిధప్రక్రియలుగా సాగింది. వచనం, గేయం, పద్యం, పాట, రంగస్థల అనే అనేక రూపాలలో మిన్నంటింది. సాహిత్యం ఉద్యమ ప్రభంజనమై వెల్లువెత్తింది. రాష్ట్ర సాధనలో కీలకపాత్ర వహించింది.

**యాభైకి పైగా రచనలు చేశారు. అందులో 'తెలంగాణ సుప్రభాతం' మీరు రాయడానికి మిమ్మల్ని ప్రేరేపించిన విషయం ఏమిటి?**

నేను వచనం, పద్యం, గేయం, శ్లోకం అనే నాలుగు ప్రక్రియలలో రచనలు చేశాను. లలితగీతాలు రాశాను. అవధానాలు చేశాను. నేను 'తెలంగాణ సుప్రభాతం' రాయడానికి ప్రేరణ దాశరథి. ఆయన 'అగ్నిధార' ప్రారంభంలో రాసిన-

*'ఓ జనతా నతాంజలి పుటోజ్జ్వల దివ్య కవోష్ణ రక్త ధా*
*రాజలసిక్త పాద కమలద్వయ శోభిమనోజ్ఞ దేహరే*
*ఖా! జయభారతీ! యుగయుగమ్ముల పున్నెపు పంటవీవునీ,*
*పూజకు తెచ్చినాడనిదె పొంగిన గుండియ నిండు పద్దెముల్'*

అనే పద్యం నా తెలంగాణ సుప్రభాత రచనకు ప్రేరణ. దాశరథి జయభారతి (స్వతంత్ర భారతదేశ మాతృక)ని పద్యప్రసూనాలతో పూజించినట్లు, నేను కూడా 'తెలంగాణ భూమాతృక'ను నా సుప్రభాత శ్లోకపుష్పాలతో పూజించాలని అనుకొన్నాను. 42 శ్లోకాల సుప్రభాతాన్ని రాశాను. ఈ సుప్రభాత శ్లోకాలలోని మకుటం- 'తెలంగాణ భూమాతృకే! సుప్రభాతమ్!' అంటూ సాగిపోతుంది. ఈ నలభై రెండు శ్లోకాలలో తెలంగాణలోని 33 జిల్లాల పరిధిలోగల సాంస్కృతిక, చారిత్ర, శిల్ప, కళావైభవాలను పరిచయం చేశాను. కొందరు తెలంగాణకు సుప్రభాతం ఏమిటి? తెలంగాణ ఏమైనా నిద్రపోతున్నదా? అని ప్రశ్నించారు. తెలంగాణ తల్లిని మేల్కొలిపే నెపంతో తమకు జరుగుతున్న అన్యాయాలు, వివక్షల పట్ల నిరసనగళం ఎత్తక నిద్రపోతున్నవారిని మేల్కొలుపడం అనే లక్ష్యంతో ఈ సుప్రభాతాన్ని రాశాను. ఇంతటి వైభవం గల మాతృభూమిని కాపాడుకోవాలనేదే ఈ సుప్రభాతంలోని ఆంతర్య సందేశం. నా జన్మభూమి అయిన తెలంగాణను మాతృకగా భావించి, స్తుతించడమే నాలో కలిగిన స్ఫూర్తికి లక్ష్యం- ఈ సుప్రభాతంలోని తొలి శ్లోకం ఇది-

*'చతుర్వేదగీతే! పరబ్రహ్మజాతే!*
*మహాభారతోదాహృతే! మంత్రపూతే!*
*పురాణ ప్రసిద్ధే! మహర్షి ప్రబుద్ధే!*
*తెలంగాణ భూమాతృకే! సుప్రభాతమ్!'*

**నిజామాబాద్ - కామారెడ్డి రెండు**

**తెలంగాణలో**
**అనాదిగా పద్యవికాసం కొనసాగుతూనే ఉన్నది. పద్యం చిరంజీవి. అది ఒక కాలానికే పరిమితం కాలేదు. తెలంగాణలో పద్యకవితా వికాసం దినదిన ప్రవర్ధమానం అవుతోందనడానికి వేలాదిగా పద్యకావ్యాలు, పద్యశతకాలు వెల్లువెత్తు తుండడమే మంచి ఉదాహరణ. ముఖ్యమంత్రి గారే పద్యప్రేమికులై నప్పుడు తెలంగాణలో పద్యకవితా వికాసానికి కొదువ ఏముంటుంది.**

**జిల్లాల సాహిత్యరంగంలో మీ ప్రభావం ఎంతో ఉంది. ఇప్పుడు ఉమ్మడి జిల్లాల్లో వస్తున్న సాహిత్యంపై మీ కామెంట్?**

నేను 1977 నుండి ఉమ్మడి నిజామాబాద్ (నిజామాబాద్ - కామారెడ్డి) జిల్లాలోని సాహిత్య సృజనను ప్రత్యక్షంగా దర్శిస్తున్నవాణ్ణి. ఆనాటి రోజులలో కవిత్వ నిబద్ధత గల కవులెందరో ఉండేవారు. కుడ్యపత్రికల రూపంలో చేతిరాతతో కవిత్వాలు కొనసాగేవి. క్రమంగా అచ్చు యంత్రాలు అందుబాటులోకి వచ్చాక కవులు కవితా పుస్తకాలను విరివిగా ముద్రించి, ప్రభంజనం సృష్టించారు. నేడు కంప్యూటర్ల వీర విహారంతో ప్రచురణ సౌలభ్యం పెరిగి విస్తృతంగా రచనలు వెలుగులోకి వస్తున్నాయి. కవి సమ్మేళన వేదికలు అవిరళంగా కృషి చేస్తున్నాయి. ఇప్పుడు కవులలో ఎందరో ప్రతిభావం తులున్నారు. విశిష్ట కవిత్వసృజన చేస్తున్నారు. నేడు రెండు జిల్లాలలో కవితారంగం విశ్వరూపాన్ని ధరించిందని చెప్పాలి. విశిష్ట సాహిత్య సృష్టితో నేడు ఈ రెండు జిల్లాలు పురోగమిస్తున్నాయి.

**పద్య కవిత్వం, వచన కవిత్వం రెండింట్లో మీరు ఇష్టపడేది ఏది? ఆ రెండు కవిత్వాలకు ఉన్న శ్రేష్ఠత మీ మాటలలో వివరిస్తారా?**

రెండూ నాకు ఇష్టమైనవే. అయినా పద్యం అంటే విపరీతమైన ఇష్టం. ఎందుకంటే పద్యం ఛందోమయం కావడమే. ఈ లోకంలో ఛందోరహితమైన



కవిత్వం లేనేలేదని ప్రాచీనుల మాట. ఇది అక్షరసత్యం. వచనంలో ఛందస్సు లేదని కొందరు అపోహపడుతూ, ఉంటారు. బాణుని కాదంబరి, దండి దశకుమార చరిత్ర, చిన్నయసూరి వచన పంచ తంత్రాలు చదివితే వచనంలోనూ ఛందస్సు ఉందని అందరూ అంగీకరిస్తారు. నా దృష్టిలో వచనం, పద్యం రెండూ శ్రేష్ఠమైనవే. తిలక్, శ్రీశ్రీ వచనాలు అంటే నాకు ఎంతో ప్రీతి. పద్యం అంటే ప్రాణం. ఆరాధనాభావం.

**తెలంగాణలో పద్యకవితా వికాసం ఎలా జరుగుతున్నది.**

తెలంగాణలో అనాదిగా పద్యవికాసం కొనసాగుతూనే ఉన్నది. పద్యం చిరంజీవి. అది ఒక కాలానికే పరిమితం కాలేదు. తెలంగాణలో పద్యకవితావికాసం దినదిన ప్రవర్ధమానం అవుతోందనడానికి వేలాదిగా పద్యకావ్యాలు, పద్యశతకాలు వెల్లువెత్తుతుండడమే మంచి ఉదాహరణ. ముఖ్యమంత్రి గారే పద్యప్రేమికులై నప్పుడు తెలంగాణలో పద్యకవితా వికాసానికి కొదువ ఏముంటుంది? నేడు విస్తృతంగా పద్యాలు రాస్తున్న తెలంగాణ కవులు కోకొల్లలు.

**సార్! మీరు అవధానిగా ప్రసిద్ధులు. తెలంగాణలో అవధాన ప్రక్రియ ఇంకా ఉధృతం చేయాలంటే ఏం చేయాలి?**

తెలంగాణలో ప్రాచీనకాలం నుండే ఎందరో అవధానులు విరాజిల్లారు. కాకతీయుల కాలంలో మల్లినాథయ్య అనే అవధాని ఉండేవారని చరిత్ర చెబుతోంది. ఆద్యశతావధాని శ్రీమాన్ శిరిశ నహళ్ కృష్ణమాచార్యుల నుండి నేటిదాకా అవధాన రంగాన్ని వికసింప జేసినవారెందరో ఉన్నారు. అవధాన ప్రక్రియలోకి విద్యార్థులను ప్రవేశం చేయించి, సాధన కోసం శిక్షణ తరగతులను విరివిగా ఏర్పాటు చేయాలి. పాఠశాల స్థాయినుండి విద్యార్థులలో అవధాన నైపుణ్యాన్ని కలిగించడానికి, ప్రభుత్వం, స్వచ్ఛంద సాహిత్య సంస్థలు, ఉదారులైన సాహిత్యసేవాభిలాషులు పూనుకుంటే



కామినేని అనిల్, వరప్రసాదరెడ్డి లచే దోమకొండకోటలో కవిసత్కారం!

ముఖాముఖి

అవధానకళ తెలంగాణలో మూడు పువ్వులు, ఆరు కాయలుగా వికసిస్తుంది.

**మీరు, రంగనాథవాచస్పతి గారు ఇద్దరు జంటకవులు. వారితో మీ అనుబంధాన్ని నాలుగు మాటలలో చెప్పండి?**

అవధానం రంగనాథ వాచస్పతి గారు కళాశాలలో నా సహాధ్యాపకులు. వారిది అవధానవంశం. వారి తండ్రి సుప్రసిద్ధ శతావధాని అవధానం చంద్రశేఖరశర్మ. వాచస్పతి గారికి తండ్రిగారి నుండి అవధాన కళ వారసత్వంగా వచ్చింది. వాచస్పతిగారితో నాకు సాహిత్యపరమైన బంధం, బంధుత్వం, కారణంగా నేను వారితో కలిసి చేసిన అవధానాలు సహృదయుల అభిమానాలకు పాత్రమయ్యాయి. ఎందరినో అలరించాయి.

**మీకు ఏ సాహిత్యసంస్థలతో అనుబంధం ఉంది?**

నేను 1977లో కామారెడ్డిలో ప్రాచ్యకళాశాలలో సంస్కృతాధ్యాపకునిగా ఉద్యోగ ప్రవేశం చేసిన రోజులలో మా కళాశాలలోని కవిపండితులు స్థాపించిన 'హితసాహితి' సంస్థతో అనుబంధం ఏర్పడింది. తొలినాళ్లలో ఆ సంస్థలో సభ్యుడనై సాహిత్యసేవ చేశాను. ప్రధానకార్యదర్శిగా అనేక సంవత్సరాలు సాహిత్య వికాసానికి కృషి చేశాను. ఆ తరువాత జాతీయ సాహిత్య పరిషత్తుతో అనుబంధం ఏర్పడి ఆ సంస్థలోనూ చాలా సంవత్సరాలు ప్రధానకార్యదర్శిగా సేవలు అందించాను. కామారెడ్డిలో ఈ రెండు సంస్థలే ఎక్కువగా కార్యక్రమాలు చేసేవి.




**సార్! మీరు చదువుకొనే సమయంలో మిమ్మల్ని బాగా ప్రభావితం చేసిన కవి లేదా గ్రంథం వివరాలు చెప్తారా?**

నేను చదువుకొనే రోజులలో నా అభిమాన కవులలో మొదటివాడు మహాకవి కాళిదాసు. ఆయన రచనలైన రఘువంశ, కుమారసంభవ, మేఘసందేశాలు, అభిజ్ఞాన శాకుంతలం నన్నెంతో ప్రభావితం చేశాయి. అందువల్లనే నా తొలి గేయకావ్యం 'వసంతకుమారి'ని కాళిదాసు మహాకవికే అంకితం చేశాను. కాళిదాసు తరువాత భోజుడు, భవభూతి, బాణభట్టు, భాసుడు నాకు ఇష్టమైన ప్రాచీన కవులు. ఆధునిక కవులలో దాశరథి, సినారెలు నన్ను అమితంగా ప్రభావితం చేసిన కవులు. దాశరథి 'అగ్నిధార', సినారె 'కర్పూరవసంతరాయలు' నాకు ఇష్టమైన గ్రంథాలు.




**సార్! మీ చేతిరాత అద్భుతంగా ఉంటుంది. మీ చేతిరాతకు సాహిత్య సృజనకు ఏమైనా సంబంధం ఉన్నదా?**

అందమైన చేతిరాత నాకు మా తండ్రి ఇచ్చిన వరం. ఆయన పేరు అనంతరాజ శర్మ. ఆయన చేతిరాతకు ఆనాటి ఉపాధ్యాయవర్గంలో ఎంతో ఆదరణ ఉండేది. అందరూ ఆయన చేతిరాతను ప్రశంసించేవారు. నేనూ మా నాన్నలాగే రాయాలని తపించేవాణ్ణి. నిరంతర స్వీయసాధనతోనే ఈ స్థితిలో రాయగలుగుతున్నాను. నా రాతకు, సాహిత్యానికీ అన్యోన్య సంబంధం ఉంది. నేను రాసే అందమైన అక్షరాలలో ఒదిగిన కవిత్వం కూడా అందమైందే. అందం లేని భావాన్నే, అందంగా లేని రాతనూ నేను ఇష్టపడను. నాకు సంతృప్తిగా అనిపించిన భావాన్నే అందమైన రాతలో ఆవిష్కరిస్తాను. చిత్తుగా రాసి, దానిని సవరించి రాయడం నాకు అలవాటు లేదు. దేనినైనా నేరుగా ఒకేసారి రాసేస్తాను. అందువల్ల నాకు సమయం సద్వినియోగం అవుతోంది.

**కవి సమాజానికి ఆదర్శంగా ఎలా ఉండగలుగుతారు?**

కవి సత్యపథంలో ప్రయాణించాలి. సత్యాన్నే రాయాలి. అభూతకల్పనలు చేయకూడదు. నైతికంగా అద్దంలోని ప్రతిబింబంలా స్వచ్ఛంగా జీవిస్తూ, తాను నమ్మిన సత్యాలను కవిత్వంలో రమణీయంగా వర్ణించి చెప్పాలి. కవివాక్కు సమ్మోహనకరం. దాని ప్రభావంతో కవి సమాజానికి ఆదర్శంగా ఉండగలుగుతాడు.

ఇంటర్వ్యూ...
ఘనపురం దేవేందర్
9948032705



# తొలి తెలుగు కవయిత్రి "కుప్పాంబిక"

తెలుగు కవయిత్రుల విశిష్టత...



డా॥ భీంపల్లి శ్రీకాంత్
90328 44017

ఇతిహాసాలైన రామాయణ, భాగవతాలు తెలంగాణలోనే పురుడు పోసుకున్నవి. తొలి తెలుగు రామాయణం ఉమ్మడి పాలమూరు జిల్లా నుంచి ఆవిర్భవించగా, భాగవతం ఉమ్మడి వరంగల్ నుంచి అవతరించింది. తొలి తెలుగు రామాయణాన్ని గోన బుద్దారెడ్డి 'రంగనాథ రామాయణం' పేరుతో ద్విపదకావ్యంగా రచించగా అతని కుమారులు గోన కాచభూపతి, గోన విఠల భూపతి ఉత్తర రామాయణాన్ని రచించారు. భాగవతాన్ని పోతన రచించాడు.

రంగనాథ రామాయణ కర్తయైన గోన బుద్దారెడ్డి కుమారులు గోన కాచ భూపతి, గోన విఠల భూపతిలిద్దరూ తెలుగులో తొలి జంటకవులు. అంతేకాదు గోన బుద్దారెడ్డి కుమార్తె కూడా కవయిత్రి. ఆమె పేరు కుప్పాంబిక. ఈమె తొలి తెలుగు కవయిత్రి. మాల్యాల గుండ నాథుని భార్య. మాల్యాల గుండనాథుడు మాల్యాల వంశానికి చెందినవాడు. గోన, మాల్యాల వంశాలవాళ్ళు కాకతీయ రాజులకు సామంతులు. కుప్పాంబిక తన భర్త గుండనాథుడు చనిపోయినప్పుడు ఆమె పాలనాపగ్గాలను చేపట్టింది. చేపట్టడమే కాదు తన భర్త సంస్మరణార్థం



కుప్పాంబిక తొలి తెలుగు కవయిత్రి ఊహాచిత్రం -రూప

ఒక శాసనాన్ని వేయించింది. నేటి పాలమూరు జిల్లాలోని ఆమె బూదపూర్ (నేటి భూత్పూర్)లో క్రీ.శ.1276లో శాసనం వేయించింది. "అనుమకొండ పురవరేశ్వర కాకతీయ రుద్రదేవ మహారాజులు ఓరుగంటను పృథ్వీ రాజ్యము సేయుచుండంగాను" అని శాసనం వేయించింది. ఈ శాసనాన్ని బట్టి ఈమె 1230 ప్రాంతంలో పుట్టిందని పరిశోధకుల అభిప్రాయం. తన తండ్రి గోన బుద్దారెడ్డి నుండి సాహిత్యాన్ని వారసత్వంగా పొందింది కుప్పాంబిక.

శ్రీకృష్ణదేవరాయలు ఆస్థానంలో అష్టదిగ్గజకవుల్లో ఒకరైన అయ్యలరాజు రామభద్రుడు సంకలనం చేసిన గ్రంథంలో కుప్పాంబిక పద్యం ఉండడం విశేషం. ఈ పద్యంతోనే కుప్పాంబిక కవయిత్రిగా లోకానికి తెలిసింది. ఈ ఒక్క పద్యమే కుప్పాంబికను తొలి తెలుగు కవయిత్రిగా నిలబెట్టింది. దీంతో కుప్పాంబిక తొలి తెలుగు కవయిత్రిగా అవతరించింది. ఈ ఒక్క పద్యం తప్ప మరో రచన ఏదీ మనకు లభ్యం కాలేదు. పదహారవ శతాబ్దం నాటి మొల్లకు రెండువందల ఏండ్ల ముందే కవిత్వం రాసిన కుప్పాంబికనే తొలి తెలుగు కవయిత్రిగా ప్రసిద్ధ సాహిత్యకారుడు, చరిత్ర పరిశోధకుడు సంగిశెట్టి శ్రీనివాస్ వెలుగులోకి తెచ్చాడు.

"వనజాతాంబకుడేయు
సాయకములన్ వర్ణింపగా రాదు, నా
తన బాల్యాధిక యౌవనంబు మదికిన్
ధైర్యంబు రానీయదు
త్యనురక్తిని మిముబోంట్లకున్
దెలుపనాహా! సిగ్గు మైకోదుపా
వన వంశంబు స్వతంత్రమీయదు
చెలీ! వాంఛల్ తుదల్ముట్టునే"

ఇది కావ్యంలోని నాయిక విరహతాపాన్ని తెలిపే ఒక హృద్యమైన

వ్యాసం

పద్యం. బాల్యదశ నుండి యవ్వనదశకు చేరుతున్న క్రమంలో తనపై మన్మథుడు మోహబాణాలను కురిపిస్తున్నాడని, ఆ కురిపించే మోహపుబాణాలు పెంచే మోహాన్ని కుప్పాంబిక తన ప్రియసఖులతో కూడా చెప్పుకోలేకపోవడంతో సిగ్గుపడు తుంది. తను ఉన్నతవంశంలో జన్మించడం వల్ల తన భావాలను ఎవరికీ పంచుకోలేక పోవడాన్ని ఆమె ఈ పద్యంలో తెలిపింది. ఇంతటి రమ్యమైన పద్యాన్ని ఆ కాలంలోనే అంటే పదమూడవ శతాబ్దికాలంలోనే ఒక మహిళ రచించడం అందులోనూ పైకి చెప్పలేని భావాన్ని చెప్పడం గమనార్హం. తన మానసిక పరిస్థితిని మధురమైన పదాలకూర్పుతో పద్యంగా అల్లడం ఆమె రచనా చాతుర్యానికి నిదర్శనం. ఆ కాలంలోనే ప్రబంధకవిత్వాన్ని చక్కగా ఆవిష్కరించి పద్యసౌరభాన్ని సాహిత్యా భిమానులందరికీ పంచిపెట్టిన సాహితీ మణిపూస కుప్పాంబిక. కుప్పాంబిక తెలంగాణ సాహితీజగత్తులో అవతరించిన సాహితీకుసుమం. తన భర్త గుండనాథుని ఆస్థానంలోని పండితుడైన ఈశ్వరభట్టోపాధ్యాయుడి సూచనలు, సలహాలతో తన రచనకు మెరుగులు దిద్దుకున్న ధీమంతురాలు కుప్పాంబిక.

తెలంగాణ సాహిత్యంలోనే కాదు తెలుగు సాహిత్యంలో తొలి రచన చేసిన కాకతీయుల కాలం నాటి కవయిత్రిగా గుర్తింపు పొందింది కుప్పాంబిక. కాకతీయ రాజులకు సామంతులైన గోన, మల్యాల వంశాలకు చెందిన కుప్పాంబిక అటు పుట్టినింటికీ, ఇటు మెట్టినింటికీ పేరుప్రఖ్యాతులు తెచ్చిపెట్టిన ఉమ్మడి పాలమూరు జిల్లా ఆడబిడ్డ కావడం విశేషం.

**రంగనాథ రామాయణ కర్తయైన గోన బుద్ధారెడ్డి కుమారులు గోన కాచ భూపతి, గోన విఠల భూపతిలిద్దరూ తెలుగులో తొలి జంటకవులు. అంతేకాదు గోన బుద్ధారెడ్డి కుమార్తె కూడా కవయిత్రి. ఆమె పేరు కుప్పాంబిక. ఈమె తొలి తెలుగు కవయిత్రి. మాల్యాల గుండ నాథుని భార్య. మాల్యాల గుండనాథుడు మాల్యాల వంశానికి చెందినవాడు. గోన, మాల్యాల వంశాలవాళ్ళు కాకతీయ రాజులకు సామంతులు.**

---

కవిత

# కవి



డా॥ కొండపల్లి నీహారిణి, 98663 60082

కనిపించని కల్లోలాలను
కనిపెట్టేదే కవి

మాటల కనికట్టు
బట్టబయలు చేయగలిగేదే కవి

తడారని మట్టిని తనది
చేసుకోవడమే కవిపని

గుండె వెనుక గాయాల్ని
విప్పి చెప్పేదే కవి నైజం

కనుల కన్నీటి విలువలు
అనంత విశ్వ జాడలెరుగాలనే జీవి

అమ్మనాన్నల పక్షాన జెండా ఎత్తినా
ఉమ్మనీరు చలువ విలువ చెప్పినా
అన్నార్తుల ఏడుపు చూపినా

అన్యాయాల లోగుట్టు విప్పినా కవి
ఒక నిరంతర ఆలోచనల నిధి
జాజ్వల్యమాన జ్ఞాన చేతనం



వ్యాసం

# మువ్వన్నెల జెండా ఘనకీర్తి

జెండా నిర్మాతకు జేజేలు...



పింగళి భాగ్యలక్ష్మి
97047 25609

మనం ప్రతి స్వాతంత్ర దినోత్సవం రోజున, గణతంత్ర దినోత్సవం రోజున ఎంతో ఘనంగా, ఎంతో గర్వంగా మూడు రంగుల జెండాను ఎగరవేస్తాం. ఇంకా దేశభక్తితో సెల్యూట్ చేస్తాం. ఆ జెండా మనకు ఊపిరి, బలం, గుర్తింపు చిహ్నం ఈ మువ్వన్నెల జండా. ప్రతి భారతీయుడు అత్యంత పవిత్రంగా భావించే ఈ మువ్వన్నెల జండాను పింగళి వెంకయ్య గారు రూపొందించారు. 130 కోట్ల మంది స్ఫూర్తి చిహ్నంగా భావిస్తు ఢిల్లీలోని ఎర్రకోట మొదలు పల్లెలోని పంచాయతీ కార్యాలయాల వరకు ఈ పతాకం రెపరెపలాడుతూనే ఉంటుంది. ఈ జాతీయ జండాని చూడగానే ప్రతి భారతీయుని హృదయం గోదావరి నదిమ తల్లిలా ఉప్పొంగిపొర్లి ప్రవహిస్తుంది. ఇంతటి ఘన కీర్తిని దక్కించుకున్న ఈ మువ్వన్నెల జండాకి ఆధ్యులు, పూజ్యులు పింగళి వెంకయ్య గారు. వీరు కృష్ణాజిల్లా మువ్వ మండలం, బట్ల పెనుమర్రు గ్రామంలో జన్మించారు. బ్రిటిష్ వారు భారతదేశ ప్రభుత్వ కార్యాలయాల్లో వారి జెండాను ఎగురవేయడం దేశభక్తిని స్వాతంత్ర కాంక్షను నింపుకొన్న పింగళి వెంకయ్య గారికి ఏమాత్రం నచ్చేది కాదు. జండాలని చూసినప్పుడల్లా మనం స్వతంత్రంగా ఒక మన దేశానికి ఒక జండాను తయారు చేసుకోవాలని ఒక సరికొత్త ఆలోచన పింగళి వెంకయ్య గారి మనసులో నాటుకుంది. అప్పటినుండి ప్రతి కాంగ్రెస్ సమావేశానికి హాజరై నాయకులందరితో జాతీయ జెండా ప్రతిపాదన గురించి చర్చలు జరిపేవారు. “భారతదేశానికి ఒక జాతీయ జండా” అనే పుస్తకాన్ని ఇంగ్లీషులో రాసి ప్రచురించారు. అప్పట్లోనే ఇది చక్కని ప్రాచుర్యం పొందింది.

పింగళి వెంకయ్యగారు 1906 నుండి 1922 వరకు భారత జాతీయ ఉద్యమం లోని వివిధ ఘట్టాల్లో పాల్గొన్నారు. ప్రతిసారి కూడా గాంధీజీతో జండా గురించి చర్చించేవారు. ఒకసారి నల్గొండ జిల్లా నడిగూడెం పత్తి రైతులకు పత్తి పంటను పరిచయం చేయాలనే ఉద్దేశంతో మునగాల జమీందారు నాయని వెంకట రంగారావు గారు పత్తి వెంకయ్యగా ప్రసిద్ధి చెందిన వెంకయ్య గారిని ఇక్కడికి తీసుకు వచ్చారు. వీరు కొంతకాలం ఈ జమీందారు గారికి సలహాదారులుగా ఉన్నారు. ఆ సమయంలోనే గాంధీజీ పిలుపుని అందుకున్న వెంకయ్య గారు జండా రూపకల్పనకు ఇక్కడే శ్రీకారం చుట్టారు. భారతీయులందరినీ ఒకే జండా క్రింద ఉంచాలని ఆయన దృఢంగా సంకల్పించారు. ఆ సంకల్ప బలంతోనే మొదటగా కాషాయం, ఆకుపచ్చ రంగులు కలిపి మధ్యరాట్నం గల ఒక జండాను చిత్రించారు. ఈ జండాకు వెంకయ్య గారే స్వయంగా రంగులు కూడా అద్దారు. ఈ జండాని 1916లో లక్నోలో జరిగిన భారత జాతీయ సమావేశంలో గాంధీ గారు తొలిసారిగా ఎగురవేశారు. అనంతరం సత్యం, అహింసలకు నిదర్శనమైన తెలుపు రంగును కాషాయం, ఆకుపచ్చ రంగుల మధ్యలో ఉండేలా రూపొందించాలని గాంధీజీ అభిప్రాయపడగా వెంకయ్య గారు ఆ జండాలో అదనంగా తెలుపు రంగును చేర్చి రూపొందించారు. కాషాయం హిందువులకు చిహ్నంగా, ఆకుపచ్చ ముస్లింలకు చిహ్నంగా,

**భారతరాజ్యాంగ సభలో నెహ్రూ జాతీయ జెండా గురించి ఒక తీర్మానం చేస్తూ పతాకంలో రాట్నం బదులుగా అశోక చక్రం ఉండాలని సూచించారు. దీంతో రాట్నానికి బదులుగా ధర్మచక్రం ఏర్పాటు చేశారు ఈ ఒక్క మార్పు తప్ప పింగళి వెంకయ్య గారు రూపొందించిన జెండానే జాతీయ జెండాగా ఉపయోగిస్తున్నాము. అశోకుని ధర్మ చక్రం మన పూర్వ సాంస్కృతికి చిహ్నంగా పేర్కొంటాం.**



భిన్నత్వం ఏకత్వానికి తెలుపు రంగును పేర్కొన్నారు.  మధ్యన ఉన్నరాట్నం చిహ్నం మన జీవనాన్ని, రైతు కార్మికత్వాన్ని స్ఫురింపజేస్తుంది. అంటే కార్మిక కర్షకులపై ఆధారపడిన మన దేశం సత్యం, అహింసల పై ఆధారపడడంతో సుభిక్షంగా ఉంటుందని భావించిన గాంధీజీ ఈ ఆశయమే మన త్రివర్ణ పతాకం.

అయితే 1945 జూలై 22వ తేదీన భారత రాజ్యాంగ సభలో నెహ్రూ జాతీయ జెండా గురించి ఒక తీర్మానం చేస్తూ పతాకంలో రాట్నం బదులుగా అశోక చక్రం ఉండాలని సూచించారు. దీంతో రాట్నానికి బదులుగా ధర్మచక్రం ఏర్పాటు చేశారు ఈ ఒక్క మార్పు తప్ప పింగళి వెంకయ్య గారు రూపొందించిన జెండానే జాతీయ జెండాగా ఉపయోగిస్తున్నాము. అశోకుని ధర్మ చక్రం మన పూర్వ సాంస్కృతికి చిహ్నంగా పేర్కొంటాం. ఈ జెండాని 22 జూలై 1947న రాజ్యాంగం ఆమోదించింది. దీని పొడవు-వెడల్పు 2:3 నిష్పత్తిలో ఉంటుంది. తెలుపు రంగు మధ్యలో నేవీ బ్లూ రంగులో 24 ఆకులు గల అశోక ధర్మచక్రం ఉంటుంది. కాషాయం రంగు పరాక్రమం, ధైర్యం, త్యాగస్ఫూర్తిని సూచిస్తుంది. తెలుపు రంగు శాంతి, స్వచ్ఛత, సత్యం మరియు నిజాయితీని తెలియజేస్తుంది. అలాగే ఆకుపచ్చ రంగు పెరుగుదల, వ్యవసాయం, శ్రేయస్సును సూచిస్తుంది. అశోక చక్రం ధర్మాన్ని సూచిస్తుంది. ఫ్లాగ్ కోడ్ ఆఫ్ ఇండియా అనేది భారతదేశ జాతీయ జెండా యొక్క వినియోగాన్ని నియంత్రించే చట్టం. అశోక చక్ర నమూనాను సారనాద్ లోని అశోక స్తంభం నుంచి తీసుకున్నారు.  ఈ జాతీయ జెండాని ఖాదీ బట్టతో మాత్రమే తయారు చేయాలని జాతీయ పతాక నిబంధనలు తెలియజేస్తున్నాయి.  ఈ జెండాలో ఎటువంటి మతపరమైన ప్రతీకలు లేవు. మన దేశానికి స్వాతంత్రం రావడానికి మూడు రోజుల ముందు ఏర్పాటు అయిన రాజ్యాంగ సభ భారతమాత ముద్దుబిడ్డ రూపొందించిన ఈ పతాకాన్ని అన్ని పార్టీలకు అన్ని మతాలకు ఆమోదయోగ్యమైన పాతాకంగా స్వీకరించడానికి నిర్ణయించారు.  ఒక జాతి స్వాతంత్రం, సౌభాగ్యం, సంపద అంతా ఈ జాతీయ పతాకంలో ప్రతిబింబిస్తుంటాయి. జాతి యావత్తు గర్వపడేలా మువ్వన్నెల జెండాని రూపొందించిన పింగళి వెంకయ్య గారు మన తెలుగు వారు కావడం మనమంతా ఎంతో గర్వించదగ్గ విషయం. మన భారతదేశంలోని ప్రతి ఇంట రెపరెప లాడుతూ భారత మాత ఖ్యాతిని ప్రపంచం మొత్తం వ్యాపింప చేస్తుంది ఈ త్రివర్ణ పతాకం. ఇలా భరతదేశ  కీర్తి కిరీటాల్ని త్రివర్ణ పతాకం ద్వారా వినువీధుల్లో ఎగురవేసిన పింగళి వెంకయ్య గారికి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జేజేలు, వందనాలు.

కవిత

# నేను నిన్ను ప్రేమించడం లేదు!



రఘువర్మ, 92900 93933

నేను నిన్ను ప్రేమించడం లేదు!-లేదు!
నేను నిన్ను ప్రేమించడం లేదు!
అయినా - నీవు నా ఎదుటకు రాని సమయంలో
దుఃఖిస్తుంటాను పైగా,
నీ పైనున్న ప్రకాశ నీలాకాశంలోని
నిశ్శబ్ద నక్షత్రాలు నిన్ను చూసి
సంతోష పడవచ్చునేమోననీ
అసూయ పడుతుంటాను కూడా!

నేను నిన్ను ప్రేమించడం లేదు! అయినా,
అదెందుకో నాకు తెలియదు,
నువ్వేది చేసినా అది నా విషయంలో
ఎంతో బాగా చేసినట్లు కనిపిస్తుంది
నీలాగా ఎక్కువగా నేను ప్రేమించడం లేదనీ
నా ఏకాంతంలో తరచుగా నిట్టూరుస్తుంటాను!

నేను నిన్ను ప్రేమించడం లేదు! అయినా,
నీవు వెళ్ళిపోయినప్పుడు,
నా చెవి చెంత నీవు వదిలి వెళ్ళిన
నీ గళ సంగీత స్వరాన్నీ,
అక్కడక్కడే సంచరిస్తూ తాత్సారం చేస్తూన్న
ఆ స్వర ప్రతిధ్వనినీ
ఏ శబ్దం ఛిన్నాభిన్నం చేస్తుందో
(ఆ శబ్దం చేసినవారు ప్రియంగా మాట్లాడేవారైనా సరే)
ఆ శబ్దాన్ని అసహ్యించుకుంటాను!

నేను నిన్ను ప్రేమించడం లేదు! అయినా,
ప్రగాఢత్వంతో, కాంతిమత్వంతో
భావాలను మిక్కిలి ప్రభావవంతంగా
వ్యక్తంచేసే నీలాల నీ కళ్ళనూ,
ఉదయించే అర్థరాత్రి స్వర్గానికీ నాకూ మధ్య
పదేపదే ఇట్లా కవ్విస్తూ కనబడే కళ్ళను
ఎపుడూ చూచి ఎరుగని నేను
ఎన్నో మాటలను పలికే నీ కళ్ళనూ
గుర్తుచేసుకుంటుంటాను!

నేను నిన్ను ప్రేమించడం లేదనీ నాకు తెలుసు
అయ్యో లోకులు-నా ఉదాత్తమైన, తెరిచిన హృదయాన్ని
అంతగా నమ్మడం లేదు మరి,
వాళ్ళు వదిలిన అపనమ్మకాల వ్యాఖ్యలను
పలుమార్లు నవ్వుతూ స్వీకరిస్తుంటాను నేను!
ఎందుకంటే - నీ వెక్కడున్నావో ననీ
క్షణమైనా కళ్ళార్పకుండా చూస్తూన్న నన్ను
వాళ్ళు నిశితంగా పరిశీలిస్తూ చూస్తుంటారు!



ఆంగ్లమూలం :
**Caroline Elizabeth Sara Morton**
(1808-1877)

తెలుగు స్వేచ్ఛానువాదం : 'రఘువర్మ',

# రఘువీర్ గజల్ సల్లాపం గజల్ జ్యోత్స్న




గజల్ అంటే సల్లాపం లేక ప్రియభాషణం లేక ప్రేమ అనే అర్థాలు చెబుతారు. తెలుగు గజల్లు సినారె వంటి కవుల చేతుల్లో సామాజిక కోణం ఆవిష్కరించాయి. రఘువీర్ గజల్లు పూర్తిగా ప్రణయాభివ్యక్తీకరణకే వాడుకున్నాడు.

అధరానికి తొందరేల దరహాసంకావాలని
హృదయానికి తొందరేల మధుమాసం కావాలని

ఈ ప్రశ్నలోనే మానవ అందునా కవి హృదయ చిత్రీకరణ ఉన్నది.

వికసించే పువ్వులో
చల్లని నీ నవ్వున్నది
వినిపించే సవ్వడిలో
తీయని నీ పిలుపున్నది

ఈ పాదాలలో కేవలం వ్యక్తి భావమే కాదు, ఒక ఆధ్యాత్మి పరితాపం కూడా ఉన్నది. గజల్ ప్రక్రియ పారశీకం, ఉర్దూ సాహిత్యాల నుండి తెలుగుకు వచ్చింది. ఇందులో మత, మక్త, కాఫియా, రదీఫ్ లాంటి పేర్లు కలిగిన పాద భాగాలు ఉంటాయి. గజల్ తెలుగు వచ్చేసరికి కొంత సడలింపు తీసుకుంది. రఘువీర్ ప్రతాప్ గజల్ కూడా ఆధునికీకరణను ఆవహింప చేసుకుంది. ఒక్క ప్రేయసి ప్రియుల భావనలే కాక అనేక సామాజిక అంశాలు కూడా ఇందులో కనిపిస్తాయి.

"జీవితాన మలుపులెన్నో
గుండె కింద దిగులాయే
దేహపు వస్త్రాల మసి
రేవు దులుపుకెళుతుంది

దొంగలంతా దొరలైతే
ప్రజాస్వామ్యం ఎట్లా అయితది వికసించని కుసుమాలకు
విలువ ఎందుకు" అంటారు.

సాహితీ ప్రియులందరూ చదవదగిన పుస్తకం.

ప్రతులకు : ఎన్వీ రఘువీర్ ప్రతాప్
9-6-369, ప్లాట్ నెంబర్ 103,
రోడ్డు నెంబర్ 14, మారుతీ నగర్, చంపాపేట,
హైదరాబాద్ - 500 059
ఫోన్ : 9440720082.

# తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ వేసిన దారులు "తెలంగాణ చరిత్ర"

తెలంగాణ రాష్ట్ర అవతరణ అనంతరం ఇలాంటి పుస్తకాల ఆవశ్యకత చాలా పెరిగింది. ఈ గ్రంథకర్త డా॥ నన్నపురాజు విజయశ్రీ తెలంగాణ చరిత్రను సరళమైన శైలిలో రచించారు. తెలంగాణలో ప్రధానమైన పరిణామాలన్నీ కూలంకషంగా వివరించారు. తెలంగాణ రాజులు, వాళ్ల పాలించిన తీరు, నాటి సామాజిక పరిస్థితుల దగ్గర నుండి, తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర సాధన వరకు జరిగిన పరిణామాలు అన్నిటికీ ఈ పుస్తకం అద్దం పట్టింది. ఉద్యమ సందర్భంలో కేసీఆర్ చేసిన స్ఫూర్తివంతమైన ప్రసంగాలు, సందర్భానుసారంగా పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ అనంతరం జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు వరుసగా పేర్కొన్నారు. ప్రాజెక్టులు, రుణమాఫీ, రైతుబంధు, 24 గంటలు కరెంటు, మార్కెట్ గోదాముల నిర్మాణం లాంటి అనేక అంశాలు పేర్కొన్నారు. ఔచితివంతమైన చిత్రాలతో ఆకర్షణీయంగా ఉంది ఈ పుస్తకం గ్రంధం పేజీలు 784 ఇంత ఉద్గ్రంథం సంతరించిన నన్నపురాజు విజయశ్రీ అభినందనీయులు.

ప్రతులకు,
8-7-98/ పి 1/3, వయా కర్మన్ ఘాట్,
హస్తినాపురం పోస్టు, రంగారెడ్డి, హైదరాబాద్ - 500 079
ఫోన్ : 91004 39884



# కాసర్ల నిర్మించిన "కట్టడి"




కాసర్ల నరేష్ రావు వెలువరించిన 41 కవితలు ఉన్న కవితా సంపుటం ఇది. చక్కని చిక్కని కవితా సంపద నరేష్ రావు సొంతం.అతను ఇందులో వాడిన కాలమహావృక్షం, అహంకార సర్పం, సిరితిళ్ళు, ఆకుల ప్రయత్నాలు, దారి పాట, వెండి జాబిలీల ఇడ్లీలు, చెంపలు సముద్రాలు కావడం లాంటి రూపకాలు, భావ చిత్రాలు, పాఠకున్ని కట్టిపడేస్తాయి. కాలాన్ని అనుసరిస్తూ సమాజానికి అవసరమైన కవిత్వం రాసిన సామాజిక కవి కాసర్ల. నేనొక్కన్ని రాలిపోతే కాల మహావృక్షం నుండి రాలేది ఒక్క ఆకే కదా అని అనుకోకు నీ కుటుంబం పచ్చదనాన్ని కోల్పోతుందని గుర్తుంచుకో లాంటి సందేశం ఇచ్చే కవితలు ఈ సంపుటిలో కనిపిస్తాయి. కరోనాకాలంలో వచ్చిన పండుగలు, కర్ఫ్యూ వాతావరణం, పర్యావరణం, తీసుకోవలసిన జాగ్రత్తలు ఈ సంపుటిలో చేర్చారు కవి, వీటితోపాటు వలసవాదం, నగరం పక్షి, బెంగ, దీపం లాంటి విభిన్నమైన కవితలు కూడా ఉన్నాయి. అయితే ఈ కవి అక్కడక్కడ వచనమై తేలిపోయే ధోరణి పరిహరించుకోవలసి ఉంది, ఏమైనా పరిశోధకులు కవితా ప్రియులందరూ చదువదగిన సంపుటి ఇది.

**'కట్టడి'** కవితా సంపుటి, పేజీలు 65

ప్రతులకు కాసర్ల నరేష్ రావు
ఇ.నెం. 0-14-18, 70/1,
సీతారాంనగర్ కాలనీ, నిజామాబాద్
ఫోన్ : 94414 06252




# "నానీల సకినాలు" పంచుతున్న సుధా మైత్రేయి

"వాక్యం రసాత్మకం కావ్యం 'అన్న సంస్కృత ఉక్తికి ప్రత్యక్ష ఉదాహరణంగా నిలిచేది నాని. నాని అనే కవితా ప్రక్రియ తెలుగు సాహిత్యంలో కలిగించిన సంచలనం ఈరోజు ప్రత్యేకంగా ప్రస్తావించనవసరం లేదు. అక్షరాలను అధికంగా ప్రేమించే సుధ తన ప్రారంభ కవితావిన్యాసాన్ని నానీల రూపంలో బంధించడం మరింత ఆస్వాదనీయం. ఆమె చెప్పినట్టు

"అక్షరాలంటే
ప్రాణం నాకు
అందుకే నానిని బాహువుల్లో బంధించాను"

ఈ కవయిత్రి రాసిన నానీలలో అనేకసార్లు పుస్తకం పట్ల కవిత్వం పట్ల అలవోకగా అభిమానం వ్యక్తం అవుతుంటుంది.

"కడుపాకలి
అన్నం తీరుస్తుంది
మనసాకలి
పుస్తకం తీరుస్తుంది"

సుధారాణి నానీలలో సామాజిక కోణం ఆలోచనా పరుల్ని తట్టి లేపుతుంది. గోపి సార్ ముందుమాటలో అన్నట్టు "ఈమె నానీలు కవిత్వం ముద్దలు". 95 పేజీలున్న ఈ పుస్తకాన్ని సుధతమ తల్లిదండ్రులకు అంకితం చేసింది.

ప్రతులకు ప్లాట్ నెం. 52
స్పెక్ట్ అపార్ట్మెంట్
డిఫెన్స్ కాలనీ, సైనిక్ పురి
హైదరాబాద్ - 500 094
ఫోన్ : 99890 42236



## ప్రసన్నత మూర్తీభవించిన కవి... ఏనుగు నరసింహారెడ్డి

ప్రసన్నమైన కవిత్వానికి, ఆర్తి నిండిన కవిత్వానికి ఏనుగు నరసింహారెడ్డి చిరునామా అని తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు, తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అన్నారు. ఆదివారం నాడు సృజన భారతి సంస్థ తెలంగాణ సమావేశ మందిరంలో నిర్వహించిన సినారె సాహితి పురస్కారం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమానికి తెలుగు విశ్వవిద్యాలయ పూర్వ రిజిస్ట్రార్ డాక్టర్ టి. గౌరీ శంకర్ అధ్యక్షత వహించారు. విశిష్ట అతిథులుగా పాల్గొన్న తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ చైర్మన్ డాక్టర్ నందిని సిధారెడ్డి, డా॥ ఎం.కె. రాము, సభాప్రారంభకులుగా డాక్టర్ సి. మృణాళి, ఆత్మీయ అతిథులుగా డాక్టర్ నాళేశ్వరం శంకరం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏనుగు నరసింహారెడ్డి రాసిన "ఊహల వేదిక" అనే ఆధునిక కవిత్వ విమర్శ గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎం.కె. రాము, కొమ్మూరి ప్రసాద్, డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్, డా॥ ముదిగంటి సుజాతా రెడ్డి, డాక్టర్ చమన్, ఘనపురం దేవేందర్, కందుకూరి శ్రీరాములు, వేముల సత్యనారాయణ, సిహెచ్ ఉషారాణి, రఘువీర ప్రతాప్, డాక్టర్ చీదెళ్ళ సీతాలక్ష్మి, సాగర్లసత్తయ్య, డా॥ మండలస్వామి తదితరులు పాల్గొన్నారు.



## సాహితీమూర్తులను ఘనంగా గౌరవిస్తున్నాం

ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు ఉద్యమానికి దారి చూపిన సాహితీమూర్తులను పలురకాలుగా ఘనంగా గౌరవిస్తున్నారని, మహాకవి దాశరథి పేరిట డాక్టర్ అయాచితం నటేశ్వరశర్మకు తెలంగాణ ప్రభుత్వ అవార్డు ఈ సంవత్సరానికి గాను అందించడం ఎంతో ముదావాహమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ అన్నారు. జూలై 22న రవీంద్రభారతిలో డాక్టర్ దాశరథి జయంతి సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ఈ సభలో శాసనమండలి సభ్యులు గోరటి వెంకన్న, దేశపతి శ్రీనివాస్, గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ అయాచితం శ్రీధర్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు కేవీ రమణాచారి, తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీ శంకర్, నాటకాడమీ చైర్మన్ దీపికా రెడ్డి, అధికార భాషా సంఘం అధ్యక్షురాలు మంత్రి శ్రీదేవి, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకు డాక్టర్ మామిడి హరికృష్ణ, సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలా చారి, కవులు కాంచనపల్లి, దాసరి మోహన్, డాక్టర్ చమన్, ఘనపురం దేవేందర్, ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్ వి.పి చందన్ రావు దాశరథి కుమారుడు లక్ష్మణరావు, అల్లుడు గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన దాశరథి జీవిత చరిత్రను తెలియజేసే ఛాయాచిత్ర ప్రదర్శన అందరినీ అలరించింది.

## బాల సాహిత్యానికి పెండెం జగదీశ్వర్ సేవలు చిరస్మరణీయం

బాల సాహిత్యాన్ని ప్రోత్సహించడమే పెండెం జగదీశ్వర్ కు నిజమైన నివాళి అని మేడ్చల్ మల్కాజిగిరి అదనపు కలెక్టర్ డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి అన్నారు. సోమవారం నాగార్జున కళాశాలలో పెండెం జగదీశ్వర్ స్మారక జాతీయ పురస్కార ప్రదానోత్సవ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నరసింహారెడ్డి మాట్లాడుతూ జగదీశ్వర్ మరణానంతరం ఆయన మిత్ర బృందం జగదీశ్వర్ కీర్తిని చిరస్థాయిగా నిలిపేందుకు పురస్కారాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ప్రముఖ బాలసాహితీవేత్త డాక్టర్ దార్ల బుజ్జి బాబుకు పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పుప్పాల కృష్ణమూర్తి, మేరెడ్డి యాదగిరి రెడ్డి, కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, ఏబూషి నరసింహ, కూరెళ్ల శ్రీనివాస్, మాదగాని శంకరయ్య, పెరుమాళ్ళ ఆనంద్, డాక్టర్ ఉప్పల పద్మ, డాక్టర్ మండల స్వామి, సాగర్ల సత్తయ్య, బండారు శంకర్, డాక్టర్ చింతోజు మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా దాశరథి జయంతి వేడుకలు



తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో దాశరథి జైలు శిక్ష అనుభవించిన నిజామాబాద్ జిల్లాలో జూలై 22న "దాశరథి జయంతి వేడుకలు" ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు అవంతికుమార్ మాట్లాడుతూ దాశరథి పలికిన ప్రతి కవిత నినాదమై తెలంగాణను విముక్తి చేయడానికి ఆయుధాలుగా ఉపయోగపడ్డాయని అన్నారు. "నా తెలంగాణ కోటి రత్నాల వీణ" అన్న నినాదం ఎప్పటికీ నిలిచిపోయే నినాదమని వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి సాహిత్య విభాగం అధ్యక్షులు తిరుమల శ్రీనివాస్ ఆర్య, రాష్ట్ర కార్యదర్శి నరాల సుధాకర్, లక్ష్మీనారాయణ భరద్వాజ్, అపర్ణ, పులి జైపాల్, పంచరెడ్డి మురళి, సందీప్, ఆకాష్, విక్కీ, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

స్వీ కా రం




## పుత్తూరు పిల'గోడు'

ఆర్.సి. కృష్ణస్వామి రాజు
తిరుపతి
సెల్ : 9393662821

వెల : రూ. 160/-




## మధుపాళి మధు క(వితా)వనం

డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
కరీంనగర్
సెల్ : 99497 00037

వెల : రూ. 150/-




## కాలం మాట్లాడుతుంది

సావిత్రి రంజోల్కర్
సెల్ : 9833497812
నవి ముంబయి

వెల : రూ. 100/-




## కాలం కాన్వాస్ మీద

అనిశెట్టి రజిత
సెల్ : 98494 82462

నవోదయ బుక్ హౌస్
వెల రూ. 130/-




## చిన్ని చిన్ని సంగతులు

పి. శ్రీనివాస్ గౌడ్
సెల్ : 99494 29449
చీరాల

వెల : రూ. 150/-




## సంచారి

సైదాచారి మండోజు
నల్గొండ
సెల్ : 63002 35079

వెల రూ. 150/-




## ఉద్యమ బాటసారి

డా॥ వి. వీరాచారి

జనజీవన ప్రచురణలు
సెల్ : 9963610832
వెల : రూ.200/-




## జీవన గమనం

బి.ఎస్. రాములు
సెల్ : 8331966987

విశాల సాహిత్య అకాడమీ
సెల్ : 83319 66987
వెల : రూ.1,100/-




## ఆధునిక కథలు కొత్త కోరికలు

బి.ఎస్. రాములు
సెల్ : 8331966987

విశాల సాహిత్య అకాడమీ
సెల్ : 83319 66987
వెల : రూ.150/-




## క్రియ ఒక జీవన లయ

డా॥ ఎన్. గోపి

అభవ్ ప్రచురణలు
సెల్ : 9391028496
వెల : రూ.200/-

స్వీకారం కోసం మీ పుస్తకాలు ఈ చిరునామాకు పంపించండి వీలైతే సమీక్ష కూడా వేస్తాం.

**తెలంగాణ జాగృతి :** పాశం అమృతరాం రెసిడెన్సీ, ఇ.నెం. 1-2-234/13/46/4, 3వ అంతస్తు, ఎన్.టి.ఆర్. స్టేడియం దగ్గర, అరవింద్ నగర్, దోమలగూడ, హైదరాబాద్ - 500 029. తెలంగాణ. E-mail : editor@thangedu.co.in



సాహితీవేత్త, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు.

## దాశరథి రంగాచార్య

జయంతి : 1928, ఆగస్టు 24